తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

5-7-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 154 పేజీలు: 10+4 వెల: 6.50


**చర్చలూ ఆగలేదు.. యుద్ధమూ ఆపలేదు**

సిఎం కావాలనే కోరిక అలాగే ఉంది: డికె

5లో

# పట్టాదారు పాస్ పుస్తకాలు

## ఆగస్టు నుంచి కొత్త

పేదలకు ఇళ్ల స్థలాలపై రెవెన్యూ, మునిసిపల్, హౌసింగ్ మంత్రులతో సబ్ కమిటీ

2027 డిసెంబర్‌కు రీ సర్వే 2.0

ప్రొటోకాల్ విధుల నుంచి రెవెన్యూ సిబ్బందికి మినహాయింపు

రెవెన్యూ శాఖ రివ్యూలో సిఎం చంద్రబాబు



**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి ప్రజల సమస్యల పరిష్కారం ప్రధాన లక్ష్యంగా రెవెన్యూ శాఖ అనునిత్యం పనిచేయాలి, శాఖ పరిధిలో తెచ్చే ప్రతి కార్య క్రమం కూడా ఆ దిశగానే ఉండాలని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రెవెన్యూ శాఖ లో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపితే ప్రభుత్వానికి కూడా మంచి పేరు వస్తుందని గత ప్రభుత్వం కారణంగా తలెత్తిన సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రజలకు సాంత్వన చేకూర్చాలని సిఎం అన్నారు. ఈ విషయంలో గ్రామ స్థాయి ఉద్యోగి నుంచి రాష్ట్ర స్థాయి అధికారి వరకు సాంకేతికతను ఉపయోగించుకుని క్షేత్ర స్థాయిలో ఫలితాలు వచ్చేలా చూడాలని సిఎం సూచించారు. శుక్ర వారం సచివాయంలో రెవెన్యూ శాఖపై సిఎం చంద్రబాబు నాయుడు రెండు గంటల పాటు సమీక్ష చేశారు. భూ సమస్యలు, ప్రజల అర్జీలు, రెవెన్యూ శాఖలో సేవలు సులభతరం చేసేందుకు తీసుకుంటున్న చర్యలతో పాటు వివిధ అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ"అక్టోబర్ నాటికి ప్రతి ఒక్కరికీ శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలి. ప్రభుత్వం వచ్చిన తరువాత 43.89 లక్షల మందికి కుల ధ్రువీకరణ ప్రతాల అందేజేశారు. మిగిలిన వారికి కూడా వీటిని అందించాలి. ఒకసారి ధృవీకరణ పత్రం పొందితే, వారి కుటుంబ సభ్యులకు ఆటోమేటిక్ గా ఆ డాటా ఆధారంగా కుల ధృవీకరణ పత్రం వచ్చేలా చూడాలి. ఎస్సీలకు స్మశాన వాటికల స్థలాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలి. 363 హేబిటేషన్స్ కు స్మశాన వాటికలకు స్థలాలు ఇవ్వాలి. దీనికి భూసేకరణ కోసం రూ. 137 కోట్లు అవసరం. వచ్చే రెండు మూడేళ్లలో పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమం పూర్తి చేయాలి అన్నారు.

**జర్నలిస్ట్‌లకు ఇళ్ల స్థలాలు:** 'జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం గ్రాంట్స్ కింద ఇచ్చే అంశాన్ని పరిశీలించండి. ఈ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు ఉండ డంతో ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశంలో న్యాయ పరమైన సలహాలు తీసుకోండి. రాష్ట్రంలో ఇల్లు, ఇంటి స్థలంలేని వాళ్లు ఉండకూడదు. రెండేళ్లలో అందరికీ ఇంటి స్థలం ఇవ్వాలి. అలాగే మరో రెండేళ్లలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి. అంటే వచ్చే 4 ఏళ్లలో ప్రతి ఒక్కరికి ఇల్లు అనే లక్ష్యాన్ని చేరుకోవాలి. ఇళ్ల స్థలాలకు ఈ ఏడాది కాలంలో ఇప్పటి వరకు 99,390 మంది అప్లై చేశారు. దీని కోసం 2,051 ఎకరాలు అవసరం. మ్యానిఫెస్టో చెప్పినట్లు పట్టణాల్లో 2 సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్ల కోసం భూ సేకరణ సేకరణ చేసి ఇద్దాం. అర్బన్ లో టిడ్కో ఇళ్లు ఇస్తాం, రూరల్‌లో మూడు సెంట్లతో స్థలాలు ఇద్దాం. దీనిపై క్యాబినెట్ రెవెన్యూ, హౌసింగ్, మునిసి పల్ మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేద్దాం' అని సిఎం అన్నారు. రెవెన్యూ శాఖలో ప్రజల అర్జీపై అధికారులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వచ్చిన తరువాత నిర్వహించిన 17600 రెవెన్యూ సదస్సుల్లో 1.85 లక్షల దరఖాస్తులు ప్రజల నుంచి వస్తే వీటిలో 1,85,049 పరిష్కారం అయ్యాయి. ఇంకా 668 మాత్ర మే పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే ఏడాదిలో రెవెన్యూ శాఖలకు సంబంధించి 4,50,603 గ్రీవియన్స్ వచ్చాయి. వీటిలో 3,99,645 పరిష్కారం చూపాం. ఆటో మ్యూటేషన్స్‌లో 1.93 లక్షలు ధరఖాస్తులు వస్తే వాటిలో 1.77 లక్షలు పరిష్కరించాం. ప్రజల అర్జీల పరిష్కారం విషయంలో ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహి స్తున్నాం. అధి కారుల స్థాయిలో పరిష్కరించలేని సమస్యలు, న్యాయ పరమైన చిక్కులు ఉన్న సందర్భాల్లో ప్రజలకు వాటిపై వాస్తవాలు వివరిస్తున్నాం. గత ప్రభుత్వ అక్రమాలకు వేదికగా చేసుకున్న భూముల ఫ్రీ హోల్డ్ వ్యవహారంపై జీవోఎం 10 రకాల సూచనలు చేసింది. దీనిపై ఈ నెల 9వ తేదీన మరో మారు మంత్రుల సబ్ కమిటీ సమావేశం ఉంది అని అధికారులు వివరించారు. >>2



శుక్రవారం మార్కాపురంలో డి.సిఎం పవన్‌ను సన్మానిస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తదితరులు

## ఎన్డీయేలో భాగస్వామ్యం
# రాష్ట్రానికి వరం

### ప్రకాశం జిల్లాలో అతిపెద్ద మంచినీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన డి.సిఎం పవన్

### తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు

**ఒంగోలు-ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలకు తాగు నీరు కూడా ఇవ్వని వైసీపీ మాత్రం '2029లో మళ్లీ అధికారంలోకి వస్తాం, గొంతులు కోస్తాం, కుత్తుకలు కోస్తాం' అంటూ ఇష్టానుసారం మాట్లాడు తున్నారన్నారని అసలు వాళ్ళు మళ్లీ అధికారంలోకి వస్తే కదా.. మేం రానిస్తే కదా... అంటూ డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. వైసీసీ పాలకులు నిజంగా అద్భుతంగా పాలన అందిస్తే వైసీపీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితమై ఉండేది కాదని చెప్పారు. అధికారం >>2

## పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై
# తాజాగా విచారణ



### దేవాదాయ అధికారులకు హైకోర్టు ఆదేశం

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** బుగ్గ మఠానికి చెందిన 3.88 ఎకరాల భూమిని ఆక్ర మించిన వ్యవహారంలో మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై తాజాగా విచారణ జరపాలని దేవాదాయశాఖ అధికారులను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. బుగ్గమఠానికి చెందిన 3.88 ఎకరా భూమిని ఖాళీ చేయాలని, అందులో నిర్మాణాలను తొలగిం చాలంటూ మఠం ఈవో/అసిస్టెంట్ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే దేవా దాయ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని ఇటీవల హైకోర్టు సింగిల్ జడ్జి గతంలో ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలుచేస్తూ పెద్దిరెడ్డి ధర్మా సనం ముందు అప్పీల్ వేశారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాద నలు వినిపించారు. తమ వాదనలు వినకుండా, కోరిన దస్త్రాలు ఇవ్వకుండా మఠం ఈవో ఉత్తర్వులిచ్చారన్నారు. వాటిని రద్దు చేయాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం, మఠం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మఠం భూములను ఆక్రమించారన్నారు. 3.88 ఎకరాల విషయంలో ఆయన వద్ద ఎలాంటి దస్త్రాలు లేవన్నారు. మఠం వద్ద ఉన్న దస్త్రాలను మీరే ఇవ్వండి అంటూ వ్యవహారాన్ని సంక్లిష్టం చేస్తున్నారన్నారు. అధికారులపై నిరాధార ఆరోపణలు చేస్తున్నా రన్నారు. దస్త్రాలు ఇచ్చేందుకు అభ్యంతరం లేదన్నారు. తిరుపతి పట్టణం, ఎంఆర్ పల్లి పరిధి సర్వే నంబరు 261/1లో 1.50 ఎకరాలు, 261/2లో 2.38 ఎకరాల(మొత్తం 3.88)కు సం బంధించిన దస్త్రాలను వారం రోజుల్లో పెద్దిరెడ్డికి ఇవ్వాలని, తర్వాత వివరణ తీసుకోని మొత్తం నాలుగు వారాల్లో విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేసింది.

అందుకు ముందు విచారణ జరిపిన మఠం ఈవో/అసిస్టెంట్ కమిషనర్‌తో కాకుండా మరో అధికారితో విచారణ జరిపించాలని పెద్దిరెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది అభ్యర్థిస్తున్న నేప థ్యంలో మరో అధికారితో విచారణ జరిపించాలని ఆదేశించింది. 3.88 ఎకరాలను ఖాళీచేయా లంటూ మఠం ఈవో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. తాజాగా విచారణ జరిపాక ప్రతికూల ప్రభావం చూపేలా ఉత్తర్వులుంటే వాటిపై పెద్దిరెడ్డి అప్పీల్ వేసుకోవడానికి >>2



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

## కలుషితాహారంతో విద్యార్థులకు అస్వస్థత

### పాఠశాలలో 265 మంది విద్యార్థులు

### ప్రభుత్వాసుపత్రిలో చికిత్స

**గోరంట్ల (సోమందేపల్లి), జులై 4 ప్రభాతవార్త:** సోమందేపల్లి మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామం వద్ద వున్న కెజిబివి పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థ తకు గురయ్యారు. కెజిబివి పాఠశాలలో 265 మంది విద్యార్థులు చదువుతున్నారు. గురువారం మధ్యాహ్నం విద్యార్థులు భోజనం చేసిన తర్వాత ఐరన్ టాబ్లెట్లు వేసుకున్నారని, సాయంత్రం పలువురు విద్యార్థులు వాంతులు చేసుకోవడంతో అస్వస్థతకు గురయ్యారని మరికొందరు విద్యార్థులు జ్వరంతో బాధపడుతూ ఉండడంతో పరిస్థితి గమనించిన >>2

# 10న పండుగలా మెగా పిటిఎం

**విజయవాడ.జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 10వతేదీన ప్రభుత్వ పాఠ శాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించే మెగా పిటిఎం కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, సమగ్ర శిక్ష, ఉన్నత విద్యాశాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యా యులందరినీ మెగా పిటిఎంలో భాగస్వాములను చేయాలని అన్నారు. ప్రతి విద్యార్థికి పర్యావ రణంపై అవగాహన కల్పిస్తూ పాఠశాలల్లో ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేసి, మొక్కల పెంపకంపై విద్యార్థులను చైతన్యపర్చి, పరిరక్షించేలా ప్రతి విద్యార్థికి గ్రీన్ పాస్ పోర్టు అందించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని హైస్కూళ్లలో ఇంటర్నెట్, కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. రాష్ట్రానికి మంజూరైన 125 ఆటిజం సెంటర్ల ఏర్పాటు, భవిత సెంటర్ల మరమ్మతులకు చర్యలు తీసుకోండి. అగస్త్య ఫౌండేషన్ భాగస్వామ్యంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 5 అధునాతన రీజనల్ సైన్స్ సెంట ర్లను విద్యార్థులకు ఉపకరించేలా హబ్ అండ్ స్పోక్ మోడల్ లో నిర్వహించండి. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్, ఒకేషనల్ విద్య, వ్యక్తిగత భద్రతపై శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపట్టండి.

**విద్యాప్రమాణాల మెరుగుదలకు కృషిచేయండి:** గిరిజన ప్రాంతాల్లోని మారుమూల స్కూళ్లకు మొబైల్ నెట్ వర్క్ ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. గిరి జన ప్రాంతాల్లోని విద్యార్థులు స్కూళ్లకు చేరుకునే క్రమంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధ్య యనం చేసి, అవసరమైన చోట నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో 1నుంచి 10వతరగతి వరకు అడ్మిషన్ల పురోగతిపై మంత్రి సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగు దలకు కేంద్రం విడుదల చేసిన పరాక్ రాష్ట్రీయ సర్వేక్షన్ -2024 (నాస్) లోని అంశాలను పరిశీ లించి, రాష్ట్రంలో విద్యాప్రమాణాల మెరుగుదలకు నిర్మాణాత్మక చర్యలు చేపట్టండి. వైసిపికి చెందిన వారు 32 కేసులు వేసినప్పటికీ వాటన్నింటినీ అధిగమించి విజయవంతంగా మెగా డిఎస్సీని నిర్వహించిన తీరుపై మంత్రి సమీక్షించారు. ఆగస్టునాటికి ఎంపికైన టీచర్లకు నియామక ఉత్తర్వులు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. హైస్కూలు ప్లస్ స్కూళ్లలో అధ్యాపకుల నియామకంపై చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్ సూచించారు.

డిగ్రీ విద్యార్థుల సబ్జెక్టుల ఎంపికకు సంబంధించి ఉన్నత విద్యామండలి ప్రతిపాదనలు, దేశంలోని ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాల క్రెడిట్ ఫ్రేమ్ వర్క్ ను సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం విద్యార్థులపై భారం తగ్గేవిధంగా యుజిసి నిబంధనలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. డిగ్రీ అడ్మిషన్లపై మంత్రి సమీక్షిస్తూ విద్యార్థులతోపాటు కళాశాలలకు కూడా ఆన్ లైన్, ఆఫ్ లైన్ దరఖాస్తులకు అవకాశం కల్పించాలని సూచించారు. కళాశాలలు భర్తీచేసే సందర్భంలో విద్యార్థుల అంగీకారాన్ని ఆధార్ అథెం టికేషన్‌తో అనుసంధానించాలని సూచిం >>2



శుక్రవారం ఉన్నత, పాఠశాల విద్య ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేష్

### డిగ్రీ విద్యార్థులపై భారం తగ్గేలా సబ్జెక్టుల ఎంపిక

### కొత్త వర్సిటీల ఏర్పాటుకు చర్యలు


### గిరిజన ప్రాంతాల్లో స్కూలు భవనాలు: మంత్రి లోకేష్



## తొక్కిసలాట ఘటనపై
# నేడే నివేదిక

### క్యూలైన్ల క్రమబద్ధీకరణపై సూచనలు

**తిరుపతి,జూలై 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో ఈ ఏడాది జనవరిలో తిరుమలేశుని దర్శనాల టోకెన్లకోసం జరిగిన తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణ కమిషన్ ఛైర్మన్,విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్య నారాయణమూర్తి నివేదించనున్న 200పేజీల రిపోర్టు కీలకంగా మార నుంది. ఈ రిపోర్టులో జనవరి 8వతేదీ తిరుపతిలోని పలు చోట్ల భారీగా భక్తులు చేరుకున్నా క్యూలైన్ల నిర్వహణ, భక్తుల రద్దీ నియం త్రణ, సౌకర్యాలు లేమి, భద్రత వైఫల్యాలు, అదికారుల నిర్లక్ష్యం వంటి కీలక అంశాలను పొందుపరిచినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో గత నాలుగునెలలుగా క్షేత్రస్థాయిలో పర్యటించి, పలువురు బాధితులైన సాక్షులను, విదుల్లో నిమగ్నమైన కీలక అధికారులను పిలిపించుకుని సమాచారం రాబట్టారు. ఈ మొత్తం సాక్ష్యాలను నిదేదిక రూపంలో, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన అంశాలు, రద్దీ నియంత్రణ పై సూచనలు చేయడం ఉందనేది సమాచారం. జనవరి 10నుండి 19వరకు తిరుమల ఆలయంలో పవిత్రమైన వైకుంఠ ద్వారదర్శనాలకు రమ్మని పిలవడం, తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీకి ముందు తగిన జాగ్రత్తలు, ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించలేకపోవ డమే తొక్కిసలాటకు కారణమని పలువురు బాధితులు ఇచ్చిన సమా చారం. ఆధారాలను జస్టిస్ సత్యనారాయణమూర్తి నమోదు చేశారు. అంతేగాక ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణమని పేర్కొన్నట్లు విశ్వసనీయ సమాచారం. టిటిడి, పోలీసు ,రెవన్యూ జిల్లా యంత్రాం గం అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని, ఆరుగురు మృతిచెందారని బాధితకుటుంబాలకు చెందిన >>2

# పట్టాదారు పాస్ పుస్తకాలు

>> జీవోఎం ఇచ్చిన 10 సూచనల్లో 8 సూచనలకు సిఎం కూడా అంగీకారం తెలిపారు. దీనిపై మంత్రుల కమిటీలో మరింత చర్చించి ప్రభుత్వం ముందుకు వెళ్లనుంది. అక్టోబర్ నాటికి ఫ్రీ హోల్డ్ అంశానికి పూర్తి పరిష్కారం చూపాలని, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులకు స్పష్టం చేశారు.

**సర్వే రాళ్లపై బొమ్మల తొలగింపు పూర్తి :** ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్ సర్వే రాళ్లపై తన బొమ్మలు ముద్రించుకున్నాడు. వీటికి సంబంధించి 77.9 లక్షల సర్వే రాళ్లపై పేర్లు, బొమ్మల తొలగింపు పూర్తి చేశారు. అలాగే సర్వే పూర్తయిన భూ యజమానులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను ఆగస్టు నాటికి అందచేయండి. ముద్రణ పూర్తి చేసి 21.86 లక్షల మందికి తొలివిడతగా పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వండి. ప్రతి పట్టా దారు పాసు పుస్తకంపై క్యూఆర్ కోడ్ తో పాటు ఆధార్ కార్డు ఆధారంగా ప్రతి భూ యజమాని తమ భూమి వివరాలు వ్యక్తి గతంగా తెలుసుకునే వెసులుబాటు కల్పించాలి. ఆధార్ కార్డు తో సమగ్ర భూ వివరాలు రావాలి. తమ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియాలి. అదే విధంగా ప్రభుత్వం తెచ్చిన కొత్త జీవోలు, పాలసీలకు అనుసరించి....అన్ని ఉత్తర్వులతో కలిపి కొత్త రెవెన్యూ మాన్యువల్ ఆగస్టు నాటికి తేవాలి. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ధరఖాస్తుల పరిష్కారంపై ప్రైవేటు టీంతో ఆడిటింగ్ చేయాలి. అప్పుడు సమస్యల పరిష్కారం పై ఒక అంచనా వస్తుంది. అలాగే ప్రజలు అనధికారికంగా ఉంటున్న అభ్యంతరం లేని ప్రాంతాల్లో రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి. ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలి. డిసెంబర్ లోపు ఈ తరహా అన్ని ధరఖాస్తులు పరిశీలించి రెగ్యులరైజేషన్ పూర్తి చేయాలి. వాట్సాప్ గవర్నెన్స్ లో 56 సర్వీసులు ఉన్నాయి. వాడుకలో లేని సర్వీసులను తొలగించాలి. మన మిత్రలో 9 లక్షల మంది సర్వీసులు కోసం రిక్వెస్టులు పెట్టారు. అయితే సర్వీసులు పొందిన వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారా లేదా అనేది కూడా చూడాలని అన్నారు. రెవెన్యూ అధికారులపై తీవ్రమైన పని ఒత్తిడి ఉంటుందని..దీని కారణంగా కూడా సేవల విషయంలో పూర్తి స్థాయి ఫలితాలు రావడం లేదని అధికారులు తెలిపారు. జిల్లాలకు, తమ ప్రాంతానికి ఏ మంత్రి వచ్చినా, మరే అధికారి వచ్చినా ప్రోటోకాల్ విధులు తాసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు చూస్తున్నారని.. దీని కారణంగా వారి అసలు పని మరుగున పడుతుందని సిఎం దృష్టికి తెచ్చారు. దీనిపై సిఎం మాట్లాడుతూ రెవెన్యూ అధికారులకు ప్రోటోకాల్ డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని చెప్పారు. జిల్లాల్లో కూడా జిఎడి తరుపున ప్రోటోకాల్ నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని అన్నారు. దీని కోసం జిల్లా స్థాయిలో అవసరమైన విధంగా ప్రోటోకాల్ విభాగాన్ని ఏర్పాటు చేసుకోవాలని సిఎం సూచించారు.

**భూ వివరాలు కనిపించేలా పోర్టల్:** రెవెన్యూ శాఖ తీసుకువస్తున్న కొత్త పోర్టల్ గురించి రివ్యూ లో అధికారులు సిఎంకు వివరించారు. రాష్ట్ర పరిధిలో ఏరకమైన ల్యాండ్ ను అయినా ఆ పోర్టల్ ద్వారా ఫిజికల్ గా చూడవచ్చు. పోర్టల్ లో సదరు ల్యాండ్ ను మార్క్ చేయగానే ఆ ల్యాండ్ యజమాని నుంచి సమస్త వివరాలు అక్కడ కనిపిస్తాయి. హద్దులతో సహా ఆ ల్యాండ్ వివరాలు తెలుసుకోవచ్చు.

ఆ ప్రాంతంలో ఉన్న అడవులు, ప్రభుత్వ భూములు, రోడ్లు, నీటి ప్రాంతాలు, చెరువులు, ఆక్రమణల్లో ఉన్న స్థలాలు, వివాదాల్లో ఉన్న స్థలాల వివరాలు కూడా స్క్రీన్ మీద కనిపిస్తాయి. ఎవరైనా భూమి అమ్మాలన్నా కొనాలన్నా కూడా పక్కాగా ల్యాండ్ ఎవరి పేరుతో ఉందో చూడా చూడవచ్చు అని అధికారులు సూచించారు. ఇతర శాఖలతో కూడా సమన్వయం చేసుకుని ఈ పోర్టల్ ను సమగ్రంగా తీసుకురావాలని సిఎం సూచించారు. దీనికి ఆలోచించి మంచి పేరు పెట్టాలని అధికారులకు సిఎం సూచించారు. గతంతో పోల్చుకుంటే రెవెన్యూ శాఖ పనితీరు కొంత గాడిన పడిందని సిఎం పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో, పూర్తి స్థాయి సంతృప్తి సాధించడంలో మరింత ఎఫెక్టివ్‌గా పనిచేయాలని సూచించారు. సమీక్షలో మంత్రి అనగాని సత్య ప్రసాద్, సిసిఎల్ జి. జయలక్ష్మితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



శుక్రవారం అమరవీరుడు అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబు

## మహనీయుల సేవలను స్మరించుకుందాం: సిఎం చంద్రబాబు

### అల్లూరి, పింగళి, వివేకానంద, మాజీ సిఎం రోశయ్యకు సిఎం నివాళి

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** మన్యం ప్రజల మాన,ప్రాణ రక్షణ కోసం తెల్లదొరలను ఎదిరించి తన ప్రాణాలనే అర్పించిన త్యాగ మూర్తి, భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని విప్లవం వైపు నడిపించే స్ఫూర్తిని అందించిన తెలుగు వీరుడు అల్లూరి సీతారామరాజు అని ఏపీ సీఎం చంద్రబాబు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా ఆ వీరుని దేశభక్తిని,ప్రజా పోరాటాన్ని స్మరించుకుందామని చెప్పారు.ఆయన చిత్రపటానికి సీఎం చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. మన్యం ప్రజల మాన,ప్రాణ రక్షణ కోసం తెల్లదొరలను ఎదిరించి తన ప్రాణాలనే అర్పించిన త్యాగమూర్తి అని కొనియాడారు. ఆయన 125వ జయంతి సం దర్భంగా ఆ వీరుని దేశభక్తిని,ప్రజా పోరాటాన్ని స్మరించుకుందామని చెప్పారు.జీవితంలో ప్రతి నిముషాన్ని సద్వినియోగం చేసుకుంటే ఏదైనా సాధించగలమని వివేకానంద చరిత్ర చెబుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కేవలం తన మూడు పదుల జీవితకాలం లోనే భారతీయ సంస్కృతిని,ఆధ్యాత్మిక విశిష్టతను ప్రపం చవ్యాప్తం చేయడంతో పాటు యువతను కార్యశూరులుగా తయారుచేసే స్ఫూర్తిదాయక భోధనలను అందించిన స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఆయన స్మృతికి నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. దేశ ఆత్మ గౌరవ ప్రతీక అయిన జాతీయ పతాకాన్ని రూపొందించిన ౧ పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా ఆ మహానుభావుని నిస్వార్థ దేశసేవను స్మరించుకుందామని పిలుపునిచ్చారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్యకు చంద్రబాబు నివాళిని అర్పించారు.రాజకీయ చతురత తెలిసిన రాజకీయనేత కె.రోశయ్య అని చంద్రబాబు శ్లాఘించారు. విలువలకు లోబడి రోశయ్య పని చేసారన్నారు.ఆయన తమిళనాడు గవర్నర్‌గాను రాణించారని ప్రశంసించారు.

## కుమారులు అకీరానందన్, మార్క్ శంకర్‌తో పవన్ కల్యాణ్



**విజయవాడ, జులై 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన కుమారులతో ఉన్న ఫోటో వైరల్‌గా మారింది. పెద్దకుమారుడు అకీరా నందన్ చిన్న కుమారుడు మార్క్‌శంకర్‌లతో కలిసి శుక్రవారం ఆయన మంగళగిరిలోని తన నివాసానికి చేరుకున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోను అభిమానులు షేర్ చేస్తున్నారు.తండ్రీ తనయులు అనే క్యా ప్షన్‌తో ఫ్యాన్స్ దీన్ని పంచుకుంటున్నారు. మంగళగిరి చేరుకున్న పవన్ అధికారులతో పార్టీ ప్రతినిధులతో కలిసి ముఖ్యమైన విషయాలపై చర్చించారు.

## 10న పండుగలా మెగా పిటీఎం

>> చారు. నిర్ణీత కటాఫ్ తేదీ తర్వాత ప్రతిభ ఆధారంగా కన్వీనర్ కోటా సీట్లు కేటాయించాలని అన్నారు. 202425 సంవత్సరానికి సంబంధించి ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు.

**ఆర్‌జెయుకెటిల్లో కంప్యూటర్ ల్యాబ్‌లకు చర్యలు:** రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలను ఒకే గొడుగు కిందకు తెచ్చే యూనిఫైడ్ యాక్ట్, ప్రైవేట్ యూనివర్సిటీల్లో జాయింట్ సర్టిఫికేషన్ విధివిధానాలపై చర్చించారు. నిర్ణీత క్యాలెండర్ ప్రకారం అన్ని సెట్ లను పూర్తిచేసి, సకాలంలో అడ్మిషన్లు పూర్తిచేయాలని అన్నారు. ఆర్ జెయు కెటిల్లో అధునాతన కంప్యూటర్ ల్యాబ్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో నూతన యూనివర్సిటీల పురోగతిపై మంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో వర్సిటీల ఏర్పాటుకు ముందుకువచ్చిన యాజమాన్యాలతో మాట్లాడాలని, యూనివర్సిటీల ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఉన్నత విద్యాశాఖ డైరక్టర్ నారాయణ్ భరత్ గుప్త, పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరక్టర్ బి.శ్రీనివాసరావు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై తాజాగా విచారణ

>> వెసులుబాటు ఇచ్చింది. ఆ ఉత్తర్వుల ఆధారంగా మూడు వారాలపాటు చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది.

## తొక్కిసలాట ఘటనపై నేడే నివేదిక

>> ప్రత్యక్షసాక్షులు కమిషన్‌కు తమ వాంగ్మూలం ఇచ్చారు. 50మందివరకు తీవ్ర క్షతగాత్రులవడం విదితమే. జడ్జి విచారణ చేయడంతో బాధితులు దీనివెనుక అధికారుల నిర్లక్ష్యమే కారణమని తేల్చారు. అక్కడ పోలీసులు సరిగా పట్టించుకుని భద్రత కల్పించలేకపోవడంతో విశాఖకు చెందిన శాంతి మృతి చెందిందని వెంకటేశ్ ఇప్పటికే కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. పాలకొల్లుకు చెందిన ధనకుమార్ అనే ప్రత్యక్షసాక్షి తిరుపతి ఘటనపై కొన్ని విషయాలు వెల్లడించారు. పూర్తిగా పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తొక్కిసలాట కారణమన్నారు. భారీగా వచ్చిన భక్తులకు భద్రత కల్పించలేకపోవడం ఏమిటనే అంశంపై కమిషన్ ఇప్పుడు నివేదిక ఇవ్వనుంది. ఈ నివేదిక ఆధారంగా ఆ రోజు విధుల్లో ఉన్న కొందరు సిఐలు, ఎస్ఐలపై చర్యలు తీసుకునే అవకాశం ఉందనేది సంచలనంగా మారింది. భక్తుల భద్రతలో, రద్దీని నియంత్రించడంలో టిటిడి అధికారులు, బందోబస్తుకు వచ్చిన పోలీసులు, రెవెన్యూ విభాగం కూడా పూర్తిగా విఫలమైందనేది ప్రధాన ఆరోపణ.

## విద్యార్థులకు అస్వస్థత

>> కెజిబివి ప్రత్యేక అధికారి అనిత వారిని హుటాహుటిన ప్రభుత్వాసుపత్రులకు తీసుకెళ్లి చికిత్సలు చేయించారు. అయితే తిరిగి వచ్చిన విద్యార్థులు రాత్రి మరోసారి వాంతులు చేసుకోవడంతో విషయాన్ని మండల వైద్యాధికారి ఓంకార్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన హుటాహుటిన సిబ్బందితో కలిసి వాంతులు చేసుకొన్న 19మంది, జ్వరంతో బాధపడుతున్న 14 మంది విద్యార్థినిలను పరీక్షించి చికిత్సలు నిర్వహించారు. పరిస్థితి గమనించిన మండల విద్యాధికారి ఆంజనేయులునాయక్ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. దీంతో వెంటనే పెనుకొండ ఆర్డీఒ ఆనంద్‌కుమార్ జిల్లా ఉపవైద్యాధికారి మంజువాణిలు అక్కడికి చేరుకుని ఆస్వస్థతకు గల కారణాలను ప్రత్యేక అధికారి అనితను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో వారు హుటాహుటిన పాఠశాల వద్దకు చేరుకొని ఆందోళన చెందారు. అయితే లోపల విద్యార్థులకు వైద్య పరీక్షలు జరుగుతున్నాయని లోనికి వెళితే ఇన్ఫెక్షన్ అయ్యే అవకాశం వుందని చెప్పి వారిని అక్కడే వుంచడంతో వారు చాలా సేపు ఆందోళన చెందారు.

**విద్యార్థులను పరామర్శించిన వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ :** విషయం తెలుసుకున్న సత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గం సమన్వయ కర్త ఉషశ్రీచరణ్ అక్కడకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థినులు నీరసంగా వుండడంతో వైద్యాధికారి ఓంకార్‌ను పిలిచి వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు అందించాలని చెప్పడంతో ఇప్పటికే వైద్య పరీక్షలు చేశామని ఒక గంట తరువాత వారి పరిస్థితి అలాగా వుంటే తప్పక తరలిస్తామని చెప్పారు. అయితే విద్యార్థుల పరిస్థితి చూసిన ఉషశ్రీచరణ్ మాత్రం వెంటనే వారికి మంచి వైద్యం అందించాలని అక్కడే వున్న జిల్లా వైద్యాధికారికి చెప్పారు. ఇదే విషయంపై మాట్లాడుతుండగా అక్కడకు వచ్చిన పెనుకొండ సిఐ రాఘవన్ అందరూ బయటకు వెళ్లాలని, పిల్లలకు ఇబ్బంది లేకుండా దయచేసి సహకరించాలని కోరారు. మంత్రి వస్తున్నారని బయటకు వెళ్లాలని ఉషశ్రీచరణ్‌కు తెలిపారు. వైద్యులు అవసరమైతే విద్యార్థులను తప్పక ఆసుపత్రికి పంపిస్తారని మీరు బయటకు వెళ్లాలని చెప్పడంతో అగ్రహం చెందిన ఉషశ్రీచరణ్ మండల వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మంత్రి వచ్చేంతవరకు విద్యార్థులను ఆసుపత్రికి పంపమని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పాఠశాలలో రాజకీయాలు అవసరం లేదని ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతసేపైన ఆమె కదలకపోవడంతో ఆసుపత్రికి తరలించడానికి వచ్చిన అంబులెన్స్‌కు దారి వదలకపోవడంతో అక్కడే వున్న కొందరు టిడిపి నాయకులు వైసిపి నాయకులతో వాదోపవాదానికి దిగారు. ఇక్కడ ఆందోళన చేయాల్సిన అవసరం లేదని టిడిపి నాయకులు చెప్పడంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. దీంతో విషయం చేయి దాటిపోతుందని భావించిన పోలీసులు వెంటనే అక్కడ నుండి ఉషశ్రీచరణ్‌తో పాటు వైసిపి నాయకులను పంపించి వేశారు.

## ఎన్డీయేలో భాగస్వామ్యం రాష్ట్రానికి వరం

>> లేనప్పుడే వైసీపీ గూండాగిరి, రౌడీయిజాన్ని ఎదుర్కొని పోరాటం చేసిన వాళ్లమని. ఇప్పుడు వైసీపీ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ప్రభుత్వం కాదు తప్పులు చేసే వారిని శిక్షించే ప్రభుత్వం అని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు.

శుక్రవారం మార్కాపురం నియోజకవర్గం నరసింహపురంలో జల్ జీవన్ మిషన్ కింద రూ.1290 కోట్లతో చేపట్టిన అమృతధార తాగు నీటి పథకానికి డిప్యూటీ సిఎం శంకుస్థాపన చేశారు. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతానికి తాగు నీరు అందించే ప్రాజెక్టు ఇది. 1290 కోట్ల రూపాయలతో 18 మండలాలకు 500 నాలపై గ్రామాలకు త్రాగునీరు అందించే త్రాగునీటి పథకానికి సభాస్థలి పైన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి సభలో ఆయన మాట్లాడారు. ముందు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి అంజలి ఘటించారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా అంటే గుర్తుకొచ్చేది ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ఉద్యమంలో పాల్గొని కాల్చుకోండి అని ధైర్యంగా గుండెలు చూపించిన ధీశాలి, ధైర్యం లేని సమాజంలో ధైర్యాన్ని నింపారన్నారు. అలాంటి మహానుభావులు పుట్టిన నేలఇది. ఇలాంటి నేల చాలా నిర్లక్ష్యానికి గురయిందని ఇక్కడ యువతలో ఆవేదన ఉంది. దశాబ్దాలుగా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాలేదని, చుక్క తాగునీరు లేక ఊళ్లకు ఊళ్లు ఖాళీ అయిపోయాయని, ఉపాధి కోసం లక్షలాది మంది వలసలు వెళ్లిపోవల్సి వస్తుందని యువత ఆవేదన చెందుతున్నారు. మీ ఆవేదన అర్థం చేసుకున్నాం కనుకే ప్రకాశం జిల్లాలో స్వాతంత్రం వచ్చిన తరువాత అతి భారీ మంచినీటి ప్రాజెక్టు రూ. 1290 కోట్లతో జల్ జీవన్ పనులు ప్రారంభిస్తున్నామని. ఇది కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. పశు సంపదకు కూడా నీరు లేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వాటికి కూడా పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మించే కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

**వైకాపా దెబ్బకు నిలిచిపోయిన జల్‌జీవన్ మిషన్:** జల్ జీవన్ మిషన్ పథకం గౌరవ ప్రధా నరేంద్ర మోడీ కలల ప్రాజెక్ట్. దేశంలో ప్రతి ఒక్కరి గొంతు తడపాలన్నదే ఆయన ఆకాంక్ష అన్నారు. ఈ పథకం కింద గత ప్రభుత్వానికి 2019 24 మధ్య రూ. 26 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తే... కేవలం రూ. 4 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. కనీసం మ్యాచింగ్ గ్రాంట్ కూడా ఇవ్వలేదు. ఖర్చు చేసిన సొమ్ముతో ఏ ఒక్కరి దాహం తీర్చలేదు. కేవలం పైపులు వేసి చేతులు దులుపుకొన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జల్ జీవన్ మిషన్ మీద పథకం మీద సమీక్షించినప్పుడు పథకం గడువు తీరిపోతుందని, కేంద్రం కూడా పథకం అమలు తీరుపై అసంతృప్తిగా ఉందని తెలిసిందని, అద్భుతమైన ఈ పథకం ఉపయోగించుకుంటే రాష్ట్రంలో తాగునీటి కొరత లేకుండా చూడవచ్చనే అభిప్రాయంతో జలజీవన్ మిషన్ పథకం గురించి కేంద్ర జలశక్తి మంత్రి శ్రీ సీఆర్ పాటిల్ గారితో పలుమార్లు నేను, ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించామనానన‌రు. . ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి కూడా విన్నవించామన్నారు. జల్ జీవన్ మిషన్ పథకానికి రాష్ట్రంలో రూ. 84 వేల కోట్లు అవసరం అవుతుందని, పథకం గడువు పెంచాలని విన్నవించామని పేర్కొన్నారు.

**కూటమి ప్రభుత్వం అంటే పిడికిలికి ఉన్న శక్తి:** ఇంట్లో తల్లిదండ్రులు తిట్టుకొని నిద్రలేస్తే పిల్లలు కొట్టుకొని నిద్రలేస్తారు.అంటూ అంటుంటారని, అయితే కూటమిలోని మూడు పార్టీల నాయకులు నిరంతరం సమన్వయంగా పని చేయాల్సి న అవసరం ఉందన్నారు. వైసీపీ మన మధ్య ఎల్లప్పుడు ఏదో ఒక ఘర్షణ నింపాలని చూస్తోందని, చిన్న విషయాలను పెద్దవి చేసి చూడకండన్నారు. పంచాయతీ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిరంతరం ఒకరిని ఒకరు గౌరవించుకోవాలని ఒకరి అభిప్రాయాలకు ఒకరు విలువ ఇవ్వాలన్నారు. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులు తెలుగుదేశం ప్రభుత్వం పై బురద జల్లుతున్నారని కానీ గత పాలకులు పథకాలకు రెండు లక్షల పదివేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని మిగతా 7 లక్షల 60 వేల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? అంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ప్రకాశం జిల్లాకి చెందిన శాసన సభ్యులు,కందుల నారాయణరెడ్డి,బి.ఎన్. విజయ్ కుమార్, దామచర్ల జనార్ధనరావు, ముత్తుమల అశోక్ రెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి , ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ , మాల వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ డా.పెదపూడి విజయ్ కుమార్, ఏపీ అగ్రి మిషన్ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, జనసేన పార్టీ జిల్లా ఇంఛార్జ్ షేక్ రియాజ్, మార్కాపురం జనసేన ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ , జిల్లా ఉన్నతాధికారులు, మార్కాపురం ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



శుక్రవారం ట్రినిడాడ్-టొబాగో గౌరవ పురస్కారం అందుకుంటున్న ప్రధాని మోడీ

## ప్రధానిమోడీకి ట్రినిడాడ్ టొబాగో అత్యున్నత పురస్కారం

**పోర్టాఫ్ స్పెయిన్, జులై 4:** ఐదుదేశాలపర్యటనలోభాగంగా ట్రినిడాడ్ టుబాగో దేశ పర్యటనలో ఉన్న ప్రధానిమోడీకి ఆదేశ అత్యున్నత పురస్కారంతో గౌరవించింది. ప్రధానిమోడీ కి 'ఆర్డర్ ఆఫ్‌ది రిపబ్లిక్ ఆఫ్‌ట్రినిడాడ్ అండ్ టొబాగో' పురస్కారం లభించింది. కారికోమ్ భాగస్వామి మాత్రమేకాకుండా ట్రినిడాడ్ టొబాగో భారత్‌తో దశాబ్దాల తరబడి సంస్కృతి సాంప్రదాయాలను పంచుకుంటున్నదని, 140 కోట్లమంది భారతీయుల తరపున తనకు ఈ దేశం అత్యున్నత పురస్కారం ఇవ్వడం తనకు లభించిన అరుదైన గౌరవమని ప్రధానిమోడీ అన్నారు. ట్రినిడాడ్‌టొబాగో ప్రధాని కమ్లా పెర్సాద్ బిస్సెసర్, అద్యక్షుడు కంగాలూల చేతులమీదుగా ఈపురస్కారం అందుకున్నారు. గ్లోబల్ సౌత్ అభ్యున్నతికి ఆదేశాలమధ్య సంబంధాలను మరింతపెంపొందించడంలో భారత ప్రధాని మోడీచేసిన అవిరళ కృషికి నిదర్శనంగా ఈ పురస్కారం ప్రధానంచేస్తున్నట్లు ట్రినిడాడ్‌ప్రధాని కమ్లా పెర్సాద్ పేర్కొన్నారు.

### ట్రినిడాడ్ టొబాగో ప్రధానికి మోడీ స్పెషల్ గిఫ్ట్!

**పోర్ట్‌ఆఫ్‌స్పెయిన్, జులై 4:** భారత ప్రధాని నరేంద్ర మోడీ, కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగోతో మన దేశానికి ఉన్న బలమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక బంధాలను చాటిచెప్పారు. తన పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధాని కమలా ప్రసాద్ బిస్సెస్సర్ కు అయోధ్య రామ మందిర నమూనాను ప్రత్యేక కానుకగా అందజేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ట్రినిడాడ్ వెళ్లిన ప్రధాని మోదీ గౌరవార్థం ప్రధాని కమలా ప్రసాద్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మోదీ, అయోధ్య రామాలయ నమూనాతో పాటు పవిత్ర సరయూ నదీ జలాన్ని, ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభమేళా తీర్థాన్ని కూడా వారికి బహూకరించారు.

## 140 మీటర్ల వెడల్పుతో ఒఆర్ఆర్

### కేంద్ర ప్రభుత్వం ఆమోదం, అమరావతి అభివృద్ధికి కీలకం

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వ ప్రణాళికలకు అనుగుణంగానే అమరావతి రూపురేఖలు మారనున్నాయి.నగరాన్ని అత్యంత సుందరంగా,అన్ని ప్రాంతాలనుంచి రహదారులు అనుసంధానం చేయాలన్న ప్రభుత్వం లక్ష్యం నేరవేరనున్నది.అమరావతి ఔటర్ రింగ్ రోడ్డును 140 మీటర్ల వెడల్పుతో చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గతంలో 70 మీటర్ల వెడల్పుతో 189 కి.మీ. ఓఆర్ఆర్ నిర్మాణానికి అంగీకారం తెలపగా, ఇది సరిపోదంటూ సీఎం చంద్రబాబు నాయుడు కేంద్రంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారు. దేశంలోనే మోడల్ నగరంగా అమరావతిని నిర్మిస్తుండటం, 50 ఏళ్లలో ఓఆర్ఆర్‌పై పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఆర్ ను 150 మీటర్ల వెడల్పుతో నిర్మించాలని చంద్రబాబు పట్టుబట్టారు. దీనితో కేంద్రం 140 మీటర్ల వెడల్పుకు అంగీకరించింది. మార్చి 5న దిల్లీలో జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు, కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ఓఆర్ఆర్‌తో పాటు రాష్ట్రంలోని అనేక జాతీయ రహదారుల ప్రాజెక్టులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిని మినిట్స్ రూపంలో పేర్కొంటూ అధికారికంగా వివరాలను ఇక్కడి అధికారులకు వచ్చాయి.

**భూసేకరణకు రాష్ట్రం రూ.1000 కోట్లు :** ఓఆర్ఆర్‌కు 70 మీటర్ల వెడల్పు చాలంటూ కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ(మోర్త్) ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ గత డిసెంబరులో నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అదనంగా 70 మీటర్ల వెడల్పునకు అవసరమయ్యే భూసేకరణ వ్యయంలో రూ.1,000 కోట్లు రాష్ట్రం వెచ్చించేందుకు చంద్రబాబు అంగీకరించారు. చంద్రబాబు, గడ్కరీల నడుమ సమావేశం మార్చిలో జరిగినప్పటికీ, అందులో తీసుకున్న నిర్ణయాల వివరాలు అధికారికంగా విడుదల కాకపోవడంతో కొంత అస్పష్టత నెలకొంది. దీంతో ఇక్కడి ఎన్‌హెచ్ఏఐ అధికారులు, 70 మీటర్ల వెడల్పుతోనే ఓఆర్ఆర్‌కు 5 జిల్లాల్లో భూసే కరణను ఇటీవల ప్రారంభించారు.ఇ క ఇప్పుడు 140 మీటర్ల వెడల్పుతో ప్రాజెక్టు ఖరారు చేస్తూ నిర్ణయం రావడంతో దానికి తదనుగుణంగా చర్యలు చేపట్టనున్నారు.



## ముగిసిన చెవిరెడ్డి పోలీసు కస్టడీ

### మరో కేసు నమోదు చేసే దిశలో సిట్

**విజయవాడ, జులై 4 ప్రభాతవార్త ప్రతినిధి:** చెవిరెడ్డి మూడు రోజుల పోలీసు కస్టడీ ముగిసింది.మూడు రోజుల పాటు రిమాండ్ నుంచి సిట్ కస్టడీకి వెళ్ళి,తిరిగి వచ్చే సమయంలో తీవ్ర అసహనంతో అధికారులపైన సిబ్బంది పడ్డారు.ఈ అంశం కీలకంగా ఆయనపై విధి నిర్వహణకు అడ్డంకి కలిగించారనే అభియోగంపై మరో నమోదు చేసే దిశలో సిట్ ఆలోచిస్తున్నారు. చెవిరెడ్డి సిట్ విచారణలోకి వెళ్ళిన సందర్భంలో సిట్‌లో ఎవరెవరు పని చేస్తున్నారో మీ చరిత్రలేంటో నాకు అన్నీ తెలుసు. మీ అందరి అంతు తేలుస్తా అంటూ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సిట్ అధికారులను బెదిరించినట్లు సిట్ అధికారుల అభియోగం త్వరలోనే జైలు నుంచి బయటకొస్తా. సిట్ కార్యాలయం ఎదుటే అద్దెకు ఇల్లు తీసుకుంటా. ఇక్కడే ఉండి మీ లెక్కలు చూస్తా అంటూ హెచ్చరించినట్లు తెలిసింది. దర్యాప్తు బృందాలు మూడు రోజుల్లో 200 కు పైగా ప్రశ్నలు అడగ్గా ఆయన ఏ ఒక్కదానికీ సరైన సమాధానమివ్వలేదు. పైగా దర్యాప్తు అధికారులను బెదిరించి హెచ్చరించినట్లుగా సమాచారం. విచారణకు సహకరించకుండా పెద్దపెద్దగా కేకలు వేసినట్లు దర్యాప్తు అధికారులను శాపనార్థాలు పెట్టినట్లు తెలిసింది.

ఆయన దురుసు ప్రవర్తనంతా సీసీ కెమెరాల్లో రికార్డైంది.ఈ ఫుటేజ్‌ను న్యాయస్థానానికి సమర్పించనున్నారు. సిట్‌అధికారులు ఎంతఓపిగ్గా ప్రశ్నించినా మీరడిగిన దానికి నేను సమాధానం చెప్పను నేను చెప్పేదే మీరు రాసుకోండి అంటూ చెవిరెడ్డి రంకెలు వేశారు.

## వారం - వర్జ్యం

తేది : 05-07-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
దశమి సా.6.59
స్వాతి రా.7.50
వర్జ్యం రా.2.06-3.53
దు.తె.5.40-7.20
శుభసమయం:ఉ.7.50-8.30,సా.6.30-7.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** బంధువుల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆనందం కలిగిస్తాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**వృషభం:** వివాహయత్నాలు ఫలిస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వస్తు,వస్త్రాలాభాలు.

**మిథునం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి.వాటిని సద్వినియోగం చేసుకోండి. పోటీపరీక్షలలో అనుకూలంగా వుండును.

**కర్కాటకం:** అందరిని మాటలతో ఆకట్టుకొని ముందుకు సాగుతారు. పారిశ్రామిక రంగాల వారికి విజయ వంతమైన కాలం.

**సింహం:** వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. ఉద్యోగులు ఆశ్చర్యకరంగా ఇంక్రిమెంట్లు పొందుతారు.

**కన్య :** సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుతుంది.

**తుల :** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకుంటారు.

**వృశ్చికం:** సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది.

**ధనుస్సు:** క్రయ విక్రయాలలో ప్రోత్సాహం పొందుతారు. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**మకరం:** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కుంభం:** జీవిత భాగస్వామి నుండి ఆస్తి లాభం పొందుతారు. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగిన సమర్థ వంతంగా నిర్వహిస్తారు.

**మీనం :** శ్రమ ఫలించే సమయం. సంతానం ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి. పట్టుదలతో ముందుకు సాగుతారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన డిజిపి హరీష్ కుమార్ గుప్తా

**విజయవాడ, జూన్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు, విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ పోలీసు రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించిన డీజీపీ హరీష్ కుమార్ గుప్తా.రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి, భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని విప్లవపథం వైపు నడిపి, భరతమాత దాస్యశృంఖలాలను తెంచడానికి సాగిన సమరంలో ప్రాణత్యాగం చేసిన అసమానశూరుడు అల్లూరి సీతారామరాజు అని డీజీపీ కొనియాడారు. ఆ మహనీయుని వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు నేటి యువతకి స్ఫూర్తిగా నిలుస్తాయని, భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పోషించిన పాత్ర చరిత్రలో అజరామరంగా నిలిచిపోతుందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పేర్కొంటూ ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులర్పించారు.

# టిడిపిలో భగ్గుమన్న వర్గ విభేదాలు!



సామరస్యంగా సర్దిచెపుతున్న డిఎస్పీ రామాంజి నాయక్

**ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు**

**సుపరిపాలన తొలిఅడుగు ఇంటింటికి ప్రచారం**

**ఎంపి బైరెడ్డి శబరిని అడ్డుకున్న బుడ్డా రాజశేఖరరెడ్డి వర్గీయులు**

**మాజీ న్యాయశాఖ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి నివాసంలో బైరెడ్డి శబరి**

**ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్ రాకతో సద్దుమణిగిన సమస్య**

**పార్టీలో ఎలాంటి వర్గవిబేదాలు లేవని మీడియా సమక్షంలో తెలిపిన ఎంపి**

**ఆత్మకూరు,జూలై04,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సుపరిపాలన తొలిఅడుగు అంటూ అసెంబ్లీ స్థానాలలో ఎంఎల్ఏలు జోరుగా ఇంటింటికి తిరుగుతూ ప్రతి రోజు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఆదేశాలను పాటించే విదంగా పరిపాలన కొనసాగుతుంది. ఒక్కసారిగా శ్రీశైలం నియోజకవర్గంలో వర్గ విబేదాలు తెలుగు తమ్ముల మద్య భగ్గుమన్నాయి. స్థానిక ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే సుపరిపాలన తొలిఅడుగు అంటూ ఆత్మకూరు పట్టణంలో ప్రచారం చేయడంతో తెలుగు తమ్ములు ఒక్కసారి అగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని మాజీ న్యాయశాఖ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి నివాసంలో నంద్యాల పార్లమెంట్ ఎంపి బైరెడ్డి శబరి రావడంతో ఇక్కడ వర్గా విబేదాలు మరోసారి భగ్గుమన్నాయి. అసలకు ఎందుకు ఈ వర్గా విబేదాలు వచ్చాయి అనే విషయాలు పూర్తి తెలుసుకుందాం. పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో వికలాంగులకు సైకిల్ పంపిణి కార్యక్రమానికి నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి హాజరుకానున్నారు. ఈ విషయాని గమనించిన మాజీ న్యాయశాఖ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, స్థానిక ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఇద్దరు కలసి మరో కొత్త రాజకీయం చేయాలనే ఆలోచన ఉండడంతో పట్టణంలో సుపరిపాలన తొలిఅడుగు అనే కార్యక్రమం ఇంటింటికి తిరిగి బైరెడ్డ శబరి ప్రచారం చేసిన విషయం గమనించిన ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి వర్గీయులు అక్కడికి వెళ్లి మా ఎంఎల్ఏ లేకుండా ఎలా ప్రచారం చేస్తారని ప్రశ్నించారు. వెంటనే బైరెడ్డి శబరి అక్కడి నుంచి వెళ్లిపోయింది. తర్వాత మాజీ న్యాయశాఖ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి తన నివాసంలోకి ఎందుకు రానివ్వడం జరిగిందని టిడిపి నాయకులు ప్రశ్నించారు. దానికి సరైన సమాదానం చెప్పకపోవడంతో టిడిపి వర్గీయుల మద్య ఒక్కసారిగా విబేదాలు భగ్గుమన్నాయి. మాజీ న్యాయశాఖ మంత్రి ఎన్నికల ముందు నుంచి ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డికి వ్యతిరేకంగానే తన అనుచర వర్గంతో కక్షసాధింపు రాజకీయాలు కొనసాగిస్తునే ఉన్నారు. ఎన్నికలు ముగిసన తర్వాత మళ్లీ తన నివాసం కోసం రావడం బైరెడ్డి శబరితో రాజకీయాలు చేస్తున్నారనే అనుమానాలు రేకెతించి ప్రశాంతంగా ఉన్న ఆత్మకూరు పట్టణంలో వర్గా విబేదాలతో చిచ్చు రేపారు. ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్, అర్బన్ సిఐ రాము, రూరల్ సిఐ సురేష్‌కుమార్‌రెడ్డి అక్కడికి చేరుకోని తెలుగు తమ్ములను అక్కడి నుంచి తరమి పంపడంతో పట్టణంలో ప్రశాంతమైన వాతవరణం నెలకొంది.

తెలుగుదేశం పార్టీలో ఎలాంటి వర్గవిబేదాలు లేవు... ఎంపి బైరెడ్డి శబరి

తెలుగుదేశం పార్టీలో అందరం కలసికట్టుగా ఉన్నామని ఎలాంటి వర్గ విబేదాలు లేకుండా ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలను పాటిస్తూ సుపరిపాలన తొలిఅడుగు అనే కార్యక్రమం స్వాగతించే విదంగా పరిపాలన కొనసాగిస్తామని నంద్యాల పార్లమెంట్ ఎంపి బైరెడ్డి శబరి శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో మీడియా సమక్షంలో తెలిపారు.

# తిరుమల సమాచారం

## రేపు అలిపిరి గోశాలలో 12గంటలు అఖండ విష్ణుసహస్రనామ పారాయణం



**తిరుమల,జూలై 4ప్రభాతవార్తప్రతినిధి:** ఆషాడ శుద్ధ ఏకాదశి తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుపతి అలిపిరిలోని గోశాలలో ఆదివారం ఉదయం 12గంటలు పాటు నిరవధికంగా అఖండ విష్ణుసహస్రనామాపారాయణం జరుగుతుంది. సర్వ జనసంరక్షణకు, ప్రపంచ మానవాళి ఆయురారోగ్యాలకు తిరుపతి పారాయణభక్త బృందాల సంయుక్త నిర్వహణలో మొదటిసారి తిరుపతిలో 12గంటలు విష్ణుసహస్రనామ అఖండ పారాయణంకు అందరూ ఆహ్వానితులేనని హనుమత్సేవాసమితి తెలిపింది. విష్ణుభగవానుడు యోగనిద్రలో సృష్టి రచనకు ఉపక్రమించిన శుభదినం కావడంతో విష్ణుసహస్రనామ స్తోత్ర సామూహిక పారాయణం మొదలగు సత్కర్మలు అత్యంత శుభఫలితాలనిస్తుందని తెలిపారు. ఆదివారం ఉదయం 6గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు ఈ అఖండపారాయణంలో తిరుపతి వాసులు, భక్తులు పాల్గోనవచ్చని తెలిపారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు - శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల,జూలై 4ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుబాలు కలగాలని, అంతా మంచి జరగాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టీస్ అరవింద్‌కుమార్ కుటుంబం, రాష్ట్రమంత్రి సవిత కుటుంబం, మాజీ కేంద్రమంత్రి సర్వేసత్యనారాయణ, బిఆర్ఎస్ ఎంఎల్ఏ కాలేరువెంకటేశ్,

చమ్మక్‌చంద్ర వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# కృత్రిమమేధ(ఎఐ) సహకారంతో భూ వివాదాలు, సమస్యలకు పరిష్కారం

## మంత్రి అనగాని సత్య ప్రసాద్



మీడియా సమావేశంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్,రెవిన్యూ శాఖ స్పెషల్ సి.ఎస్. సిసిఎల్ఏ జి.జయలక్ష్మి అదనపు సిసిఎల్ఏ ప్రభాకర రెడ్డి

**విజయవాడ, జూలై 4,ప్రభాతవార్తప్రతినిధి:** అత్యాధునిక సాంకేతికత, కృత్రిమ మేథ సహకారంలో ఆధార్, సర్వే నంబర్లను లింక్ చేయడం ద్వారా భూ వివాదాలు, సమస్యలను శాశ్వత పరిష్కరించే దిశగా పటిష్టమైన చర్యలను ప్రభుత్వం చేపడుతున్నట్లు రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. శుక్రవారంరాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఎక్కడ కూడా మోస పూరితమైన రిజిస్ట్రేషన్లు, ఎంట్రీలకు ఏమాత్రం అవకాశం లేకుండా సర్వే, రిజిస్ట్రేషన్ మరియు రెవిన్యూ శాఖలను బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా ఇంటిగ్రేట్ చేయడం జరుగుతుందన్నారు. రెవిన్యూ శాఖకు చెందిన పది కీలక అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు ఆదేశాలను జారీ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, అటవీ మరియు నీటి వనరుల భూములకు పలు రకాల రంగులను నిర్ధేశిస్తూ వాటన్నింటినీ మ్యాపింగ్ చేసే అద్భుత కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టబోతుందని మంత్రి తెలిపారు. 200 నుండి 250 ఎకరాల భూమిని ఒక బ్లాక్‌గా నిర్ధేశిస్తూ భూముల రీ సర్వే కార్యక్రమం ఎంతో పారదర్శకంగాను, విజయవంతంగా జరుగుచున్నదన్నారు. అన్ని భూ సమస్యలను పరిష్కరిస్తూ 2027 డిశంబరు నాటికి ఈ రీ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయడమే కాకుండా అద్భుత మైన రెవిన్యూ వ్యవస్థను రాష్ట్రంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో దాదాపు 1.85 లక్షల దరఖాస్తులురాగా, వాటిలో ఇప్పటికి కేవలం 687 మాత్రమే పెండింగ్ లో ఉన్నట్లు తెలిపారు. గత ఏడాది కాలంలో ప్రభుత్వానికి అందిన 4.63 లక్షల గ్రీవెన్సుల్లో ఇప్పటి వరకూ 3.99 లక్షల గ్రీవెన్సులను పరిష్కరించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో క్రమబద్దీకరణ చేయని ఇల్లు ఉండకూడదు అనే లక్ష్యంతో అభ్యంతరం లేని నివాస యూనిట్లను జి.ఓ.నెం.30 ద్వారా ఉచితంగా క్రమ బద్దీకరించడం జరిగిందని, ప్రస్తుతం నిర్వహిస్తున్న సుపరిపాలనతొలిఅడుగు కార్యక్రమంలో కూడా ఇందుకు సంబందించి అందే దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుని ఇళ్లను క్రమబద్దీకరిస్తామన్నారు.

నాలా రద్దు అంశంపై మంత్రుల మంత్రివర్గ ఉప సంఘం ఇప్పటికే దాదాపు మూడు సార్లు సమావేశమై సుదీర్ఘంగా చర్చించడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ అంశానికి సంబందించి పంచాయితీరాజ్, పట్టణాభివృద్ది మరియు రెవిన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి న అంశంపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. వచ్చే క్యాబినెట్ లో ఈ అంశంపై ఒక నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు.

అన్ని రకాల భూముల కన్వర్షన్ కు నాలుగు శాతం ప్లాట్ రేటును ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగిందన్నారు.

## ఎన్.ఎస్.ఎస్. అధికారిగా డా.మద్దినేని సుధాకర్

**విజయవాడ, జూలై 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్.ఎస్.ఎస్. అధికారిగా డా.మద్దినేని సుధాకర్ నియమితులయ్యారు.



ఆర్.వి.ఆర్. జె.సి. ఇంజనీరింగ్ కళాశాల, గుంటూరులో గత 30 సంవత్సరములుగా మేథమెటిక్స్ విభాగంలో ఆచార్యునిగా సేవలందించారు గత 23 సంవత్సరాల నుండి కళాశాల ఎన్.ఎస్.ఎస్. అధికారిగా, జిల్లా అధికారిగా ఎన్.ఎస్.ఎస్. ద్వారా విశిష్ట సేవలు అందించారు. ఎన్.ఎస్.ఎస్. ద్వారా చేసిన సేవలకు గుర్తింపుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకోవడంతో పాటు యూనివర్సిటీ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఎన్.ఎస్.ఎస్. అధికారిగా, జాతీయ స్థాయిలో "నేషనల్ బెస్టు ఇందిరా గాంధి ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్" గా భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ గారి నుండి అందుకున్నారు. వీరు అంతర్జాతీయ స్థాయిలో గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డు రికార్డు ను కూడా సాధించారు. వీరి విద్యాభ్యాసం జె.కె.సి. కళాశాల, ఐఐటి బోంబే మరియు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పూర్తి చేశారు.

## ప్రపంచ పోలీస్ క్రీడల్లో టిటిడి విజిలెన్స్ అధికారులకు కాంస్య, స్వర్ణ పతకాలు

- ఇది అద్భుత విజయమన్న టిటిడి



**తిరుమల,జూలై 4ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికా బర్మింగ్‌హామ్ నగరంలో జరిగిన ప్రపంచ పోలీస్, ఫైర్ గేమ్స్-2025 పోటీల్లో టిటిడి సెక్యూరిటీ విజిలెన్స్ విభాగం అధికారులు కాంస్య,స్వర్ణ పతకాలు అందుకున్నారు. ఈ అద్భుత విజయాలు సాధించి జాతీయ మువ్వెన్నల పతాకాన్ని అమెరికాలోనూ రెపరెపలాడించారు. ఇద్దరు విజిలెన్స్ సెక్యూరిటీ విభాగం అధికారులు విఎస్ఓ (వింగ్)నెట్టెం తులసీవెంకట రామ్‌కుమార్, విఎస్ఓ అల్లంసురేంద్ర సింగిల్ టెన్నీస్ పోటీల్లో అద్భుతంగా ఆడి సత్తా చాటారు. ప్రపంచవ్యాప్తంగా 80దేశాల నుండి పోలీస్,ఫైర్ విభాగాల నుండి 9వేలమంది అథ్లెట్లు పాల్గొన్న ఈ ద్వైవార్షిక పోటీల్లో టిటిడి విజిలెన్స్ అధికారులు ఎన్టీవి రామ్‌కుమార్ 55 సంవత్సరాల పైబడిన విభాగం సింగిల్స్ టెన్నీస్ పోటీల్లో కాంస్యపతకాన్ని సాధించారు. 45 సంవత్సరాలుపైబడిన సింగిల్స్ టెన్నీస్ పోటీల్లో విఎస్ఓ సురేంద్ర స్వర్ణపతకం గెలుచుకున్నారు. ప్రపంచ దేశాల క్రీడల్లో భారతదేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి టిటిడి తరపున పాల్గొని విజయకేతనం సాధించిన ఇద్దరు విఎస్ఓలను ఈ సందర్భంగా టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఓ శ్యామలరావు, అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఓ వీరబ్రహ్మం, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయాలు దేశానికి, టిటిడికి గర్వకారణమని తెలిపారు. ప్రత్యేకంగా టిటిడికి ఇది ఒక గొప్పగౌరవమని హర్షం వ్యక్తం చేశారు. విజేతలైన విఎస్ఓలకు టిటిడి ఉద్యోగులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయస్థాయి విజయం టిటిడి విజిలెన్స్ సెక్యూరిటీ విభాగంలో అధికారుల నైపుణ్యాన్ని, నిబద్దతను చాటిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా టిటిడి ప్రతిష్టను మరింత పెంచేలా ఈ విజయం గుర్తింపు తోడ్పడిందని పేర్కొన్నారు.

## గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీ

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీ జరిగింది. వందల రూపాయలు విలువ చేసే స్టాంపు పేపర్లతో పాటుగా విలువైన ఇతర సామాగ్రిని దొంగలించారు. ఈ ఘటన కృష్ణా జిల్లా గన్నవరంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం కార్యాలయం తెరిచేందుకు సిబ్బంది రాగా, అప్పటికే ప్రధాన ద్వారం గడి, బయటి గదిలోని బీరువా వగులగొట్టి కనిపించాయి. రూ. వంద విలువైన స్టాంపు పేపర్ల కట్టతోపాటు, సాధారణ స్టాంపులు, ఇతర సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించారు. ఎలాంటి ఆధారాలు దొరికేందుకు వీలు లేకుండా, వేలి ముద్రలు పడకుండా వేసుకున్న గ్లౌజులను సైతం నిందితులు అక్కడే పడేసి వెళ్లారు. 13,56,300 రూపాయల విలువైన స్టాంపు పేపర్లు చోరీ అయినట్లు జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసర్ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. పోలీసులు క్లూస్ టీమ్ సాయంతో దర్యాప్తు చేస్తున్నారు.

## మెగా డిఎస్సీ ప్రాథమిక 'కీ' విడుదల

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** మెగా డిఎస్సీ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక 'కీ' రెస్పాన్స్ షీట్లను నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి తెలిపారు.జూన్ 6 నుంచి జూన్ 28 వరకు నిర్వహాజంచిన పరీక్షలకు సైంబంధించిన 'కీ'ని విడుదల చేసామని,ఇందులో పీజీటీ కామర్స్,ఆంగ్లం,హిందీ,భౌతికశాస్త్రం,సంస్కృతం,సాంఘిక శాస్త్రం,తెలుగు,స్కూలు అసిస్టెంట్‌ల విభాగంలో ఆంగ్లం,భౌతికశాస్త్రం పరీక్షలక 'కీ'లు ఉన్నాయని వెల్లడించారు. అలాగే ఎస్జీటీ జనరల్,స్పెషల్ పోస్టులు,టీజీటీలో ఆంగ్లం, హిందీ,భౌతికశాస్త్రం,తెలుగు,ఆంగ్ల భాష ప్రావీణ్య పరీక్ష,స్పెషల్ పీఈటీ,జనరల్ పీఈటీకి సంబంధించిన అన్ని మాధ్యమాల ప్రాథమిక 'కీ'ని

# మనిషి ప్రాణం ఖరీదు రూ. 3 లక్షలా?

## వైద్యం వికటించి వ్యక్తి మృతి - ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన మౌలిక సదుపాయాలు లేకున్నా చికిత్సలు

పులివెందుల,జూలై 4, ప్రభాత వార్త: మనిషి ప్రాణాన్ని డబ్బుతో ఒక ప్రైవేట్ ఆసుపత్రి డాక్టర్ లెక్క కట్టిన సంఘటన పులివెందులలో చోటు చూసుకుంది. వివరాలలోకి వెళితే పులివెందుల పట్టణంలో శుక్రవారం వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందాడంతో బంధువులు ఆందోళన చేయడంతో ప్రాణానికి మూడు లక్షలు ఇచ్చి పెద్ద మనుషులు పంచాయతీ చేసారు.రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ప్రైవేట్ ఆసుపత్రికి వస్తే మోలిక సదుపాయాలు లేకపోయిన చికిత్స షురూ చేయడంతో ఆయన ఇచ్చిన వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందినట్టు బంధువులు ఆరోపించారు. . గురువారం సాయంత్రం తొండూరు మండలం సైదాపురం గ్రామానికి చెందిన సండడి లక్ష్మీనారాయణ రెడ్డి, అనిల్ కుమార్ తో కలిసి ద్విచక్ర వాహనం లో పులివెందులకు వస్తుండగా మార్గమధ్యంలో బైకు అదుపుతప్పి ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ రెడ్డికి తీవ్ర గాయాలు కాగా అనిల్ కుమార్ కు స్వల్ప గాయాలయ్యాయి. అయితే తీవ్రంగా గాయపడ్డ లక్ష్మి నారాయణరెడ్డిని పులివెందుల పట్టణంలోని స్థానిక బైపాస్ రోడ్డులో గల ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తికి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందడం జరిగింది. చికిత్స కోసం ఆసుపత్రి సిబ్బంది కీ వేల రూపాయలు కట్టామని పరిస్థితి విషమంగా ఉన్న పెద్ద ఆస్పత్రులకు పంపించకుండా చికిత్స చేయడం వలనే లక్ష్మీనారాయణ రెడ్డి మృతి



చెందినట్లు బంధువులు ఆరోపించారు. మృతుని బంధువులు ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో పెద్దమనుషులు పంచాయతీ చేసి మూడు లక్షల రూపాయలు ఇప్పించి ఆందోళన వివరింప చేసినట్లు తెలుస్తుంది. ఈ సంఘటనపై డాక్టర్ వెంకటేష్ నాయక్ ను వివరణ కోరగా సరైన వైద్యం చేయడం జరిగిందని తీవ్ర గాయాలు కావడం వల్ల అప్పటి ఆసుపత్రికి చేరే సమయానికే పరిస్థితి విషమంగా ఉన్నదని బంధువులకు తెలియజేయడం జరిగిందని వివరణ ఇచ్చారు. ఏది ఏమైనప్పటికీ మనిషి ప్రాణానికి విలువ కట్టడంపై పలువురు విమర్శిస్తున్నారు.

## మెప్మా రిసోర్స్ పర్సన్స్ఆదాయం మెరుగ్గా ఉంది : మంత్రి నారాయణ

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** పేదలు, నిరుపేదల ఆదాయాన్ని డబుల్ చేయాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రాష్ట్రవ్యాప్త రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీలు) సీఆర్డీఏ ఆఫీసు వద్ద మంత్రి పొంగూరు నారాయణను గురువారం రాత్రి మెమో అబియెన్స్ చేయడంపై కలిసి తమ సంతోసాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలో గల మెప్మా రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ) ఆదాయం ఎంతో మెరుగ్గా ఉందన్నారు. ఆర్పీల ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అంతేకాకుండా వారు వ్యాపార వేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందుకే ప్రభుత్వం ఇసుక రీచ్ లను కూడా వారికి అందించిందన్నారు. సాంకేతిక ఇబ్బందులు వల్ల కొద్ది రోజులే అమలు చేయగలిగామన్నారు. గత ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా వీరిని ఎన్నో ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఆర్పీలు ఎవరైనా మూడేళ్ల వరకే పనిచేయాలనే గత ప్రభుత్వం విధించిన అత్యంత ప్రమాదకరమైన ఉత్తర్వులను కూటమి ప్రభుత్వం అబియెన్స్ లో పెట్టిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం మూడేళ్ల కాలపరిమితి ఉత్తర్వులను అబియెన్స్ (త్రిబ్యు) లో పెడుతూ పట్టణాభివృద్ధి శాఖ మెమో ను జారీ చేసిందన్నారు..

ఇప్పటి వరకూ పని భద్రత లేదన్న భయంతో గడిపిన ఆర్పీలు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులతో ఆనందోత్సాహాలకు గురయ్యారన్నారు.


**నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**

(పూర్వపు) ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)

నమోదిత కార్యాలయం: యూనిట్ నెం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ, అంధేరీ ఘట్‌కోపర్ లింక్ రోడ్, చాకల, అంధేరి (ఈస్ట్), ముంబై-400093 ఇ-మెయిల్:-connect@niwashfc.com CIN నంబర్: U65990MH2016PTC271587 సంప్రదించు నం.: కాగిత కిషోర్-9966111777

NIWAS HOUSING FINANCE

**[అనుబంధం-IV-A] స్థిరాస్తుల యొక్క అమ్మకానికి విక్రయ ప్రకటన [8(6) నిబంధనకు ఏర్పాటు చూడండి]**

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం 2002 సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6)కు ఏర్పాటుతో చదువబడే దాని క్రింద స్థిరాస్తుల యొక్క అమ్మకానికి ఇ-వేలం విక్రయ ప్రకటన. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం 2002 క్రింద NHFPL అధీకృత అధికారిచే రుణగ్రహీత(లు) నుండి రుణబకాయి మొత్తం వసూలు కొరకు ఇక్కడ క్రింద పేర్కొనబడిన సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనంలోకి తీసుకొనుట విషయమై సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు)కు ఇందుమూలముగా ప్రకటన జారీచేయడమైనది. దిగువ సంతకందారునిచే క్రింద ఇక్కడ వివరింపబడిన విధంగా స్థిరాస్తి కొనుగోలు నిమిత్తం మా సేల్స్ & మార్కెటింగ్ మరియు ఇ-వేలం సర్వీస్ భాగస్వామి Credresolution ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనగా Credauction.com యొక్క వెబ్ పోర్టల్ పైన ఆన్లైన్ దాఖలుకు ఆఫర్లు కోరబడుతున్నవి.
సెక్యూర్డ్ ఆస్తులు తిరిగి పొందడానికి సమయ లభ్యతకు సంబంధించి చట్టం యొక్క 13 సెక్షన్ యొక్క ఉప-సెక్షన్ (8) యొక్క ఏర్పాటు విషయం రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది. 'ఏది ఎక్కడ ఉన్నదీ అక్కడ అలా', ప్రాతిపదికన ఏది ఎలా ఉన్నవి అలా ప్రాతిపదికన అక్కడ ఉన్నది అలా' ప్రాతిపదికన, సహాయంపై ఆధారపడకుండా ప్రాతిపదికన సదరు ఆస్తి భౌతికంగా స్వాధీనం చేసుకోబడింది. దాని వివరాలు ఇక్కడ క్రింద పేర్కొనబడిన విధంగా.

| రుణగ్రహీత(లు) వివరాలు | డిమాండ్ నోటీసు 13(2) యొక్క మొత్తం మరియు తేదీ | రిజర్వ్ ధర బయానా బిడ్ పెంపు మొత్తం | ఇ-వేలం తేది & సమయం |
|---|---|---|---|
| LNELR0HL-01210015712 బ్రాంచి : ఏలూరు రుణగ్రహీత- శివకుమార్ కంభంపాటి సహ-రుణగ్రహీత(లు): భవాని సత్య ప్రియాంక కంభంపాటి | 24/02/2023 రూ.12,15,575/- (రూపాయలు పన్నెండు లక్షల పదిహేను వేల ఐదు వందల డెబ్బై ఐదు మాత్రమే) 10/02/2023 నాటికి తిరిగి చెల్లింపు వరకు అపై తదుపరి వడ్డీ మరియు చార్జీలతోసహా | రూ.7,30,000/- రూ.73,000/- రూ.10,000/- | 24/07/2025 సమయం: ఉ.10.30 నుండి మ.12.30 గం.కు 5 నిమిషాల యొక్క అపరిమిత పొడిగింపుతో |
| ఆస్తి కలిగి ఉన్నది: సాయి సూర్యానగర్ 534447, జంగారెడ్డి గూడెం గ్రామం, జంగారెడ్డి గూడెం మండలం, సబ్ రిజిస్ట్రీ జంగారెడ్డి గూడెం, పశ్చిమ గోదావరి జిల్లా, ఫ్లాట్ నం.ఇ.-25/26పై నిర్మించబడిన ఈజ్‌మెంట్ హక్కులతోసహా, టు వీలర్ పార్కింగ్ యొక్క 17 చ.గజాలు, కామన్ ఏరియా, ప్లింత్ ఏరియా యొక్క 801 చ.అ కొలత స్థలం, ఆర్.ఎస్. నం.125/4, ఇ.నం.1-1-141, వినాయక్ టవర్స్, 3వ అంతస్తు, ఫ్లాట్ నం.ఎ-1, యొక్క మొత్తం అదంతా. నాలుగు సరిహద్దులు: ఉత్తరం: కామన్ కారిడార్, దక్షిణం: కారిడార్, తూర్పు: ఫ్లాట్ నం.ఎ-2 యొక్క ఆస్తి, పడమర: కారిడార్. | | | |
| LNELR0HL-06210017628 బ్రాంచి : ఏలూరు రుణగ్రహీత- యేసన్న ముద్రబోయిన సహ-రుణగ్రహీత(లు): ఉమా దేవి గుర్రం | 23/05/2023 రూ.10,27,782/- (రూపాయలు పది లక్షల ఇరవై ఏడు వేల ఏడు వందల ఎనభై రెండు మాత్రమే) 16/05/2023 నాటికి తిరిగి చెల్లింపు వరకు అపై తదుపరి వడ్డీ మరియు చార్జీలతోసహా | రూ.8,75,000/- రూ.87,500/- రూ.10,000/- | 24/07/2025 సమయం: ఉ.10.30 నుండి మ.12.30 గం.కు 5 నిమిషాల యొక్క అపరిమిత పొడిగింపుతో |
| ఆస్తి కలిగి ఉన్నది: ఆంధ్రప్రదేశ్ 534004, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మండలం, చాటపర్రు గ్రామం, అసెస్‌మెంట్ నం.1588/, ఇ.నం.5/9/2, ఆర్.ఎస్. నం.116/1, ఏలూరు సబ్ రిజిస్ట్రీ, పశ్చిమ గోదావరి జిల్లా కలిగిన ఆస్తి యొక్క మొత్తం అదంతా. ఇంటి స్థలం మరియు ఇల్లు 234-5 చ.గజాల యొక్క కొలత, ఈజ్‌మెంట్ హక్కులతోసహా. నాలుగు సరిహద్దులు: తూర్పు: 8 అడుగుల వెడల్పు రోడ్ 41-0' అ' పడమర: లంకపల్లి నారాయణ యొక్క ఆస్తి 41-0' అ', దక్షిణం: నున్న శ్యాంబాబు యొక్క ఆస్తి 560 అ', ఉత్తరం: కారుకోటి యేసురాజు మరియు ఇతరుల ఆస్తి 56-0 అ' | | | |
| LNRAJ0HL-12200015214, LNRAJ0HL03230029703 బ్రాంచి : రాజమండ్రి రుణగ్రహీత- ప్రదీప్ కుమార్, సహ-రుణగ్రహీత(లు): వెంకాయమ్మ వేముల్లూరి | రూ.13,30,592/- (రూపాయలు పదమూడు లక్షల ముప్పై వేల ఐదు వందల తొంభై రెండు మాత్రమే) 09-జనవరి-2024 నాటికి తిరిగి చెల్లింపు వరకు అపై తదుపరి వడ్డీ మరియు చార్జీలతోసహా | రూ.14,50,000/- రూ.1,45,000/- రూ.10,000/- | 08/08/2025 సమయం: ఉ.10.30 నుండి మ.12.30 గం.కు 5 నిమిషాల యొక్క అపరిమిత పొడిగింపుతో |
| ఆస్తి కలిగి ఉన్నది: పశ్చిమ గోదావరి జిల్లా-534318, గోపాలపురం మండలం, దొండపూడి గ్రామ పంచాయతీ, సాగిపాడు గ్రామం వద్ద ఉన్న 320-5 చ.గజాల కొలత, బ్లాక్ నం.7, ఇ.నం.7-24, సర్వే నం.67/3 కలిగి ఉన్న ఆస్తి యొక్క మొత్తం అదంతా. సరిహద్దులు క్రింది విధంగా: ఉత్తరం: పంచాయతీ వీధి 40'-9", దక్షిణం: కొక్కిరిపట్టి రామ్‌చంద్రం భూమి 40'-9", తూర్పు: పేమి సూర్యచంద్రం ఇల్లు 70'-9", పడమర: తోకు రామచంద్రం ఇల్లు 70'-9". | | | |

ఇ-వేలం యొక్క నియమాలు మరియు నిబంధనలు :
1. విక్రయం యొక్క సవివరమైన నియమాలు మరియు నిబంధనలకు దయచేసి www.niwashfc.com పై ఏర్పాటు చేయబడిన లింక్‌కు రిఫర్ చేయండి మరియు మా సేల్స్ & మార్కెటింగ్ మరియు ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్, Credauction.com యొక్క వెబ్‌సైట్‌కు.
2. మా పోర్టల్స్ https://www.niwashfc.com/Auction-Notices లింక్ క్రింద అవన్నీ ప్రచురింపబడినవి.
3. కాగోరు బిడ్డర్లు ఇ-వేలానికి సంబంధించి ఏ విచారణకైనా, ఆస్తి యొక్క సమాచారం & తనిఖీకి, సపోర్ట్, విధానం మరియు ఆన్‌లైన్ శిక్షణకు మా సేల్స్ & మార్కెటింగ్ విభాగం మరియు ఇ-వేలం సర్వీస్ భాగస్వామి యొక్క క్లైంట్ సర్వీస్ డెలివరీ (CSD) విభాగాన్ని సంప్రదించవచ్చును. Credresolution ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ టెలి. నం.: +91 9137100020 & 9819167197 మరియు ఇ-మెయిల్ ID: balram@credsolv.com లేదా amit@credsolv.com NHFPL యొక్క అధీకృత అధికారి కాగిత కిషోర్- 9966111777 ద్వారా.
* గమనిక :- NHFPL విక్రయ ప్రకటనను రుణగ్రహీత(లు) అందరికీ స్పీడ్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా జారీ చేస్తున్నారని దయచేసి గమనించ కోరుతున్నాము. ఎవరైనా పార్టీలకు అవి అందని పక్షంలో ఈ విక్రయ ప్రకటన యొక్క ప్రచురణ సర్వీస్ యొక్క పద్ధతికి ప్రత్యామ్నాయంగా పరిగణించబడుతుందని ఇందుమూలముగా ప్రకటించడమైనది.

ప్రదేశం : పశ్చిమగోదావరి, ఆంధ్రప్రదేశ్
తేదీ : 05.07.2025

సం/ అధీకృత అధికారి
నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున

# వార్త

చక్కగా ఆలోచించడం, మితంగా మాట్లాడటం, మితంగా తినడం అలవర్చుకోవాలి.

-ఆర్. షోకాల్డ్

## జిన్‌పింగ్ ప్రస్థానానికి తెర!

బీజింగ్ ప్రీమియర్‌గా ఇన్నాళ్లూ ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఎక్కడున్నారో వెతుక్కోవడానికి చైనా ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. పన్నెండేళ్ల పాటు ఆయన పాడిందే పాట, ఆడిందే ఆట. ఏ దేశం మీద ఎలాంటి వ్యూహాలు పన్నినా, ఎలాంటి విధానాలు అవలంబించినా ఆయన మాటకు ఎంతో విలువుండేది. ఎందుకో ఆయన ఈ మధ్య చైనా అంతర్గత పాలనా మండలి సమావేశంలో అంతకన్నా అత్యంత కీలక సమావేశాల్లోనూ కనపడటం లేదు. ఆయన గొంతు వినపడడం లేదు. త్వరలో జరుగనున్న 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారా లేదా! అన్న అంశంపై రకరకాల ఊహాగానాలు వెలువడుతున్నాయి. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్టు, ఇథియోపియో, ఇరాన్, సౌదీ అరేబియా, యుఎఇల వంటి దేశాలతో కొనసాగుతున్న 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సు బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జులై ఐదు నుంచి ఎనిమిది వరకు జరుగుతుంది. భారతప్రధాని నరేంద్రమోడీ కూడా పాల్గొంటారు. నిజానికి ఈసారి భారత్, చైనా అధ్యక్షుడు కలిసినప్పుడు ఎన్నో సౌహార్థ సంబంధాలపై మాట్లాడుకోవాల్సి ఉంది. పాకిస్థాన్‌కు చైనా ఎంత దగ్గరనుకున్నా చూసి చూసి ఎవరికోసమో భారత్‌తో పేజీ తెచ్చుకోదు. చైనాకు అధ్యక్షుడెవరైనా వారిని చైనా కమ్యూనిస్టు పార్టీ చెప్పుచేతల్లోనే నడిపిస్తుంది. పాలనా వ్యవహారాల్లోనూ పార్టీ ఆదేశాలు లేకుండా అడుగు ముందుకు కదలదు. కొంత కాలంగా జీ జిన్‌పింగ్ ఆచూకీ తెలియనివ్వకుండా చైనా జాగ్రత్త పడుతోందంటే అక్కడ అధ్యక్ష మార్పు తప్పదేమో అనే సంకేతాలను ప్రపంచానికి పంపుతున్నట్లు అనుకోవాలా? అంటే ఔననే మాటే వినిపిస్తోంది. గత 'బ్రిక్స్' సమావేశంలో మోడి, జిన్‌పింగ్‌లు స్నేహపూర్వక వాతావరణంలో సఖ్యతతో మాట్లాడుకున్నాక భారత్, చైనాల మధ్య సజావుగానే వ్యవహారాలు నడుస్తున్నాయి. అందుచేత ఈసారి 'బ్రిక్స్' సమావేశాల్లో వారిద్దరి భేటీ జరిగితే ఇరుదేశాల మధ్య మరింత సఖ్యత వెల్లివిరుస్తుందని భావిస్తున్న తరుణంలో ఓ పెద్దాయన పాత్ర కనుమరుగవడం విశేషంగా చెప్పుకోదగినదే. చైనాలో జిన్‌పింగ్ చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో ఆయన్ని ఈ శకపురుషునిగా అభివర్ణించిన సందర్భాలున్నాయి. సంస్కరణాభిలాషిగా చెప్పుకుంటారు. పరిపాలనాదక్షుడు కూడా. ఎంతున్నా ఎంతన్నా ఎలాంటి వారినైనా చైనా కమ్యూనిస్టు పార్టీ పక్కన పెట్టేయగలదు. దీనంతటికీ కారణం చైనాలో సామాజిక పరిస్థితుల్లో మార్పు వస్తోందని గమనించిన పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకోడానికైనా వెనుకాడదు. అక్కడి జీవన ప్రమాణాలు పడిపోవడంతో ప్రభుత్వం మీద జనానికి అసహనం పెరిగిపోతోంది. ప్రభుత్వంపై అసంతృప్తి చాపకింద నీరులాపెరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరుగుతున్నందున పార్టీ ప్రజల పక్షాన ఆలోచించడం తప్పడం లేదని ఓ వాదన. అంతేకాదు కమ్యూనిస్టు పార్టీ ఎంతబలంగా ఉన్నా అక్కడా పార్టీ నేతల్లో విభేదాలూ ఉంటాయి. రాజకీయాలు జరుగుతుంటాయి. పార్టీ వివిధకోణాల్లో ఆలోచించడానికి అంతర్గత రాజకీయాలు కూడా కారణమవుతుంటాయి. గత కొంతకాలం నాడు జరిగిన సందర్భాలను ఇప్పుడు గుర్తు చేసుకోవాలి. 2022లో సిపిసి మహాసభల నుంచి మాజీ అధ్యక్షుడు జింటావోను అవమానకర రీతిలో సాగనంపడానికి ప్రధాన కారణం జీ జిన్‌పింగ్ అనే అపప్రథ ఉంది. అది కమ్యూనిస్టుపార్టీల ఆలోచనా విధానమొక్కటేఎలాంటి మార్పునైనా ప్రకటిస్తుంది. అయినా జిన్‌పింగ్ మీదనే జింటావో తొలగింపు అపనింద పడింది. ఈసారిజింటావో వంతు వచ్చి జిన్‌పింగ్ ఉద్వాసనకు దారి చూపిస్తున్నారని చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే మరికొన్ని విషయాలు జిన్‌పింగ్ ఉద్వాసన ఖాయమనే భావనలను సృష్టించింది. జిన్‌పింగ్ మద్దతుదారులను, ప్రధానంగా జనరల్స్‌ను కీలక బాధ్యతల నుంచి తప్పిస్తున్నారు. జిన్‌పింగ్‌ను తప్పించేందుకు పార్టీ వ్యూహాత్మక వైఖరిని అవలంబిస్తోందని చెప్పాలి. ఇవన్నీ క్రోడీకరించి చూస్తే రేపోమాపో జిన్‌పింగ్ ఉద్వాసన సమాచారాన్ని పార్టీ అందించినాఆశ్చర్యపోనక్కర్లేదు. ఎవరున్నా ఎవరులేకున్నా కమ్యూనిస్టు దేశాల్లో 'పాలనాశూన్యత' అనే అంశానికి ప్రాధాన్యతఉండదు. చైనాలో జరుగుతున్నదీ అదే! ఈనెల 5-8 తేదీల్లో జరిగే 17వ బ్రిక్స్‌సదస్సుకు జిన్‌పింగ్ హాజరుకాబోవడం లేదనే వార్త కమ్యూనిస్టు దేశాలనేకాక ప్రపంచ దేశాలను కదిలించింది. ఈ సదస్సుకు జీ జిన్‌పింగ్‌కు బదులు ప్రధాని లీక్వియాంగ్ హాజరవుతారని చైనా విదేశాంగ ప్రతినిధి వివరించారు. గత కొద్దిరోజులుగా జిన్‌పింగ్ ప్రభుత్వ పాలనలో స్వయం గా జోక్యం చేసుకుంటున్నారో లేదో అధికార నిర్ణయాల చర్చలోఉంటున్నారో లేదో తెలియదు కాని బహిరంగ అధికార కార్యక్రమాల్లో మాత్రం పాల్గొనడంలేదు. అలాగే జిన్‌పింగ్ ఫొటోలతోనూ, ప్రసంగాలతోనూ సందేశాలతో నూ నిండిపోయి కనిపించే 'పీపుల్స్ డైలీ' పత్రిక ప్రథమ పేజీలుకనీసం ఆయన ఫొటోలు లేకుండానే వెలుడుతున్నాయి. ఆయనకున్న వ్యక్తిగతభద్రతా సిబ్బందిని బాగా తగ్గించారు. ఆయన తండ్రి స్మారక కేంద్రానికి ఉన్న అధికా రిక హోదాను తొలగించారు. ద్వైపాక్షిక సమావేశాల్లోనూ జిన్‌పింగ్ ప్రస్తావన వినిపించడం లేదు. చైనాకు వచ్చే విదేశీ అధికార ప్రతినిధులు కానీ, పాలకులు కానీ వచ్చిన ప్పుడు చైనా కమ్యూనిస్టుపార్టీ సీనియర్ నేతలే ఆతిథ్యమిచ్చి సాగనంపుతున్నారు. జిన్‌పింగ్ జాడలేకపోవడంతో చైనా పాలనలో ఆయన శకం ముగిసిందనే సంకేతాలు వెలువడుతున్నాయి.


కొద్దిపాటి నిర్లక్ష్యం కూడా ఒక్కోసారి పెద్దపెద్ద సమస్యలను సృష్టిస్తుంది.
ఫ్రాంక్లిన్


కాలానికి మంచి, చెడు అని రెండు రకాలు లేవు. అలా మనం అనుకుంటామంతే.
నెపోలియన్

## ప్రజావాక్కు



### సమస్యగా మారుతున్న ఇ-వేస్ట్

**ఈ డిజిటల్** యుగంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు(ఈవేస్ట్) ఒక తీవ్రమైన సమస్యగా మారుతోంది. మొబైల్, కంప్యూటర్, టీవీ, ఫ్రిజ్ వంటి పరికరాల వినియోగం వేగంగా మారుతూఉండటం ఈసంక్షోభాన్ని మరింతపెంచుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం, భారతదేశంలో 2023వ సంవత్సరంలో సుమారు 17 లక్షల టన్నుల ఈవేస్ట్ ఉత్పత్తి అయింది. అయితే, దీనిలో కేవలం 30 మాత్రమే అధికారికంగా ప్రాసెస్ చేయబడింది. మిగిలిన వ్యర్థాలు అనధికారిక రంగాల్లో సరైన భద్రతా చర్యలు లేకుండా నిర్మూలించబడుతున్నాయి. దీని వల్ల వాయు, జల, మట్టికాలుష్యం వంటి తీవ్రమైన సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈవ్యర్థాలలో సీసం, పాదరసం, క్యాడ్మియం వంటి విషపదార్థాలు ఉంటాయి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### నిప్పులేందే పొగరాదు

**కాళేశ్వరం** కమిషన్ విచారణకు కెసిఆర్ హాజరై వివరణ ఇచ్చుకోవలసి వచ్చింది. అంతకు కెసిఆర్ మేనల్లుడు కూడా విచారణకు హాజరైఅధికారులు అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇవ్వవలసి వచ్చింది. ఈ కార్‌రేసులో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారంటు కెసిఆర్‌తనయుడిపై ఆరోపణలు వచ్చాయి. ఇక లిక్కర్ స్కాంలో కెసిఆర్ తనయ ఏకంగా జైలుకి వెళ్లవలసి వచ్చింది. ఇవీ కెసిఆర్ కుటుంబ చరిత్ర 9ఏళ్ల పాటుఅధికారంలో ఉండిరాష్ట్రాన్ని కెసిఆర్ కుటుంబం దోచుకుందని ప్రతిపక్షాల నాయకులు నిందిస్తున్నారు. అయితే తమపై వచ్చినవన్నీ నిందలేకాని నిజాలు కావని బిఆర్ఎస్ నాయకులు అంటున్నారు. వీరిలో ఎవరు కరెక్ట్, ఎవరు రాంగ్. ఏవి ఏమైనా పాలకులు నిజాయితీగా ఉండాలి.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### లెక్చరర్ హోదా కల్పించాలి

**తెలంగాణ** రాష్ట్రంలో విద్యారంగంలో నూతన సంస్కరణలు ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావించడం చాలా సంతోషకరం. 12వ తరగతివరకు పాఠశాలవిద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలి అని ప్రభుత్వం భావిస్తుంది. రాష్ట్రంలో ఉన్న జూనియర్, గురుకుల కళాశాలలో పని చేస్తున్న లెక్చరర్‌లకు ప్రత్యేకహోదా కల్పించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### వీరు అవినీతిపరులేనా?

**గత యేడాది** జరిగిన అసెంబ్లీ లోక్‌సభ ఎన్నికల సమయంలో బిజెపి అగ్రనాయకులు రాష్ట్రానికి వచ్చి అవినీతికి తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌లా అయిందని ఇంతటి అవినీతి ప్రభుత్వాన్ని ఎప్పుడూ ఎక్కడా తాము చూడలేదని ముఖ్యమంత్రి కెసిఆర్ అవినీతి సామ్రాట్ అని ఆయన కనుసన్నల్లోనే అవినీతి జరుగుతోందని, ఆయన భాగోతాన్ని బయటపెడతామని కెసిఆర్ జైలుపాలు చేస్తామని, కెసిఆర్‌పై ఎన్నో విమర్శలు చేస్తూ నిప్పులు చెరిగారు. అలాగే కాంగ్రెస్ మాజీ మంత్రులు, ఎంపిలు అవినీతిపరులని వారిపై కూడా తరచూ విమర్శలు చేస్తుంటారు. వీరిని అది చేస్తాం, ఇది చేస్తాం ఏదో చేస్తాం అంటూ ఒంటికాలుపై లేస్తుంటారు. అయితే కెసిఆర్‌ని గాని, కాంగ్రెస్ నాయకులను గాని బిజెపివాళ్లు ఏమీ చేయలేకపోతున్నారు. దర్యాప్తు సంస్థలతో వారు చేసిన తప్పులు బహిర్గతం చేయాలి. వారికి శిక్ష పడేలా చేయాలి.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి

**నేడు దేశంలోని** అనేక ప్రతిష్టాత్మక యూనివర్సిటీలలో ఐఐటీయన్ ఐటీ విద్యా సంస్థలలో సగానికి పైగా ప్రొఫెసర్ ఉద్యోగాలు భర్తీకి నోచుకోకపోవడం మూలంగా ఆయా ఉన్నత విద్యా సంస్థలలో విద్యాబోధనకు తీవ్రప్రతిబంధక పరిస్థితులు తలెత్తుతున్నాయి. విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పార్లమెంటులో ప్రవేశపెట్టినఉన్నత విద్యాశాఖ 2025-26డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడి చేసింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీలని గుర్తించి ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### న్యాయ విచారణ చేపట్టాలి

**మెయింటనేన్స్** లేక గాలిలోనే ప్రాణాలను కలిపేస్తున్న విమాన ప్రమాదాలు, ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా పాతబడిన బస్సులలో, రైళ్లలోప్రమాదాలలో కోల్పోతున్న ప్రాణాలు. మొన్న సీగాచి లోజరిగిన రియక్టర్ పేళ్లలు. మానేజ్మెంట్ ఎలాంటి రియాక్టర్లను చిరకాలంగా వాడుతోంది, మైంటెనెన్స్‌కి పనికి వచ్చేవేనా, లేదా డిసకార్డ్ చేసి కొత్తవి పెట్టాలా. వీటి గురించి ఎవ్వరూ మాట్లాడరు. ముందు ప్రాణాలు పొట్టన పెట్టుకుంటున్నారు. న్యాయవిచారణజరపించరు. ఇదిఅసలుజరగనే జరగదు.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

**మనవి** ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## గిట్టుబాటు కాకపోతే జరుగుబాటెట్లా?

**ఎన్నో సమస్యలతో అతలాకుతలమవుతున్న రైతాంగంపై కూలీల కొరత మోయలేని భారంగా తయారైంది. ఉపాధి హామీ పథకం ఏమేరకు, ఎంతవరకు ఉపయోగపడిందో ఏమోకానీ వ్యవ సాయరంగంపై తీవ్రప్రభావం చూపుతున్నది. వ్యవసాయరంగం మీదనేకాదు దాని అనుబంధ రంగాలైన పాడి, కోళ్ల పరిశ్రమలపై కూడా తీవ్రంగా పడింది. కేవలం కూలీల కొరతతో సాగు కావాల్సి న దేశవ్యాప్తంగా లక్షలాది ఎకరాలకు చెందిన రైతులు కాడి కింద పెట్టారు. ఎంత సాగు చేస్తే అంత నష్టం అన్నట్లు తయారైంది పరిస్థితి. వ్యవసాయానికి మంగళం పాడేందుకే రైతులు సిద్ధమైతే పరిస్థితి ఏమిటో విజ్ఞతతో ఆలోచించాలి. పొలాలు బీడుపడితే దేశం కడుపు నిండదు. పండించేవారు లేకపోతే పాలించేవారికి ముద్దపుట్టదనే విషయాన్ని విస్మరించకూడదు.**

దామెర్ల సాయిబాబ

భూమిని నమ్ముకున్నవారు ఎన్నటికీ చెడిపోరనేది పాతకాలపు నమ్మకంగా మారిపోయింది. గ్రామాల్లోఉంటూ భూమిపైనే ఆధారపడుతూ వ్యవసాయమే ఏకైక జీవనాధారంగా బతకడం ఒక శాపంగా పరిణమిస్తున్న దురదృష్టపు రోజులు దాపురించాయి. రైతు సంక్షేమమే ధ్యేయంగా వారి అభ్యున్నతికి ఏమి చేయడానికి అయినా వెనుకాడమని రాజకీయ పార్టీల నేతలు ఎంతగా చెబుతున్నా రైతులకు చేయూతనిచ్చేందుకు ఎన్ని కార్యక్రమాలు చేపడుతున్నా వ్యవసాయదారుల పరిస్థితి ఏమాత్రం మెరుగుపడడం లేదు. ఒకపక్క ప్రకృతి సహాయ నిరాకరణ, మరొకపక్క తోటి మానవుడు చేస్తున్న దోపిడీ, దగాలతో అన్నదాతలు రోజురోజుకు కృంగిపోతున్నారు. పిట్టల్లా రాలిపోతున్నారు. ఆత్మహత్యల పరంపరం కొనసాగుతూనే ఉన్నది. తెలుగు రాష్ట్రాలతోసహా దేశవ్యాప్తంగా ప్రధానంగా వ్యవసాయం గిట్టుబాటుకాక అప్పులు తీర్చే మార్గంలేక ఎందరో అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాము చేసే కష్టానికి తగినట్టుగా పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇప్పించమని దశాబ్దాల తరబడి పాలకులను వేడుకుంటున్నారు. ఐదేళ్లలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన కేంద్ర పాలకులు ఆదాయం సంగతి దేవుడెరుగు, పెట్టుబడిని రెండు మూడు, రెట్లు పెంచారని రైతులు వాపోతున్నారు. వాస్తవంగా వ్యవసాయరంగంలో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. ఎరువులు, క్రిమిసంహారక మందుల దగ్గర నుంచి కూలీల రేట్లతోపాటు ప్రతి దశలోనూ ఖర్చులు ఊహించని రీతిలో పెరిగిపోయాయి. గతంలో ఒక ఎకరం వరిపొలం దుక్కి దున్నేందుకు గంటకు ఆరేడు వందల రూపాయలు ట్రాక్టర్‌కు చెల్లించేవారు ఇప్పడది పద్నాలుగు వందల నుండి పదిహేడు వందల తీసుకొంటున్నారు. కేంద్రం పెంచిన డీజల్ పెట్రోల్ ధరలు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేంద్ర పాలకులు వరితోపాటు పద్నాలుగు పంటలకు కనీస మద్దతు ధరలు గత నెలలో ప్రకటించారు. అవి ఏమాత్రం ఆశాజనకంగా లేవు. క్వింటాలుకు వరికి అరవైతొమ్మిది రూపాయలు, జొన్నలకు మూడువందల ఇరవైఎనిమిది, సజ్జలకు నూటయాభై, మొక్క జొన్నలకు నూటయాభై, కందిపప్పుకు నాలుగు వందల యాభై, మినుములకు నాలుగువందలు, పెసర్లకు ఎనభైఆరు రూపాయలు, పొద్దుతిరుగుడుకు నాలుగువందల నలభైఒక్కటి పెంచారు. గతయేడాదితో పోలిస్తే ఇదితక్కువే. వాస్తవంగా ఒక వరి పంటనే తీసుకున్నా క్వింటాలు వరి ఉత్పత్తికి జాతీయ సగటు ఉత్పత్తి వ్యయం మూడువేల నూటముప్పైఐదు రూపాయలుగా రైతు సంఘాలు అంచనా వేస్తున్నాయి. కానీ కేంద్రం తాజాగా వరికి ప్రకటించిన కనీస మద్దతు ధర రెండువేల మూడువందల అరవైతొమ్మిది రూపాయలు మాత్రమే. అలాగే పత్తికి క్వింటాలుకు పదహారువేల రూపాయలు ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తే కేంద్రం ఏడువేల ఏడువందల పదిరూపాయలకు మాత్రమే పరిమితమైంది. దాదాపు అన్ని పంటలకు ఇదే పరిస్థితని చెప్పొచ్చు. తెలంగాణ ప్రభుత్వం వరికి క్వింటాల్‌కు ఐదువందల రూపాయలు ప్రకటించడం తెలంగాణలోని రైతులకు కొంతలో కొంత ఊరట కల్గించింది. మొత్తం మీద వ్యవసాయంలో లాభాల మాట అటుంచి పెట్టుబడులు వెళ్లని పరిస్థితులు దాపురించాయి. రాబోయే సీజన్‌లో విత్తనాల కొరత ఉండదు, సకాలంలో రుణాలను పంపిణీ చేస్తాం, ఎరువుల సమస్య రానేరాదు, అవసరానికి

### ఒక్క మాట

మించి అన్ని గోదాముల్లో నిల్వ ఉంచుతాం, ఏ రైతు విత్తనాలు, ఎరువులకు ఇబ్బంది పడకుండా చూస్తాం, నకిలీ, నాసిరకంపై ఉక్కుపాదం మోపి రైతులు మోసపోకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని ఖరీఫ్ ముందు పాలకులు పెద్దపెద్ద మాటలు చెప్పడం ఆనవాయితీ అయిపోయింది. ఆ తర్వాత పరిస్థితి యథాతథమే. ఇదేదో ఈ ప్రభుత్వాలు వచ్చిన తర్వాత మొదలైందని చెప్పడం లేదు. ఏనాటినుంచో జరుగుతున్నది. అందుకే వ్యవసాయం రోజురోజుకు సంక్షోభంలో కూరుకుపోతున్నది. అధికారంలో ఉన్నవారు మాత్రం పైకి ఏమనలేకపోయినా ఇందుకు తాము బాధ్యులం కాదన్నట్లుగా వ్యవహరించడం ఆనవాయితీగా మారిపోయింది. ప్రతిపక్షంలో ఉన్నవారు ఈ ప్రభుత్వం చేస్తున్న హత్యలేనంటూ విమర్శలు కురిపించడం, పరామర్శించడం పరిపాటైపోయింది. వాస్తవంగా రైతుల సమస్యలు కొత్తగా పుట్టుకొచ్చినవి కాదు. నాయకులకు తెలియనివి కూడా కావు. అసలు వ్యవసాయ ప్రణాళిక ప్రారంభం నుండే లోపాలతో మొదలవుతున్నది. వ్యవసాయ, బ్యాంకు తదితర సంబంధితశాఖల ఉన్నతాధికారులు ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఒక ప్రణాళికను తయారు చేసి సుదీర్ఘంగా చర్చించి ముసాయిదాను తయారు చేస్తారు. ఎరువులు ఎంత కావాలి? బ్యాంకుల నుంచి రుణాలు ఎంత ఇవ్వాలి? తదితర అంశాలన్నీ చర్చించి, పొందుపరిచి పక్కాప్రణాళిక తయారు చేసి ఆమోదముద్ర వేస్తారు. అయితే ఈ ప్రణాళికను ఎవరికోసం ఉద్దేశించబడిందో, ఎవరు ఆచరించాలో ఆ రైతులకే తెలియదు. ఆ రైతు ప్రతినిధులకు అందులో ప్రవేశం ఉండదు. వారిని సంప్రదించే పద్ధతి కూడా లేదు. అధికారులు రాత్రింబవళ్లు కష్టపడి తయారు చేసిన ప్రణాళిక వాస్తవంగా సాగుకుచాలా సందర్భాల్లో పొంతన ఉండడం లేదు. వర్షాలు, నీటి ఆధారాన్ని బట్టి ఏయేరకం పంటలు ఎప్పుడు వేయాలి? ఏ విత్తనం వాడాలి. తదితర అంశాలు రైతులే ఆయా ప్రాంతాల పరిస్థితులను బట్టి నిర్ణయించుకుంటున్నారు. అందరూ ఊహించినట్టుగా రోహిణికార్తెలో వర్షాలు ఆరంభమై మృగశిర ఆరుద్ర కార్తెల వరకు చెరువులు, కుంటల్లోకి నీరు వస్తే వేసే వంగడాలు వేరు. ఆ వర్షాలు ఆలస్యమై నీరు సమృద్ధిగా లేకపోతే విత్తేవిత్తనాలు, పంటలు వేరు. ఇలా వర్షాల పరిస్థితులను బట్టి సాగు చేసుకుంటారు. ఇవన్నీ అధికారులకు తెలియంది కాదు. జీతభత్యాలు తీసుకుంటున్నారు కనుక వారిపాటికి వారు ఏవో తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తుంటారు. అందుకే క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ ప్రణాళికలకు కొన్ని సందర్భాల్లో సంబంధం లేకుండాపోతుంది. పత్తిపెట్టవద్దు, ప్రాణం మీదకు తెచ్చుకోవద్దని ఎన్ని విధాలుగా చెప్పున్నా కూడా చావో బతుకో పత్తిలోనే తేల్చుకోవాలనే ధ్యేయంతో పత్తిసాగువైపే మొగ్గుచూపుతున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల్లో పత్తి, మిర్చి తదితర వాణిజ్యపంటల రైతులే ఎక్కువ శాతం మంది ఉన్నారనే విషయం రికార్డులే వెల్లడిస్తున్నాయి. ఇక నకిలీ, నాసిరకం విత్తనాలు రైతుల ప్రాణాలు తీస్తున్నాయి. శ్రమంతా చేసి తలతాకట్టుపెట్టి, పెట్టుబడి అంతా పెట్టిన తర్వాత ఆ విత్తనం నకిలీదో, నాసిరకమై పంట దెబ్బతింటే ఆ రైతు ఒక్కసారిగా కుప్పకూలిపోతున్నాడు. అంతెందుకు గత ఐదేళ్లలో ఏయే విత్తనాల కంపెనీలు ఎన్నివేల క్వింటాళ్ల సరఫరా చేశాయో, వారికున్న మౌలిక వసతులు ఏమిటి? వారుఎక్కడి నుండి విత్తనాలు సేకరించారు? తదితర అంశాలుపరిశీలిస్తే, పరిశోధిస్తే విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తాయి. ప్రతిసారి ఈ సీజన్‌లో నకిలీ, నాసిరకం విత్తనాలు విస్తృతంగా సరఫరా కావడం అధికారులకు పట్టుబడడం, కేసులు పెట్టడం జరుగుతున్నది. రైతులను మోసం చేసిన వ్యాపార సంస్థలపై చర్యలు తీసుకునేందుకు చట్టాలున్నా అవి దళారులకు ఉపయోగపడే విధంగా ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటిని సవరించి రైతులను దగా చేసిన వ్యాపారులను ఉక్కుపాదంతో అణచివేసే విధంగా చట్టాన్ని సవరిస్తామని గత రెండు, మూడు దశాబ్దాలుగా పాలకులు చెబుతున్నా ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదు. ఇలాంటి ఎన్నో సమస్యలతో అతలాకుతలమవుతున్న రైతాంగంపై కూలీల కొరత మోయలేని భారంగా తయారైంది. ఉపాధి హామీపథకం ఏమేరకు, ఎంతవరకు ఉపయోగపడిందో ఏమోకానీ వ్యవ సాయరంగంపై తీవ్రప్రభావం చూపుతున్నది. వ్యవసాయరం గం మీదనేకాదు దాని అనుబంధ రంగాలైన పాడి, కోళ్ల పరి శ్రమలపై కూడా తీవ్రంగా పడింది. కేవలం కూలీల కొరతతో సాగు కావాల్సి న దేశవ్యాప్తంగా లక్షలాది ఎకరాలకు చెందిన రైతులు కాడి కింద పెట్టారు. ఎంత సాగు చేస్తే అంత నష్టం అన్నట్లు తయారైంది పరిస్థితి. వ్యవసాయానికి మంగళం పాడేందుకే రైతులు సిద్ధమైతే పరిస్థితి ఏమిటో విజ్ఞతతో ఆలోచించాలి. పొలాలు బీడుపడితే దేశం కడుపు నిండదు. పండించేవారు లేకపోతే పాలించేవారికి ముద్దపుట్టదనే విషయాన్ని విస్మరించకూడదు.

## ప్రాణాంతక వ్యాధులకు అపరిశుభ్రతే కారణం!

బుగ్గన మధుసూదనరెడ్డి

వర్షాకాలం రానే వచ్చింది, ఇక మనమంతా వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు మన ఇంటిని, మన ఇంటి పరిసరాలను సైతం అత్యంత శుభ్రంగా పెట్టుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా వుంది. ఎందుకంటే మనం ఈ వర్షాకాలంలో ఏమాత్రం అపరిశుభ్రతకు తావు ఇచ్చినా ఇంటి ఆవరణలోని గుంతలలోను, మనం తీసి పారేసిన వస్తువుల లోను మురికినీరు నిల్వ ఉండేందుకు ఏమాత్రం అవకాశం ఇచ్చినా అవి దోమలకు ఆనవాలుగా మారడంతో పాటు అవి మన ఇంటిలో తిష్టవేసి తద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, డయేరియా వంటి వ్యాధులు మనపై దాడి చేసి మన రోగ నిరోధక వ్యవస్థను అత్యంత దారుణంగా చేసేందుకు ఎక్కువగా అవకాశం ఉంటుంది. ముఖ్యంగా దోమకాటు వల్ల ప్రబలే డెంగ్యూ వ్యాధి అత్యంత ప్రమాదకరమైనది. ఇది మనకు పొరపాటున సోకితే మాత్రం మనకు తీవ్ర తల నొప్పులు, కండరాల, కీళ్ల నొప్పులు రావడంతో పాటు, విరోచనాలు, వాంతులు, చర్మంపై దురదలు వంటివి ఏర్పడి ఒక్కొక్కసారి ఆ వ్యాధికి సకాలంలో చికిత్స తీసుకోకపోతే అది మనకు ప్రాణాంతకరంగా సైతం మారే ప్రమాదం పొంచి వుంది. ముఖ్యంగా ఈ సీజనల్ వ్యాధులు మన ఇంటిలోని చిన్నారులపై ఎక్కువగా ప్రభావం చూపి వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతూ ఉంటాయి. అదేవిధంగా మన ఆరోగ్యాన్ని అస్తవ్యస్తం, అధోగతిపాలు చేసే ఈ సీజనల్ వ్యాధులు మన దరి



చేరకుండా ఉండాలంటే ఎప్పటికప్పుడు మన చేతులను శుభ్రం చేసుకుంటూ, మన ఇంటిలోకి దోమలు ప్రవేశించడానికి వీలులేకుండా దొంతెరలు, జెట్ వంటివి వాడుకుంటూ తగు జాగ్రత్తలు పాటిస్తే అది మనకు, మన కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో తోడ్పడుతుంది. అలాకాకుండా మనం తగు జాగ్రత్తలు తీసుకోకుండా ఎలా పడితే ఆలా వ్యవహరించి మన ఆరోగ్యం విషయంలో అత్యంత నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే మాత్రం అది మొదటికే మోసం వచ్చి డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, డయేరియా వంటి వ్యాధులకు చేజేతులారా మనమే రహదారి చూపి అనవసరంగా ఆయా జబ్బులను కొని తెచ్చుకొని హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూ జేబులకు చిల్లులు పెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించడం తథ్యం. ఏదిఏమైనా ఆరోగ్యమే మహాభాగ్యం అని మన పెద్దల నానుడిని ఎల్లవేళలా గుర్తుచేసుకుంటూ ఆరోగ్యాన్ని మరో పదికాలాల పాటు కాపాడుకోవాలంటే మాత్రం ఈ వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులు మన దరి చేరకుండా అత్యంత అప్రమత్తంగా మసలుకోవడం ఇంటికి, వంటికి మంచిది. ఏమైనా ఈ వర్షాకాలంలో ఆరోగ్యం పట్ల ఏమాత్రం అశ్రద్ధ, నిర్లక్ష్యం కనబరచినా సీజనల్ వ్యాధులు చుట్టుముట్టి మనల్ని ఆసుపత్రుల పాలుచేయడంతో పాటు వేలాది రూపాయలు హారతి కర్పూరంలా ఖర్చు అయిపోయి ఆర్థికంగా సైతం చితికిపోయే ప్రమాదం పొంచి వుంది. కాబట్టి పరిశుభ్రత అనే ఆయుధానికి పెద్దపీటవేసి మనతోపాటు మన కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు పాటుపడదాం!

## భారత్‌లో తగ్గిన బాలికల జననాల రేటు


మేకిరి దామోదర్

మన దేశం జనాభా పరంగా ఈ ఏడాది ప్రపంచంలోనే నెంబర్ వన్ (మొదటి) స్థానంలో కొనసాగుతోందని ఐక్యరాజ్య సమితి తెలిపింది. ఈ ఏడాది చివరి కల్లా జనాభా 146 కోట్ల చేరుకుంటుందని అంచనా వేసింది. అయితే జననాల రేటు నిర్దేశిత స్థాయి కంటే దిగువకు పడిపోయిందని వెల్లడించింది. గత నలభై ఏళ్ల తర్వాత తగ్గుముఖం పట్టినట్టు నివేదిక తెలుపుతుంది. భారత్‌లో జననాల రేటు1.9 శాతంగా ఉంది. ఏ దేశంలోనైనా సగటు రీప్లేస్మెంట్ రేటు కనీసం 2.1 శాతంగా ఉండాలి. కానీ భారత్‌లో సంతాన ఉత్పత్తి రేటు పడిపోయింది. జననాల రేటు తగ్గిపోయినప్పటికీ, భారతదేశ జనాభా సంఖ్య నిలకడగా కొనసాగుతుంది. ఇలా ఇంకొన్నాళ్లు కొనసాగి ఆ తర్వాత నుంచి జనాభా తగ్గుదల మొదలయ్యే అవకాశం ఉందని విశ్లేషించింది. మన దేశ జనాభాలో వయసుల వారిగా 68 శాతం జనాభా 15 నుంచి 64 ఏళ్లలోపు వయో వర్గానికి చెందినవారు. ఇది వర్కింగ్ ఏజ్ గ్రూప్, అత్యధిక జనాభా వర్కింగ్ ఏజ్ గ్రూపులో ఉండటం అనేది భారత్‌కు కలిసి వచ్చే అంశం. ఈ వయసులోని వారికి తగినన్ని ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ విధానపరమైన మద్దతు లభిస్తే భారత్ ఆర్థికంగా మంచి పురోగతి సాధిస్తుంది. అలాగే 10 నుంచి 24 ఏళ్లలోపు వారు 26శాతం. 0 నుంచి 14 ఏళ్లలోపు వారు 24శాతం. 10 నుంచి 19 ఏళ్లలోపు వారు 17 శాతం మంది ఉన్నారు. అదేవిధంగా 65 ఏళ్లకు పైబడిన వారు భారత దేశంలో కేవలం 7శాతం మంది ఉన్నారు. ప్రజల ఆయుర్దాయాలు పెరుగుతున్నందున రాబోయే కొన్ని రోజుల్లో 65 ఏళ్ల పైబడిన వయో వర్గంలోని వృద్ధుల సంఖ్య మరింత పెరగవచ్చు. 2025 నాటికి భారతదేశంలోని పురుషుల సగటు ఆయుర్దాయం 71 ఏండ్లు కాగా, మహిళల సగటు ఆయుర్దాయం 74 ఏళ్లుగా ఉంది. మనదేశ మహిళల వల్లే ఈ మార్పు 1971 దశకం నాటికి మనదేశ మహిళల సగటు సంతానోత్పత్తి రేటు ఐదుగురు పిల్లల్ని కనడం. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. మహిళలు సగటున ఇద్దరు పిల్లలకే జన్మనిస్తున్నారు. ప్రెగ్నెన్సీ సమయంలో సంభవించే మరణాలు తగ్గిపోయాయి. ఈ విషయంలో వివిధ రాష్ట్రాలలో కులాలు, ఆదాయ వర్గాలు తేడాలు ఉన్నాయి. సంతానం ఎంతమంది ఉండాలనే దానిపై స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది. అలాగే తెలంగాణ రాష్ట్రంలో బాలురుతో పోలిస్తే బాలికల జననాలు గణనీయంగా తగ్గుతున్నాయి. 2022లో ప్రతి 1000 మంది బాలురకు 907 మంది అమ్మాయిలు మాత్రమే జన్మించారు. ఈ మేరకు బాలురు, బాలికల జననాల నిష్పత్తి జాబితాలో తెలంగాణ దేశంలో దిగువ నుంచి మూడో స్థానంలో ఉంది. తెలంగాణ



తరువాత బీహార్ (891), మహారాష్ట్ర (906)లు మాత్రమే ఉన్నారు. ఏపీలో ఇది (938)గా నమోదయింది. ఈమేరకు దేశవ్యాప్తంగా 2022లో జనన మరణాల నివేదికను కేంద్ర జనాభా లెక్క విభాగం విడుదల చేసింది. అందులోని ప్రధాన అంశాలు 2022లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో బాలురు కంటే బాలికల జననాలు ఎక్కువగా ఉన్నవి. ముచ్చటగా మూడు మాత్రమే. ఆ మేరకు ప్రతి వెయ్యి మంది బాలురకు అత్యధికంగా నాగాలాండ్లో 1,068మంది. అరుణాచల్ ప్రదేశ్‌లో 1,036, లద్దాఖ్‌లో1,027 మంది బాలికలు జన్మించారు. కానీ తాజాగా 2023-24లోకి వచ్చేసరికి దేశంలో విద్యావంతులు పెరుగుతున్న లైంగిక వివక్ష, కరడుగట్టిన పితృస్వామ్య భావజాలం సమాజాన్ని వదిలిపోవడం లేదు. దాంతో అబ్బాయిల కంటే అమ్మాయిలు తక్కువ సంఖ్యలో ఉంటున్నారు. 2023-24 జాతీయ సగటు 1000 బాలురుకు/బాలికలు (930)తో పోలిస్తే చాలా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆడ శిశువుల జననాలు తక్కువే. అవి ఏవంటే (వెయ్యి మంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య) లక్షదీవులు 831, అండమాన్ నికోబార్ 832, బీహార్ 882, మహారాష్ట్ర 915, చండీగఢ్ 916, తెలంగాణ 917, హర్యానా 917, ఢిల్లీ 918, నాగాలాండ్ 919, పంజాబ్ 928, దాద్రా, నగర్ హవేలీ, ధమణ్, దీవ్ 924, గుజరాత్ 925, మధ్యప్రదేశ్ 929, మణిపూర్ 929, వెయ్యి మంది అబ్బాయిలకు గాను పైవిధంగా కేంద్ర పాలిత ప్రాంతాలు, వివిధ రాష్ట్రాల్లో అమ్మాయిల వ్యత్యాసం కొనసాగుతుండడం భారత సమాజానికి శ్రేయస్కరం కానే కాదు. (లోకసభలో కేంద్రం వెల్లడించిన వివరాలు) 2022లో తెలంగాణలో వెయ్యి మంది బాలురకు 907 మంది బాలికలతో తక్కువ నిష్పత్తి నమోదయింది. దేశంలో బాలురు 52.4 శాతం ఉంటే, బాలికలు 47.6 శాతంగా ఉంది. ఇలా బాలికల జననాల రేటు తగ్గిపోవడం ప్రమాదకర సంకేతమే. మహిళలను గౌరవించాలి, అన్ని చోట్ల వారికి సమాన అవకాశాలు కల్పించాలన్న ఉపన్యాసాలు మన దేశంలో వినసొంపుగా వినిపిస్తుంటాయి. సమస్త రంగాల్లో స్త్రీల భాగస్వామ్యం పెరగాలని అప్పుడే అభివృద్ధి పథంలో మనం దూసుకుపోతామని ప్రభుత్వాలు నిత్యం ప్రచారం చేస్తుంటాయి. కానీ ముఖ్యంగా సమాజంలో గుణాత్మక మార్పులకు సాహకారం చేసి రాజకీయ రంగంలో స్త్రీల వాటా వారి జనాభాకు తగినట్టుగా ఉందా! ప్రపంచ ఆర్థిక వేదిక తాజాగా విడుదల చేసిన లింగ సమానత్వ సూచి నేటికీ లేదని చెప్తుంది. అమలుకు నోచుకోని మహిళా రాజకీయ రిజర్వేషన్లు చూస్తున్నాం. ఆర్థిక కార్యకలాపాల్లో స్త్రీ, పురుషుల భాగస్వామ్యం, అందుకు లభిస్తున్న అవకాశాలు, విద్య, ఆరోగ్యం, జీవనస్థితిగతులు, రాజకీయ సాధికారత ప్రాతిపదికలుగా 148 దేశాల కేటాయించిన ర్యాంకుల్లో ఇండియా 131 స్థానంలో చతికిలబడింది. ఆధునిక సాంకేతిక యుగంలో కూడా ఇంకా వెర్రితలలు వేస్తున్న లింగ వివక్ష, పురుష ఆధిపత్య చట్రంలోంచి బయట పడలేకపోతున్న సమాజంలో బాలికల నిస్సహాయతకు అర్థం పడుతుంది. సమాజం, ప్రభుత్వాలు బాలికల జననాల రేటు తగ్గి పోతూ స్త్రీ పురుష నిష్పత్తిలో ఆగాథం పెరిగిపోతే సృష్టికి ప్రమాదం. సమానత్వం సుదూర స్వప్నం కారాదు?. దీన్ని నివారించేందుకు అవగాహన, చైతన్యం పెంచు కోవాల్సిన ఉమ్మడి బాధ్యత చాలా ఉంది.

# చర్చలూ ఆగలేదు..యుద్ధమూ ఆపలేదు

## ట్రంప్-పుతిన్ మధ్య మరో దఫా చర్చలు
## కాల్పుల విరమణకు సుముఖంగాలేని పుతిన్



**వాషింగ్టన్, జూలై 4:** అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ అధికారం చేపట్టిన నాటి నుంచి రష్యాతో యుద్ధ విరమణ చేయించడానికి నానా తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో పుతిన్‌ను ఆకాశానికి ఎత్తేస్తున్నారు. కానీ, గతంలో గూఢచర్య సంస్థలో పనిచేసిన నేపథ్యం ఉన్న రష్యా అధినేత వద్ద ట్రంప్ ఎత్తులు పారడం లేదు. అమెరికా అధ్యక్షుడికి గౌరవం ఇస్తూనే ఉక్రెయిన్ విషయంలో పట్టువిడవడం లేదు. తాజాగా అలాంటి ఘటనే చోటుచేసుకుంది. రష్యా అధినేత పుతిన్ గురువారం ఏజెన్సీ ఫర్‌స్ట్రాటజిక్ ఇనీషియేటివ్స్ అనే సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడితో ఫోన్‌కాల్ మాట్లాడాలని షెడ్యూల్ ఫిక్స్ అయింది. ఈ క్రమంలో ఆయన సదస్సు మధ్యలోనే తాను అమెరికా అధ్యక్షుడితో మాట్లాడాల్సి ఉందంటూ అర్ధంతరంగా వేదికపై నుంచి లేచివెళ్లిపోయారు. 'దయచేసి మీరు కోప్పడొద్దు. మనం చాలా అంశాలపై మాట్లాడుకోవాలని నాకు తెలుసు. కానీ, ఆయన్ను వెయిట్ చేయించడం ఇబ్బందికరం. ఆయన బాధపడొచ్చు కూడా' అంటూ బహిరంగ వేదికపై మైకులో పుతిన్ చెప్పారు. ఇప్పుడు ఆ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ట్రంప్ అంటే విపరీతమైన గౌరవం ఉన్నట్లు ఈ సంఘటన కనిపిస్తుండగా వాస్తవానికి చర్చల్లో మాత్రం పుతిన్ ఒక్క అంగుళం కూడా వెనక్కి తగ్గలేదు. అమెరికా కాలమానం ప్రకారం గురువారం ఉదయం 10గంటలకు ఉక్రెయిన్ యుద్ధం తదితర అంశాలపై పుతిన్-ట్రంప్ సుమారు గంటసేపు చర్చలు జరిపారు. ఇంత చేసినా వారు ఏ నిర్ణయానికి రాలేదు. ఈ విషయాన్ని స్వయంగా ట్రంప్ ఆతర్వాత అంగీకరించారు. ఈ విషయమై జర్నలిస్టులతో ఆయన చెబుతూనే 'మేము ఈరోజు ఎటువంటి పురోగతి సాధించలేదు. ఫోన్‌కాల్‌లో సుదీర్ఘంగా మాట్లాడుకొన్నాం. ఇరాన్ విషయం సహా పలు అంశాలపై మాట్లాడుకొన్నాం. మీకు తెలుసు కదా ఉక్రెయిన్ అంశం చర్చకు వచ్చింది. ఆ విషయంలో నేను ఏమాత్రం సంతృప్తిగా లేను. ఏమాత్రం పురోగతి సాధించలేదు' అని ట్రంప్ నిరాశ వ్యక్తం చేశారు.

**రష్యా వెనక్కి తగ్గదు: క్రెమ్లిన్**

ఇక పుతిన్ సహాయకుడు యూరీ ఉషాకోవ్ మాట్లాడుతూ ఇరువురు నాయకులు సూటిగా చర్చించు కొన్నారు. తక్షణమే కాల్పుల విరమణ చేపట్టాలని ట్రంప్ సూచించినా పుతిన్ తిరస్కరించారు. ఈ యుద్ధానికి కారణమైన మూల సమస్యల విషయం రష్యా లక్ష్యాలను సాధించడానికి కట్టుబడి ఉన్నట్లు తేల్చిచెప్పారు. అదే సమయంలో దౌత్య మార్గంలో అంతిమంగా పరిష్కరించుకొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. యుద్ధవిరమణ కోసం ట్రంప్-పుతిన్ చర్చించుకోవడం ఇది ఆరోసారి.


**సమావేశం ముగిసింది.. దాడి మొదలైంది..**

ట్రంప్ బాధ పడతారు అంటూ పుతిన్ హడావుడిగా వెళ్లినా ఉక్రెయిన్‌పై కఠినవైఖరిలో ఏమాత్రం సడలింపు లేదు. అమెరికా అధ్యక్షుడితో సమావేశం ముగిసిన కొద్దిసేపటికే ఉక్రెయిన్ రాజధాని కీవ్‌సహా 13 ప్రదేశాలను లక్ష్యంగా చేసుకొని మాస్కో భారీగా క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసింది. దీనిలో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. కింజాల్ హైపర్‌సోనిక్ క్షిపణులను రష్యా వాడినట్లు ఉక్రెయిన్ వాయుసేన పేర్కొంది. వీటితోపాటు బాలిస్టిక్ క్షిపణులు కూడా ప్రయోగించినట్లు వెల్లడించింది. మొత్తం రెండు విడతల్లో ఈ దాడి జరిగింది.



## నౌకాదళ ఏవియేషన్ పైలట్‌గా
# తొలి మహిళ ఆస్తాపూనియా

**న్యూఢిల్లీ, జూలై 4:** భారత నావికాదళంలోనికి మొట్టమొదటిసారిగా ఫైటర్ బృందంలోనికి శిక్షణ పొందిన సబ్ లెఫ్టినెంట్ ఆస్తా పూనియా నియమితులయ్యారు. భారత యుద్ధనౌకల ఏవియేషన్ విభాగంలోనికి మొట్టమొదటి మహిళా పైలట్‌గా ఆమెను నియమిస్తున్నట్లు నౌకాదళ చీఫ్‌ప్రకటించారు. అంతేకాకుండా పూనియాతో పాటే లెఫ్టినెట్ అతుల్‌కుమార్‌దుల్ ప్రతిష్టాత్మకమైన వింగ్స్ ఆఫ్ గోల్డ్ ధృవపత్రాన్ని అందుకున్నారు. నావికాదళ సిబ్బంది అసిస్టెంట్ చీఫ్‌నుంచి ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. ఆస్తాపూనియా నియామకంతో భారత నౌకాదళం యుద్ధనౌకలపైకి కూడా మహిళా పైలట్లు తొలిసారిగా నియమితులయినట్లు అసిస్టెంట్ చీఫ్ జనక్ బేవ్లీ ప్రశంసించారు. పూనియా ఇటీవలే సెకండ్ బేసిక్ హాక్ కన్వర్షన్ కోర్టును విశాఖపట్టణంలోని ఐఎన్ఎస్ డేగాలో పూర్తిచేసారు. ఇప్పటికే మహిళలు నావికాదళం ఎయిర్‌ఫోర్స్ ఆపరేషన్లలోను, ఎంఆర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, హెలికాప్టర్లు వంటివాటిలో మహిళలను నియమించారు. ఆస్తాపూనియా ఫైటర్ పైలట్ బృందంలోకి రావడంతో నావికాదళ ఏవియేషన్ విభాగంలో నారిశక్తిని ప్రతిబింబిస్తోందని అంతేకాకుండా ఎలాంటి వివక్ష లేకుండా సమానత్వం, సంస్కృతి సాంప్రదాయాలు, మహిళలకు లభించే అవకాశాలను ప్రోత్సహిస్తున్నట్లు భారత నౌకాదళం ఒక ప్రకటన విడుదలచేసింది. 2016లోనే భారతీయ వైమానికశాఖ ముగ్గురు మహిళా అధికారులను నియమించింది. అవని చతుర్వేది, భావనా కాంత్, మోహనాసింగ్‌లు యుద్ధవిమానాల పైలట్లుగా నియమించింది. ఆ తర్వాత ఇపుడు నౌకాదళం ఎయిర్‌ఫోర్స్ ఆపరేషన్లలో కూడా నియమించిన తర్వాత యుద్ధనౌకల్లోకి ఫైటర్ పైలట్లుగా మహిళలు రావడం ఇదే తొలిసారి అని నౌకాదళ విభాగం ప్రకటించింది.



## దలైలామా ఎంపిక విషయంలోకి రాకండి
### భారత్‌కు చైనా హెచ్చరిక


**బీజింగ్, జూలై 4:** టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా వారసుడి ఎంపికపై నిర్ణయం తీసుకునే హక్కు ఆయనకే ఉందని భారత్ ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై స్పందించిన చైనా టిబెట్ విషయల్లో భారత్ జోక్యం చేసుకోవడంతగదని, ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినకుండా చూసుకోవాలని పరోక్ష హెచ్చరికలు చేసింది. అంతకుముందు ఇదే అంశంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ దలైలామా వారసుడిని నిర్ణయించే అధికారం, అందులో జోక్యం చేసుకొనే హక్కు ఎవరికీ లేదని లేదన్నారు. ఆ నిర్ణయం పూర్తిగా ఆయన చేతుల్లోనో లేదా ఆ సంస్థ పరిధిలోనో ఉందన్నారు. దీనిపై తాజాగా చైనా విదేశాంగ శాఖ స్పందిస్తూ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడానికి టిబెట్ అంశాన్ని వాడుకోవడం భారత్ ఆపివేయాలని ఆశిస్తున్నామని పేర్కొంది. దలైలామా వారసుడిని ఆమోదించే హక్కు తమకు వారసత్వంగా కొనసాగుతోందని తెలిపింది. మరోవైపు తన వారసత్వంపై లామా టెంజిన్ గ్యాట్సో (14వ దలైలామా) ఇటీవల స్పందిస్తూ తన మరణాంతరం ఇది కొనసాగుతుందని ప్రకటించారు. భవిష్యత్తు గురువును (పునర్జన్మ పొందిన బాలుడిని) గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు మాత్రమే గుర్తిస్తుందని, మరెవరికీ ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం లేదని పరోక్షంగా చైనాకు తేల్చి చెప్పారు. అయినా చైనా మాత్రం తన మొండి వాదనను కొనసాగిస్తూనే ఉంది.

# దేవభూమిలో ప్రకృతి విలయం
## 69 మంది మృతి, రూ.400 కోట్ల నష్టం



**సిమ్లా, జూలై 4:** దేవభూమిగా పేరొందిన హిమాచల్‌ప్రదేశ్‌ను భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు అతలాకుతలం చేస్తున్నాయి గత రెండు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలకు రాష్ట్రం చిగురుటాకులా వణికిపోతోంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా జూన్ 20 నుంచి జూలై 3 మధ్యకాలంలో సుమారు 69 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 400 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. వరదల తీవ్రతకు మండీ జిల్లా అత్యధికంగా ప్రభావితమైంది. ఇక్కడ ఆకస్మిక వరదలకు అనేక ఇళ్లు పేకమేడల్లా కూలిపోగా, వందలాది వాహనాలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. "క్లౌడ్ బరస్ట్ (కుండపోత) తర్వాత సర్వం కోల్పోయామని ఓ స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆర్మీ, స్థానిక పోలీసులు, విపత్తు ప్రతిస్పందన దళాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ అథారిటీ ప్రత్యేక కార్యదర్శి డీసీ రాణా మాట్లాడుతూ, "ప్రస్తుతం మా ప్రధాన దృష్టి సహాయక చర్యలు, పునరుద్ధరణ పనులపైనే ఉంది. నష్టం అంచనాకు మరింత సమయం పడుతుందని తెలిపారు. మండీ జిల్లాలో కూలిపోయిన మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు సీనియర్ ఇంజనీర్లు, అధికారులను పంపినట్లు ఆయన వివరించారు. ఈ విపత్తుల వెనుక వాతావరణ మార్పుల ప్రభావం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పుల పర్యవసానమే ఈ ఘటనలు. దీని ప్రభావం హిమాచల్‌పైనా పడిందని రాణా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్టు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ ప్రాథమికంగా అంచనా వేసింది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తునాగ్ సబ్‌డివిజన్‌లో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు పూర్తిగా నిలిచిపో యాయి. విద్యుత్, తాగునీటి సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఒక్క మండి జిల్లాలోనే సుమారు 40 మంది గల్లంతైనట్లు సమాచారం. అక్కడి ఒక గ్రామం పూర్తిగా నాశనమైందని అధికారులు తెలిపారు. బాధితుల కోసం సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి, భారత వైమానిక దళం హెలికాప్టర్ల ద్వారా ఆహార ప్యాకెట్లను జారవిడుస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 250కి పైగా రోడ్లు మూసుకుపోగా, 500కు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సుమారు 700 తాగునీటి పథకాలు దెబ్బతిన్నాయి. మరోవైపు, సిమ్లాలోనూ వర్షాల కారణంగా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భారీగా వర్షం కురుస్తోంది. మా తరగతి గదుల్లోకి నీళ్లు వస్తున్నాయి. బట్టలు, పుస్తకాలు తడిసిపోతున్నాయి. ఇళ్ల దగ్గరే ఉండమని మా టీచర్లు చెబుతున్నారు. పాఠశాల చుట్టూ ఉన్న చెట్లు ఎప్పుడు కూలిపోతాయోనని భయంగా ఉందని సిమ్లాకు చెందిన తనుజా ఠాకూర్ అనే విద్యార్థిని తన ఆవేదనను వ్యక్తం చేసింది. రాష్ట్ర, కేంద్ర బలగాలు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, పోలీసులు, హోంగార్డులు సమన్వయంతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. 7వ తేదీ వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించడంతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.

## సరిహద్దుల్లో ఒక్కరుకాదు ముగ్గురు శత్రువులు
### డిప్యూటీ ఆర్మీ చీఫ్ రాహుల్ ఆర్.సింగ్



**న్యూఢిల్లీ, జూలై 4:** భారత్‌కు ఒక సరిహద్దులో ఏకంగా ముగ్గురు విరోధులు ఉన్నారని డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీస్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్.సింగ్ అన్నారు. బోర్డర్‌లో ఎదురుగా పాకిస్థాన్ కనిపిస్తున్నప్పటికీ, దాని వెనుక చైనా ఉందన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ ) ఆధ్వర్యంలో న్యూ ఏజ్ మిలిటరీ టెక్నాలజీస్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో రాహుల్ ఆర్.సింగ్ ప్రసంగించారు. పాక్ వినియోగిస్తున్న సైనిక ఉత్పత్తుల్లో 81 శాతం చైనావే అని రాహుల్ ఆర్.సింగ్ అన్నారు. భారత్‌తో సైనిక ఘర్షణ జరిగినప్పుడల్లా పాక్‌కు చైనా నుంచి అన్ని రకాల సాయం, సైనిక టెక్నాలజీ అందుతోందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ అలాగే జరిగిందని ఆయన గుర్తుచేశారు. ఓ వైపు భారత్, పాక్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ)లు చర్చలు జరుపుతుంటే, మరోవైపు భారత్ క్షిపణులు ప్రయోగిస్తున్న లొకేషన్ల సమాచారం చైనా నుంచి పాక్‌కు చేరిందన్నారు. చైనాకు లైవ్ ల్యాబ్‌లా మారిన పాక్ చైనా తయారు చేస్తున్న కొత్తకొత్త ఆయుధాలు, నిఘా వ్యవస్థలకు లైవ్ ల్యాబ్‌లాగా పాక్ మారిందని రాహుల్ ఆర్.సింగ్ చెప్పారు. తమ ఆయుధాలను పాక్ గడ్డపై చైనా టెస్ట్ చేయిస్తోందని, ఇతర దేశాల ఆయుధాలతో పోల్చి చూసుకుంటోందని తెలిపారు. ఇటీవలే భారత్‌తో సైనిక ఘర్షణ వేళ తుర్కియే నుంచి కూడా పాక్‌కు కీలకమైన సైనిక సహాయం లభించిందని ఆయన పేర్కొన్నారు. యుద్ధాన్ని మొదలుపెట్టడం సులభమేనని, కానీ దాన్ని కంట్రోల్ చేయడం మాత్రం కష్టతరమైన అంశమని రాహుల్ ఆర్.సింగ్ వ్యాఖ్యానించారు. భారత్ పాక్ యుద్ధాన్ని ఆపేందుకు చాలాపెద్ద మాస్టర్ స్ట్రోక్‌లా డీజీఎంఓల స్థాయి చర్చలు పనిచేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ నుంచి కొన్ని పాఠాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందని డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ రాహుల్ ఆర్.సింగ్ అన్నారు. ఆపరేషన్ వేళ దేశ అత్యున్నత నాయకత్వం నుంచి స్పష్టమైన, వ్యూహాత్మక సందేశం అందరికీ అందిందని ఆయన చెప్పారు. కొన్నేళ్ల క్రితం వరకు ఉగ్రదాడులు జరిగితే భారత్ ఓర్చుకునేదని, ఇప్పుడు ఎప్పటికప్పుడు బలమైన సమాధానాన్ని ఇస్తోందన్నారు. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్ పీవోకేలలోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ అత్యంత కచ్చితత్వంతో దాడి చేసిందని తెలిపారు. ఈ ఆపరేషన్ కోసం మొత్తం 21 శత్రు టార్గెట్లను ఎంపిక చేయగా, వాటిలో 9 టార్గెట్లను అప్పటికప్పుడు ఫైనలైజ్ చేసి దాడులు మొదలుపెట్టామన్నారు. శత్రు టార్గెట్ల ఎంపిక, దాడి ఒకేరోజు జరిగాయని రాహుల్ ఆర్.సింగ్ చెప్పారు. భారత్‌లో మరింత విస్తారంగా గగనతల రక్షణ వ్యవస్థలను మోహరించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. ఈసారి ఆపరేషన్ సిందూర్ వేళ భారీ జనాభా ఉండే ప్రాంతాల్లో గగనతల రక్షణ వ్యవస్థలను అంతగా మోహరించలేకపోయామని, మరోసారి ఇలాంటి అంశంలో మనం సన్నద్ధంగా ఉండాలన్నారు.

## ముస్లింలను ఓటు బ్యాంకుగా చూస్తోన్న కాంగ్రెస్: కేంద్ర మంత్రి కిరణ్‌రిజిజు



**న్యూఢిల్లీ, జులై 4:** భారత్‌లో మైనారిటీలు అనుభవిస్తున్న వసతులు ప్రపంచంలో ఏ దేశ ప్రజలూ అనుభవించడం లేదని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. గత 75 ఏళ్లుగా ముస్లిం సామాజిక వర్గానికి చెందిన ప్రజలను కాంగ్రెస్ పార్టీ ఓ ఓటు బ్యాంకుగా చూస్తోందని విమర్శించారు. దీనివల్ల వారికి నష్టం చేకూరుతోందని కాంగ్రెస్ మాత్రం లబ్ధి కలుగుతోందని అన్నారు. శుక్రవారం ఆయన హజ్ యాత్రపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మైనారిటీల్లో చాలా మంది ఇప్పటికీ పేదవారిగానే ఉండిపోవడానికి కాంగ్రెస్ కారణమన్నారు. ఇందుకు స్వస్తి పలకాల్సిన అవసరముందని, ఇప్పటికైనా కాంగ్రెస్ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. మరోవైపు బీహార్ ఎన్నికలపైనా రిజిజు స్పందించారు. ఎఐఎంఐఎం రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ ఇటీవల ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు లేఖ రాసిన సంగతి తెలిసిందే. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎఐఎంఐఎంను మహాఘట్‌బంధన్‌లో చేర్చుకోవాలని ఆ లేఖ సారాంశం. దీనిపై రిజిజు మాట్లాడుతూ మేం లౌకికవాదులం. కులం, మతం ఆధారంగా రాజకీయాలు చేయం. అలాంటి పార్టీలు మతపరమైనవి. భారత్‌లో అన్ని మతాల ప్రజలు సురక్షితంగా, సమాన హక్కులతో జీవిస్తున్నారు. ఆ కూటమిలో ఎఐఎంఐఎం చేరినా పెద్ద ప్రభావం ఉండబోదు. కానీ మతాల ఆధారంగా రాజకీయాలు చేయడం సరికాదు అని అన్నారు.



## సిఎం కావాలన్న కోరిక అలాగే ఉంది
### కర్ణాటక ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్!


**బెంగళూరు, జులై 4:** కర్ణాటక రాజకీయాల్లో సిఎం మార్పుపై ఇటీవల తీవ్ర చర్చ జరిగింది. కాంగ్రెస్ అధిష్టానం బుజ్జగింపులతో డిప్యూటీ సిఎంగా ఉన్న డికె శివకుమార్ సర్దుకుపోవడంతో ప్రస్తుతానికి సమస్య తీరిపోయింది. అయితే సిఎం కావాలన్న తన కోరిక అలాగే ఉందనే అర్థంలో డికె తాజాగా వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ ఆకాంక్షలపై మీడియా అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. ప్రయత్నాలు ఫలించకపోయినా , నేను బలంగా కోరుకున్న దాని కోసం చేసిన ప్రార్థనలకు సమాధానం దొరక్కుండాపోదు. అయితే రాజకీయాల గురించి చర్చించే సందర్భం ఇది కాదు. రాష్ట్రానికి మంచి జరగాలి అంటూ తన ఆకాంక్షలను నేరుగా బయటపెట్టకుండా సమాధానం చెప్పారు. డికె. మల్లిఖార్జున ఖర్గే తమకు జాతీయ అధ్యక్షుడని, ఆయన సూచనల ప్రకారం పార్టీ కోసం పనిచేస్తామన్నారు. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుసేన్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ మరో రెండు, మూడు నెలల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందన్నారు. ఆ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అయితే అయిదేళ్లు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టం చేయడంతో ఆ ఊహాగానాలకు చెక్ పడింది. ఆ సమయంలో డికె ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆయనకు అండగా ఉండటం తప్ప నాకు ఇంకో ఆప్షన్ లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. అధిష్టానం ఏది చెబితే అది చేయాలి అని మీడియాతో మాట్లాడిన సంగతి తెలిసిందే. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది.

## తమిళనాడు సిఎం అభ్యర్థిగా టివికె విజయ్!



**చెన్నై,జూలై 4:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ ఇప్పటి నుంచే సమాయత్తం అవుతోంది. ఇందులో భాగంగా ఆ పార్టీ శుక్రవారం అధికారికంగా నటుడు, తమ పార్టీ వ్యవస్థాపకుడైన విజయ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ తమ పార్టీ ఎప్పుడూ బీజేపీతో పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. బహిరంగంగానే కాదు, లోపాయికరంగా కూడా కాషాయ పార్టీతో పొత్తు పెటుకోమని ఆయన తేల్చిచెప్పారు. బీజేపీని సైద్ధాంతిక శత్రువుగా అభివర్ణించిన విజయ్, వారితో ఎప్పటికీ చేతులు కలపనని పేర్కొన్నారు. బీజేపీ మరెక్కడైనా విష బీజాలు నాటవచ్చు. కానీ తమిళనాడులో కాదు. మీరు తమిళనాడులో అన్నాదురై, పెరియార్‌లను వ్యతిరేకించలేరు, అవమానించలేరు. అసలు మీరు తమిళనాడులో గెలవలేరు. బీజేపీతో కలవడానికి టీవీకే పార్టీ డీఎంకే, ఏఐఏడీఎంకే కాదని విజయ్ అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు పొత్తులపై నిర్ణయం తీసుకునే పూర్తి అధికారం విజయ్‌కు అప్పగిస్తూ టీవీకే పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. అంతేకాదు టీవీకే పార్టీ సభ్యులను, సభ్యత్వాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఏకంగా 2 కోట్ల మందిని తమ పార్టీలో చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## ట్రంప్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లుకు ప్రతినిధుల సభ ఆమోదం




**వాషింగ్టన్,జూలై 4:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రెండోసారి పదవీకాలంలో అత్యంత ప్రధాన రాజకీయ విజయాన్ని అందుకున్నారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవానికి ఒక రోజు ముందు, ఆయన ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పన్నులు, వ్యయాల బిల్లుకు కాంగ్రెస్‌లో స్వల్ప మెజారిటీతో ఆమోదం లభించింది. ప్రతినిధుల సభలో ఉత్కంఠభరిత ఓటింగ్‌లో ఈ బిగ్ బిల్లుకు అనుకూలంగా 218 ఓట్లు, వ్యతిరేకంగా 214 ఓట్లు పడ్డాయి. దీంతో ట్రంప్ తన అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు మార్గం సుగమమైంది. ఈ విజయంపై ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ లో స్పందిస్తూ, ఇది అత్యంత ప్రభావవంతమైన బిల్లుల్లో ఒకటి. ప్రపంచంలోనే అమెరికా ఇప్పుడు హాటెస్ట్ దేశం అని వ్యాఖ్యానించారు. ఈ బిల్లుపై శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అధ్యక్షుడు సంతకం చేస్తారని ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ తెలిపారు. బిల్లులోని ప్రధానాంశాల పరంగాచూస్తే ఈ బిల్లు ద్వారా ట్రంప్ తన ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చుకోనున్నారు.

సైనిక వ్యయాన్ని పెంచడం, వలసదారులను వెనక్కి పంపే కార్యక్రమానికి నిధులు సమకూర్చడం, పన్నుల ఉపశమనాన్ని పొడిగించేందుకు 4.5 ట్రిలియన్ డాలర్లు కేటాయించడం వంటివి ఇందులో ప్రధానాంశాలు. అయితే, ఈ బిల్లు వల్ల దేశ జాతీయ అప్పు మరో 3.4 ట్రిలియన్ డాలర్లు పెరుగుతుందని అంచనా. అదే సమయంలో పేదల కోసం ఉద్దేశించిన ఫుడ్ అసిస్టెన్స్ కార్యక్రమం, మెడికేర్‌ఆరోగ్య బీమా పథకాలకు భారీగా కోతలు విధించనున్నారు. దీనివల్ల సుమారు 17 మిలియన్ల మంది బీమా కవరేజీనికోల్పోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకునేందుకు డెమొక్రాటిక్ పార్టీ నేత హకీమ్ జెఫ్రీస్ దాదాపు తొమ్మిది గంటలపాటు ప్రసంగించి సభా కార్యక్రమాలను ఆలస్యం చేసే ప్రయత్నం చేశారు.

ఈ బిల్లు అమెరికా ప్రజల జీవితాలను నాశనం చేస్తుంది. ఇది ఒక అసహ్యకరమైన, ప్రమాదకరమైన బిల్లు అని ఆయన తీవ్రంగా విమర్శించారు. రిపబ్లికన్ పార్టీలోనూ కొంత వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ, స్పీకర్ మైక్ జాన్సన్ చివరి నిమిషంలో అసమ్మతి నేతలను ఒప్పించి బిల్లు నెగ్గేలా చేయడంలో సఫలమయ్యారు.

# టెహ్రాన్‌లో దిగిన తొలి విదేశీ విమానం



**టెహ్రాన్, జూలై 4:** ఇరాన్, ఇజ్రాయెల్ పరస్పర దాడుల నేపథ్యంలో రణరంగంలా మారిన పశ్చిమాసియాలో పరిస్థితులు క్రమంగా సద్దుమణుగుతున్నాయి. టెలిఅవీవ్ దాడుల నేపథ్యంలో అంతర్జాతీయ వైమానిక సేవలను నిలిపివేసిన ఇరాన్ తాజాగా వాటిని పునరుద్ధరించింది. 20 రోజుల నిషేధం తర్వాత టెహ్రాన్‌లోని ఇమామ్ ఖొమేని అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలిసారిగా విదేశీ విమానం ల్యాండ్ అయ్యింది. ఈ మేరకు స్థానిక మీడియా వెల్లడించింది. అంతకుముందు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) నుంచి ఫ్లయింగ్ దుబాయ్ సంస్థకు చెందిన విమానం భారీ భద్రత నడుమ ల్యాండ్ అయినట్లు ఇరాన్ పౌర విమానయాన శాఖ వెల్లడించింది. ఇరాన్ వైమానిక రంగం స్థిరత్వం సాధించే దిశగా అడుగులు వేసేందుకు దోహదపడుతుందని పౌర విమానయాన శాఖ అధికార ప్రతినిధి మెహ్‌దీ రమేజానీ మీడియాకు వెల్లడించారు. అంతర్జాతీయ విమానాలు ఇరాన్‌లో సురక్షితంగా ల్యాండ్ అయ్యేలా అవసరమైన చర్యలు చేపడతామని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని క్రమంగా సర్వీసుల సంఖ్యను పెంచుతామని ఆయన తెలిపారు.

## విందు వినోదాల్లో మునిగిన మాల్యా, లలిత్‌మోడీ




**లండన్,జూలై 4:** భారత చట్టాల నుంచి తప్పించుకుని లండన్‌లో తలదాచుకుంటున్న వివాదాస్పద వ్యాపారవేత్తలు లలిత్ మోదీ, విజయ్ మాల్యా విందువినోదాలతో ఎంజాయ్ చేస్తున్నారు. తాజాగా లండన్‌లో జరిగిన ఓ విలాసవంతమైన పార్టీలో వీరంతా కలిసి పాటలు పాడుతూ ఎంజాయ్ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. భారత్‌లో తీవ్రమైన ఆర్థిక నేరారోపణలు ఎదుర్కొంటున్న ఈ ఇద్దరూ ఇలా బహిరంగంగా సంబరాలు చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐపీఎల్ మాజీ కమిషనర్ లలిత్ మోదీ స్వయంగా ఏర్పాటు చేసిన ఈ పార్టీకి సుమారు 310 మందికి పైగా అతిథులు హాజరయ్యారు. ఈ వేడుకలో విజయ్ మాల్యాతో కలిసి లలిత్ మోదీ, ఫ్రాంక్ సినాత్రా పాడిన ప్రఖ్యాత ఖిఐ డిడ్ ఇట్ మై వేఖి (నేను నా పద్ధతిలోనే చేశాను) అనే పాటను ఆలపించారు. వెస్టిండీస్ మాజీ క్రికెటర్ క్రిస్ గేల్ కూడా ఈ పార్టీలో పాల్గొని లలిత్ మోదీ, మాల్యాతో దిగిన ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నాడు. ఈ వీడియోను స్వయంగా లలిత్ మోదీనే తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం గమనార్హం. ఈ వీడియో ఇంటర్నెట్‌ను బ్రేక్ చేయదని ఆశిస్తున్నా. కచ్చితంగా ఇది వివాదాస్పదమే. కానీ నేను చేసేది అదే" అంటూ ఆయన పెట్టిన క్యాప్షన్ వారి ధిక్కార వైఖరిని స్పష్టం చేస్తోంది. లలిత్ మోదీ మనీలాండరింగ్ సహా పలు ఆర్థిక అవకతవకల ఆరోపణలతో 2010 నుంచి లండన్‌లోనే ఉంటున్నారు. మరోవైపు, కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ అధినేత విజయ్ మాల్యా భారత బ్యాంకులకు సుమారు 9,000 కోట్ల రూపాయల రుణాలు ఎగ్గొట్టి లండన్‌కు పారిపోయారు. ఆయనపై కూడా మోసం, మనీలాండరింగ్ కేసులు ఉన్నాయి. వీరిని భారత్‌కు రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా, వారు మాత్రం ఇలా విలాసవంతమైన జీవితం గడుపుతూ కనిపించడం చర్చనీయాంశంగా మారింది.



# అర్హులందరికీ సూపర్ సిక్స్ పథకాలు అమలు

## పేదరిక నిర్మూలన లక్ష్యమే పి ఫోర్ - రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...





**ఏలూరు/ముసునూరు, ప్రభాతవార్త** : తొలి అడుగు – ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ముసునూరు మండలం వేల్పుచర్ల,బలివే గ్రామాల్లో వివిధ శాఖల అధికారులు,కూటమి నాయకులతో కలిసి రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రజలకు అందుకున్న పథకాలు అమలు, సమస్యలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు.గ్రామాల్లో డాక్టరు బి.ఆర్.అంబేద్కర్, యన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి, మంత్రి అంజలి ఘటించారు. అడుగడుగునా మంత్రికి గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులను ఇచ్చి మంత్రి నుదుటన కుంకుమ తిలకం దిద్దారు.గొర్రెకాపరులు గొర్రెపిల్లను బహుమతిగా ఇవ్వగా గొర్రెపిల్లను ముద్దాడి భుజాలు మీద పెట్టుకుని మంత్రి కొలుసు పార్థసారథి అందరిని ఆశ్చర్యపరిచారు.రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కరపత్రాలను ప్రజలకు అందజేసి,గోడ పత్రికలను గోడలకు మంత్రి స్వయంగా అతికించారు.ప్రభుత్వ పథకాలు అమలు తీరుపట్ల ప్రజలను అడిగి తెలుసుకోగా ప్రతి ఒక్కరూ తమకు పథకాలు ద్వారా లబ్ధి చేకూరిందని, కూటమి పాలనతో మా బ్రతుకులు మారాయని చెప్పడంతో మంత్రి సంతృప్తిని వ్యక్తం చేశారు.ప్రజలు కొన్ని సమస్యలను తెలియజేయగా ఆరు రహదారులను మంత్రి మంజూరు చేశారు.ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని, విజయాలను, సూపర్ సిక్స్ పథకాలు అమలును గడపగడపకు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని స్వపరిపాలన తొలి అడుగు – ఇంటింటికి టిడిపి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం చేస్తే నేడు పరిపాలన దక్షత గల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక వ్యవస్థను చక్కబెడుతూ సుపరిపాలన అందిస్తున్నారన్నారు.గత ప్రభుత్వం రూ 10 లక్షలు కోట్లు అప్పుచేసి,ప్రతి వాడి నెత్తిన రూ 2.50 లక్షలు అప్పులు పెట్టి వెళ్ళారని అన్నారు. కుటుంబ పెద్దగా కుటుంబాన్ని ముందుకు తీసుకువెళ్ళడానికి ఎన్ని ఇబ్బందులు పడతామే,రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళ్ళటానికి అన్నే ఇబ్బందులు ఉంటాయని అన్నారు.గత ప్రభుత్వం బటన్ నొక్కడం పైనే దృష్టి పెట్టిందని, రాష్ట్రానికి ఆదాయాన్ని పెంచే ఆలోచన చేయలేదన్నారు.గత ప్రభుత్వంలో పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లిపోయారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు మన రాష్ట్రానికి తరలి వస్తున్నారని, రూ 6 లక్షలు 50 వేలు కోట్లు పెట్టుబడులు వచ్చాయని అన్నారు.రానున్న నాలుగు ఏళ్ల కాలంలో 20 లక్షలు ఉద్యోగాలు యువతీ, యువకులు అందజేయాలని లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి ప్రగతిని,సంక్షేమాన్ని అందించాలనే లక్ష్యంతోనే సమర్థవంతంగా పనిచేస్తుందని అన్నారు.గత వైసిపి ఐదేళ్ల విధ్వంస పాలన నుంచి ప్రజా తిరుగుబాటుతో ప్రజా కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిందని, రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని అన్నారు.దేశంలో మరే రాష్ట్రం కూడా ఇవ్వనంత మొత్తాన్ని పెన్షన్ గా కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు.తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నను రూ 15 వేలు అందజేస్తూ తల్లిదండ్రులపై భారం తగ్గిస్తున్నామని అన్నారు.కట్టెల పొయ్యిల కష్టాల నుండి ఆడపడుచులకు ఆదుకోవాలనే సదుద్దేశ్యంతో దీపం పథకం – 2 ద్వారా ప్రతిఏటా మూడు ఉచిత గ్యాసు సిలిండర్లు ఇస్తున్నామని తెలిపారు.మహిళలకు వచ్చే ఆగష్టు15 తేదీ నుండి ఉచిత ఆర్టీసి బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేస్తున్నామని,మహిళలు ప్రయాణాలు చేయుటకు సిద్ధంగా ఉండాలని అన్నారు. రైతులకు అండగా ఉండేందుకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కేంద్రం ఇచ్చే రూ 6 వేలకు అదనంగా రూ 14 వేలు కలిపి మొత్తం రూ 20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు.ఇంట్లో మంచాన పడ్డ పేషెంటు ఎప్పుడు పోతాడో అని కుటుంబ సభ్యులు ఎదురు చూసేవారని అన్నారు. ఇప్పుడు ప్రతీ నెల 1 వ తేదీ ఉదయం రూ 15 వేలు పింఛను అందజేయటం వలన వైద్య ఖర్చులకు రూ 10 వేలు ఖర్చు అయినా కుటుంబ అవసరాలకు రూ 5 వేలు మిగులుతున్నాయని మంచానపడ్డ మనిషిని పది కాలాల పాటు బతకాలని కుటుంబ సభ్యులు కోరుకుంటున్నారని ఇదే ముఖ్యమంత్రి చంద్రబాబు సుపరిపాలనకు ఒక ఉదాహరణ అని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కె.వెంకటరమణ,యంపిడివో బి.ఏ.సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శప్రాయం

## పాస్ట్ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ



**ఉండి, జూలై 4, ప్రభాతవార్త** :సమాజంలో పేద ప్రజల పట్ల అంకితభావంతో లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు ఆధర్శప్రాయమని పాస్ట్ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ అన్నారు. ఉండిలో శ్రీకూనపరాజు అప్పలరాజు సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో శుక్రవారం ఉండి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు క్లబ్ మాజీ అధ్యక్షులు సత్తి బ్రహ్మారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో 210 దేశాలాల్లో 14 లక్షల సభ్యులుతో లయన్స్ క్లబ్లు పనిచేస్తున్నాయి అన్నారు. సెకండ్ వైస్ గవర్నర్ ఆర్ వి ఎస్ రాజు కొత్త సభ్యులుతో ప్రమాణ స్వీకారం చేయంచారు. పాస్ట్ గవర్నర్ డా.ఎం వి సూర్యనారాయణరాజు నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రీజియన్ ఛైర్మెన్ ఎస్ శ్రీనివాస్, జోన్ ఛైర్మెన్ ఆర్ నాగరాజు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరినారాయణరాజు,క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు, నరసరాజు, ఆచారి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో రంగప్రసాదరాజు, జగన్నాదరాజు, హరనాధ్ రాజు, మహంకాళి, కేశవ, కాశీ, నరసింగరావు, రూత్ కళ అనంతలక్ష్మీ, విజయ, నారాయణ రెడ్డి, సుబ్బరాజు, వెంకటేశ్వరరాజు, సీతారామరాజు,పెద అప్పలరాజు, యువరాజు, ఆంజనేయరాజు,కృష్ణంరాజు, హరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి - సిఐటియు ర్యాలీ

**నరసాపురం, జులై 4:- ప్రభాతవార్త** :ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు సూరినిడి వెంకటేశ్వరరావు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు, స్థానిక అంబేద్కర్ సెంటర్లో ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా కార్మిక వర్గం చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేస్తూ జాత నర్సాపురం చేరుకున్నది, ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో సభ జరిగినది ఈ సభను ఉద్దేశిస్తూ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు సూరినిడి వెంకటేశ్వరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ఉద్యోగ వర్గానికి తీవ్రమైన అన్యాయం చేస్తూ 10 గంటల పని విధానాన్ని అమలు చేస్తుందన్నారు, ఉద్యోగ భద్రత కనీస వేతనం వంటి కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక వర్గాని మోసం చేస్తున్నాయన్నారు ,ఈనెల తొమ్మిదో తారీఖున కార్మిక సంఘాల చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ ఈ దేశం కార్మిక వర్గం బ్రిటిష్ ఇండియా హయాంలో పోరాటం చేసి పని గంటల విధానం పనికితగా వేతనం సంఘం పెట్టుకునే ,సమ్మె చేసుకునే హక్కు వంటి కార్మిక రక్షణ కోసం అనేక హక్కులను చట్టాలను సాధించుకున్నాయన్నారు, కార్మికులు పోరాడి సాధించుకున్నారు 40 రకాల చట్టాలను నాలుగు కోడ్స్ తీసుకువచ్చి, ఉన్న చట్టాలను బలహీన బలిసి ఈ దేశ కార్మిక వర్గానికి నష్టం చేస్తూ నీ దేశం లో ఉన్న కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు, కార్మికులకు నష్టం చేకూర్చే నూతన లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని జరుగుతున్న దేశ సమ్మెను కార్మిక ఉద్యోగ వర్గాలు ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, అనంతరం అంబేద్కర్ సెంటర్ నుండి గాంధీ బొమ్మ సెంటర్ పంజా సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు ,ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జవాది శ్రీనివాస్ తెలగంశెటి సత్యనారాయణ ఆంజనేయులు రాణి గణేష్ పొన్నాడ మల్లేష్ పులపర్తిసత్యనారాయణ పీ సత్తిబాబు



# ఎన్డీఏ కూటమి పాలన అద్భుతమని ప్రజలు కితాబిస్తున్నారు,

## పితాని తనయుడు వెంకటేశ్ సురేష్

**పెనుమంట్ర-ప్రభాతవార్త** : విధ్వంస పాలన నుండి వికాసం వైపు అడుగులు వేస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అద్భుతంగా ఉన్నట్టు ప్రజలు కితాభిస్తున్నారని మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆలమూరు గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పనితీరును అడిగి తెలుసుకున్నారు. గతంలో పింఛన్లు పెంపు నాలుగు సంవత్సరాలు పట్టిందని చంద్రబాబు వచ్చిన వెంటనే తొలి సంతకంతో పెంపు చేశారని వృద్దులు దివ్యాంగులు చెప్పారు. త్వరలోనే రైతులకు అన్నదాత సుఖీభవ లబ్ధి బ్యాంకు ఖాతాలో జమవుతుందని అన్నారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపిస్తున్నారని చెప్పారు. ఆగస్టు 15వ తేదీ నుండి ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్ సర్వీసులను నడుపుతున్నట్లు తెలిపారు. ఆలమూరు గ్రామంలో సుమారు రూ.10.00 లక్షల వ్యయంతో నిర్మించేజిఎస్ వెంకయ్య గారి వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే తనయుడు పితాని వెంకట సురేష్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, కడలి ఏడుకొండలు, నీటి సంఘం ఉపాధ్యక్షులు తేతలి వెంకటరామారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు అయ్యప్ప రెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలుజి వెంకటలక్ష్మి, జి.పరమేశ్వరరావు ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పొలమూరి రాజేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# పశ్చిమగోదావరి,ఏలూరు వార్త


## వార్త, ప్రచురించిన వార్తకు స్పందన

**కొయ్యలగూడెం ప్రభాత వార్త జులై 5.** :4 తారీకున ప్రచురించిన, పల్లెల్లో కానరాణి స్వచ్ఛత. అనే వార్త శుక్రవారం ప్రచురిచితమైన విషయం పాఠకులకు విధేయతమే. ఈ వార్తకు స్పందించిన అధికారులు చెత్త వేసిన ప్రదేశాన్ని సందర్శించి, రహదారిపై ఉన్న చెత్తను పంచాయితీ అధికారులు తొలగించడంతో హర్ష వ్యక్తం చేస్తున్న ప్రజలు ఈ సందర్భంగా వార్త ప్రచురణకు కృతజ్ఞతలు తెలియజేసిన ప్రజలు.



# స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి

**భీమవరం జూలై 4 ప్రభాతవార్త** : చట్టపరిధిలో నియమ నిబంధనలను పాటించని స్కానింగ్ సెంటర్ లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి హెచ్చరించారు. శుక్రవారం భీమవరం పట్టణంలోని మెడ్ క్వెస్ట్ స్కానింగ్ సెంటర్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జి గీతాబాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ స్కాన్ సెంటర్లో పి.సి. పి.ఎన్.డి.టి చట్టం పరిధిలో నిర్వహించవలసిన నియమ నిబంధనలను పరిశీలించడం జరిగినది. దీనిలో భాగంగా స్కానింగ్ మిషను మరియు రిజిస్ట్రేషన్ కాల పరిమితి, అదేవిధంగా ఫారం-ఎఫ్ నిర్వహణ, ఐ.ఇ.సి గోడ పత్రికల ప్రదర్శన తదితర అంశాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టపరిధిలో నియమ నిబంధనలను పాటించని స్కానింగ్



సెంటర్ లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి లబ్ధి.....

**పాలకొల్లు జూలై 4 ప్రభాతవార్త** : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రతి ఇంటిలోనూ లబ్ధి చేకూరిందని ప్రజలే చెబుతున్నారని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న కూటమి మంచి ప్రభుత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఏడాదిలో గత వైసిపి ప్రభుత్వ విధ్వంస పాలన,నేటి కూటమి ప్రభుత్వాం లో అభివృద్ధి సంక్షేమ పాలనను బేరీజు వేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపట్ల ఇంటింటికి, గడపగడపకు ప్రజలు ఆనందంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాలకొల్లు పట్టణ 20 వార్డు లో ఆయన పార్టీ శ్రేణులతో



కలిసి ఇంటింటికి వెళ్లారు. ప్రభుత్వం ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు.

# కాళీపట్నంలో రంగా విగ్రహావిష్కరణ

## ముఖ్య అతిథిగా పాల్గొన్న రాధా




**ప్రభాతవార్త మొగల్తూరు** : స్వర్గీయ వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని మొగల్తూరు మండలం కాళీ పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ వంగవీటి రాధా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగా సమాజ సేవ నాయకర్ గుర్తు చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దేశం జనసేన నాయకులు కొత్తపల్లి సుబ్బారాయుడు బండారు మాధవ నాయుడు చాగంటి చిన్న నరసాపురం మొగల్తూరు ప్రాంతం నాయకులు పాల్గొన్నారు. సందర్భంగా రంగాకు ఘన నివాళులర్పించారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఏం సతీష్ జనసేన అధ్యక్షుడు కోటిపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# మహెూన్నతమైన వ్యక్తి మాజీ సీఎం రోసయ్య

## జయంతి కార్యక్రమంలో మాల్యాద్రి

**కైకలూరు జులై 4 (ప్రభాతవార్త)** :ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య మహెూన్నతమైన వ్యక్తి అని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పైడిమర్రి జయ శ్యామల మాల్యాద్రి కొనియాడారు.శుక్రవారం సాయంత్రం కైకలూరు పట్టణంలోని మాల్యాద్రి కార్యాలయం నందు మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ముందుగా రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కైకలూరు మండల పార్టీ అధ్యక్షులు పెనుమత్స త్రినాధ రాజు, మహమ్మద్ జానీ లు మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో పాటు ఆయన చేపట్టిన ప్రతి పదవికి కూడా ఎంతో వన్నె తెచ్చారని, ఆర్థిక మంత్రిగా 16 సార్లు శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఆయనకి దక్కుతుందన్నారు. ఆరు దశాబ్దాలు ప్రజాసేవ అందించారని, మంచి వ్యక్తిత్వం గల మహెూన్నతమైన వ్యక్తి



అని ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పైడిమర్రి రాధాకృష్ణ, కైకలూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సనిశెట్టి కొండలు,శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు చొప్పర్ల మురళి, పొన్నూరు వీరయ్య, కైకలూరు పట్టణ టిడిపి అధ్యక్షులు పడమట వాసు, లక్కిం శెట్టి మోహన్,భాషిద్, అదేపల్లి బ్రహ్మాజీ, కొనిజేటి విష్ణు మోహన్ రావు, గ్రంధి శ్రీనివాస్ రావు, ఆచంట వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# విజయ దుర్గ అమ్మవారి ఆలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహణ

**మొగల్తూరు జూలై 4 (ప్రభాతవార్త):** ముత్యాలపల్లి గ్రామపంచాయతీ శివారు వారతిప్ప వంతెన వద్ద శ్రీ విజయ దుర్గా అమ్మవారి ఆలయం నందు శుక్రవారం ఆలయ నిర్మాత నాగిడి శ్రీరాములు, లీలావతి దంపతుల ఆధ్వర్యంలో ఆషాడ మాసం పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా చుట్టు ప్రక్కన గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి కుంకుమ పూజలు అభిషేకములు, నిర్వహించారు

# హమాలీల హక్కులకు అల్లూరి కృషి ఎనలేనిది

**నరసాపురం ,జూలై 4:- ప్రభాతవార్త** :కార్మిక వర్గం నేత కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణ రాజు పదవ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక మీరా గ్రంథాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు , అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు,ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో రైస్ మిల్ అమాలి కార్మికుల హక్కుల కోసం అహర్నిశలు కృషి చేసిన కార్మిక పక్షపాతి కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణ రాజు అని కొని ఆడారు, ఉమ్మడి జిల్లాలో రైస్ మిల్ కార్మికులను ఐక్యత చేసి సంఘాల పెట్టి వారి హక్కుల కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించడంలో అల్లూరి చురు కైనా పాత్ర పోషించారు అన్నారు, వివిధ పట్టణాలలో



హమాలీ కార్మికులు కోసం పనిచేశారని గుర్తు చేశారు, ఈ కార్యక్రమంలో సిఐటియ నాయకులు జవాది శ్రీనివాస్ ఆంజనేయులు రైతు సంఘం నాయకులు ఆకుల హరే రామ్ మామిడి శెట్టి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహ ఆవిష్కరణ

**మొగల్తూరు, కాళీపట్నం (ప్రభాతవార్త)** కాళీపట్నం తూర్పు పంచాయతీ పరిధి 216 నేషనల్ హైవే ను ఆనుకుని ఉన్న రంగ బొమ్మ సెంటర్ నందు, శుక్రవారం మధ్యాహ్నం దివంగత నేత వంగవీటి మోహనరంగా 78వ జయంతి వేడుకలు పురస్కరించుకుని నూతనంగా నిర్మించిన కంస్యవిగ్రహం అదే గ్రామానికి చెందిన ఎన్నారై మేడిద అశోక్ కుమార్, రత్న శైలజ దంపతులు సహకారంతో ఏర్పాటుచేసిన కంస్య విగ్రహాన్ని, వంగవీటి మోహన రంగా కుమారుడు, విజయవాడ యంగ్ టైగర్ వంగవీటి రాధాకృష్ణ మరియు శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు, ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం రంగా చేసిన విశిష్టమైన సేవలు మరువరాదని, వంగవీటి రంగాను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలని ఆయన తెలియజేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి



సౌజన్య ప్రభాకర్ రావు, టిడిపి ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు, మాజీ శాసనసభ్యులు బందారు మాధవ నాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్న) బిజెపి కన్వీనర్ మేకల సతీష్, మేడిద మాధవ కృష్ణారావు (బాబ్జి) కూటమి నాయకులు వీర మహిళలు రంగా అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు

## కైకలూరులో ఘనంగా వంగవీటి మోహన్ రంగా జయంతి వేడుకలు

కైకలూరు, జూలై 4,(ప్రభాతవార్త) :వంగవీటి మోహన్ రంగా 78వ జయంతి సందర్భంగా కైకలూరు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో శుక్రవారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు పళ్ళు, బ్రెడ్ పంపిణీ చేసి గాంధీ బొమ్మ సెంటర్లో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విట్టల్ రావు మాట్లాడుతూ వంగవీటి రంగా బడుగు, బలహీన వర్గాల కోసం నిస్వార్థంగా పోరాడిన మహానాయకుడని, ఆయన ఆశయాలను కొనసాగించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గ జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్



(బాబీ ), కైకలూరు గ్రామ ఉపసర్పంచ్ కె వి ఎం ఎం నాయుడు, జనసేన వీర మహిళ తోట లక్ష్మీ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, తులసి పూర్ణచంద్రరావు (పూర్ణ), పెరుగు నాగరాజు మెడికల్ షాప్ కృష్ణ, కటికిన రఘు, పుప్పాల సూర్య ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# కామవరపుకోటలో ఉద్రిక్త వాతావరణం
## పోలీసు పికెటింగ్ కొనసాగింపు

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: మండల కేంద్రమైన కామవరపుకోటలో ఒక స్థల విషయంలో ఏర్పడిన వివాదం ముదరడంతో పోలీసులు రంగ ప్రవేశం చేయవలసి వచ్చింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన స్థలంలో ఒక వ్యక్తి సిమెంటు తూరలు, స్తంభాలు చేసే పరిశ్రమను ఏర్పాటు చేసుకొన్నారు. ఈ సిమెంట్ పరిశ్రమ సమీపాన గల ఇళ్ళ వారు ఆ స్థలం నుండి ఆ పరిశ్రమను తొలగించాలని ఆందోళన చేస్తున్నా , అతను తొలగించక పోవడంతో మహిళలు ఆ స్థలంపై దాడి చేయడం జరిగింది. దీంతో ఇరువర్గాల వారు భీకరంగా దాడులు చేసుకున్నారు. ఈ విషయం జంగారెడ్డిగూడెం డిఎస్పి రవిచంద్ర దృష్టికి రావడంతో, ఆయన పోలీసు బందోబస్తుతో ఆ ప్రాంతానికి వెళ్ళి, ముందుగా ఘర్షణ నివారించగలిగారు. రెవెన్యూ, పంచాయతీ, ఎండోమెంట్స్



అధికారులు ఆ స్థలాన్ని పరిశీలిస్తున్నారు. ఎండోమెంట్స్ వారి స్థలం అయితే వారికి స్వాధీనపరచడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ శాంతియుత వాతావరణం నెలకొంది. డీఎస్పీ రవిచంద్ర ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసు పికెటింగ్ కొనసాగుతుంది.

## పోలీస్ స్టేషన్ కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలి - డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: పోలీస్ స్టేషన్ కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలని జంగారెడ్డిగూడెం డిఎస్పి యు. రవిచంద్ర తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం పోలీస్ స్టేషన్ ను డిఎస్పీ రవిచంద్ర తనిఖీ చేశారు. ఆయన ముందుగా లక్కవరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రిసెప్షన్, కోర్టు డ్యూటీ ఆఫీసర్,స్టేషన్ రైటర్, ప్రాసెస్ అప్లికేషన్ల ఫైల్స్, రికార్డులను పరిశీలించారు. అనంతరం డిఎస్పి రవిచంద్ర మాట్లాడుతూ గ్రామాల్లో గస్తీ పెంచాలని,డయల్ 112 ఫిర్యాదులకు వేగంగా స్పందించాలన్నారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వి సుభాష్, ఎస్సై శశాంక్ పాల్గొన్నారు.



## హమాలీలకు పని భద్రతతో కూడిన చట్టం తేవాలి

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: హమాలీలకు పని భద్రతతో కూడిన చట్టం తేవాలని ఐ ఎఫ్ టి యు రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.వి రమణ డిమాండ్ చేశారు.జంగారెడ్డిగూడెం గవర్నమెంట్ టింబర్ డిపో హమాలీ ముఠా వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం శుక్రవారం యడ్లపల్లి బుజ్జి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఐ.ఎఫ్.టి.యు కె.వి రమణ మాట్లాడుతూ హమాలీలకు చట్టబద్ధంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమావేశంలో పింగిలి నగేష్, వై.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు కోట్లతో శివపురం గ్రామాభివృద్ధి : ఎమ్మెల్యే ఆరిమిల్లి

అత్తిలి జులై 4( ప్రభాతవార్త ): తిరుపతిపురం శివారు శివపురం గ్రామంలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కింద సుమారు నాలుగు కోట్ల రూపాయలతో వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం కింద ఇంటింటికి తిరిగి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. తల్లికి వందనం కింద రెండో విడత నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. గత టిడిపి హయాంలో నిర్మించుకున్న గృహాల వారికి నిధులు అందజేయాలని లబ్ధిదారులు కోరారు. పింఛన్లు మంజూరు చేయాలని కొందరు విన్నవించుకున్నారు. చేనేత కార్మికుడు ని ల్లా నాగరాజు గృహానికి వెళ్లి చేనేత కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. చేనేత కార్మికుల ను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. గ్రామంలో పెన్షన్ల కింద రెండు కోట్ల 89 లక్షలు, తల్లికి వందనం కింద 42 లక్షలు, వివిధ పనుల కింద 36 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు 420 మెట్రిక్ టన్నులు దాన్యం సేకరించి తొమ్మిది కోట్ల 69 లక్షలు



చెల్లించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట గ్రామ టిడిపి అధ్యక్షుడు వంవన గోపాలరావు, కార్యదర్శి గుడివెట్ల మల్లేశ్వరరావు,దేవస్థానం మాజీ చైర్మన్ బొబ్బా చంటి,మండల టిడిపి కార్యదర్శి ఆల్తి అజయ్ కుమార్ టిడిపి నాయకులు ఆనాల ఆదినారాయణ రావు, అల్తి సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు, నీటి పంపిణీ కమిటీ చైర్మన్ నల్లూరు సురేష్, పి. వి. కృష్ణంరాజు, అల్లూరి ధనరాజు, ఎంపీడీవో పి శామ్యూల్, విస్తరణాధికారి శ్రీనివాస్, ఏవో రాజేష్ పాల్గొన్నారు.

# స్విఫ్ట్ డిజైర్ కారు ఢీకొని ఒక వ్యక్తి మృతి

మొగల్తూరు జులై 4 (ప్రభాతవార్త) పేరుపాలెం నార్త్ పంచాయతీ పరిధి ఒంటి తాడి వద్ద పేరుపాలెం బీచ్ నుండి వస్తున్న షిఫ్ట్ డిజైర్ కారు శుక్రవారం పేరుపాలెం మరియు మోడీ మధ్యగల రహదారి నందు ఉన్న కాలువ ప్రక్కన గడ్డి కోస్తున్న రైతు గుత్తుల పెద్దిరాజు(48) ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు, ఈ విషయం తెలుసుకుని శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ సంఘటన స్థలానికి చేరుకుని, మృతి చెందిన గుత్తుల పెద్దరాజు కుటుంబాన్ని పరామర్శించి , వారికి న్యాయం జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ డిపార్ట్మెంట్ వారిని ఆదేశించారు



# నాటు సారాయి స్థావరాలపై ఉక్కు పాదం

చింతలపూడి.. ప్రభాత వార్త :చింతలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ క్రాంతి కుమార్ ఎస్.ఐ శ్రీ సతీష్ కుమార్ మరియు వారి సిబ్బందితో కలిసి చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో నాటు సారా తయారీ మరియు అక్రమ విక్రయాలపై క్షుణ్ణంగా కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.చింతలపూడి సర్కిల్స్ సిబ్బంది తెల్లవారుజామున భారీ స్థాయిలో కార్డన్ సెర్చ్ ను సుమారు 460 ఇళ్లలలో తనిఖీలు నిర్వహించిన పోలీసు అధికారులు.శాంతి భద్రతల పరిరక్షణ అసాంఘీక శక్తుల నిర్మూలన అసాంఘీక కార్యకలాపాలకు అవకాశం లేదు. అక్రమ చట్టాలను అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించిన చింతలపూడి ఇన్స్పెక్టర్ ఈ సందర్భంగా చింతలపూడి ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రజల యొక్క ఆరోగ్యానికి హానిచేసే నాటు సారా తయారీ కేంద్రం యొక్క సమాచారం లేదా అమ్మకాల కార్యకలాపాలుంటే స్థానిక పోలీస్ స్టేషన్కు లేదా డయల్ 112 కి, చింతలపూడి ఇన్స్పెక్టర్ గారి యొక్క ఫోన్ నెంబర్ 9440796674 కు వెంటనే తెలియ చేసిన యెడల అట్టి వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని సమాచారం అందించిన వారి యొక్క వివరాలను గోప్యంగా ఉంచబడుతుంది అని చింతలపూడి ఇన్స్పెక్టర్ తెలియజేసినారు తెలియ చేసినారు.

## డెంగ్యూ వ్యాధిపై ర్యాలీ




అత్తిలి జులై 4 ( ప్రభాతవార్త: డెంగు వ్యాధిపై గణపవరం 3 సచివాలయ పరిధిలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ నందు ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ మాసోత్సవము 1నుండి 31 వరకు జరుగు కార్యక్రమం పై ఆరోగ్య సిబ్బంది ప్రతి గ్రామములో అవగాహన కల్పిస్తారని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె విల్సన్ బాబు తెలిపారు.పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు మార్గమని ,సమిష్టి భాగ స్వామ్యముతోడెంగ్యూ వ్యాధిని అరికట్టవచ్చునని . నెల రోజులు పాటు డెంగ్యూ వ్యాధిపై గ్రామాలలో ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు , ఆరోగ్య కార్యకర్తలు పురుషులు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ ఇంటింటా తిరిగి, డెంగు వ్యాధిపై అవగాహన కలిగిస్తారని అన్నారు. ప్రతి ఉప ఆరోగ్య కేంద్రము లోని అన్ని గ్రామాలలో డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఉన్నవారిని సమీపంలోని హెచ్ డబ్లు సి కి వ్యాధి నిర్ధారణ నిమిత్తము ఆశా కార్యకర్తలు పంపించి , వ్యాధి రాకుండా ప్రతి గృహ దర్శనములో చెప్పాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పి హెచ్ఎన్ సిహెచ్ వి సత్యవతి ఎం పి హెచ్ ఎస్ మేల్.బాల మురళి కృష్ణ, పద్మజ, నున్నా పాప ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయాల కార్య నిర్వహణ అధికారిగా తెలగంశెట్టి లక్ష్మి



కొయ్యలగూడెం ప్రభాతవార్త జూలై 4 :దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణ అధికారిగా నియమితులైన తిలగం శెట్టి లక్ష్మి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ కొయ్యలగూడెం శ్రీ రుక్మిణి సత్యభామ సమేత గోపాల స్వామి దేవాలయానికి కన్నాపురం సీతారామచంద్ర స్వామి దేవాలయానికి ప్రభుత్వం నియమించిందని అన్నారు. ఆలయాల ఆస్తుల పరిరక్షణ, ఉత్సవాల నిర్వహణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల మనోభావాలను గౌరవిస్తానని తెలియజేశారు.

## వారాహికి ప్రత్యేక పూజలు



అత్తిలి జులై 4 ( ప్రభాత వార్త ): అత్తిలి ఉమా సిద్దేశ్వర స్వామి దేవాలయంలో గల వారాహి అమ్మవారి విగ్రహం వద్ద గుప్త నవరాత్రులు ఉత్సవాల సందర్భంగా మహిళలు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఏడాది కాలంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు : ఎమ్మెల్యే ఆరిమిల్లి.



అత్తిలి జూలై 4 (ప్రభాతవార్త ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సమపాళ్ల లో నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అత్తిలి మండలం వరిగేడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా 60 లక్షలతో నిర్మించే పంచాయతీరాజ్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో అంబేద్కర్, జగజ్జీవన్ రావ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం నాయకులు అడ్డాల సాయిబాబా, గ్రామ తెలుగుదేశం అధ్యక్షుడు నగిరెడ్డి శ్రీనివాస్, కార్యదర్శికడలి వెంకన్న బాబు, యూనిట్ ఇంచార్జ్ కడలివెంకట్ నారాయణ,గునా రామారావు, సూరిబాబు, ఆల్తి అజయ్, గునా రాము, ఆనాల ఆదినారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు జయంతి.



అత్తిలి-జూలై 4( ప్రభాతవార్త ): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజల హక్కుల కోసం ఎంతో కృషి చేశారని అత్తిలి తాసిల్దార్ దశిక వంశీ అన్నారు. అత్తిలి తాసిల్దార్ కార్యాలయంలో సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు.సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



నరసాపురంలో 11 రోజులుగా సందు చేస్తున్న మున్సిపల్ అవుట్సోర్సింగ్ సిబ్బంది సమ్మె విరమించి విధులకు హాజరయ్యారు. ప్రభాతవార్త నరసాపురం

## ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలో మరిన్ని మెరుగైన సేవలు.....

**పాలకొల్లు జూలై 4 ప్రభాతవార్త :** పాలకొల్లులో ఇమిడి సత్యనారాయణ వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలో కార్పొరేటర్ స్థాయికి మించి మెరుగైన వైద్య సేవలు అందుతాయని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆయన శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను ఈసీఎల్ సంస్థ ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో 50 పడకల ఆసుపత్రి ను వంద పడకల స్థాయికి పెంచడంతోపాటు నూతన భవనానికి 12.60 కోట్లు నిధులు తీసుకువచ్చానన్నారు. గత వైసిపి ప్రభుత్వం లో రెండేళ్లలో పూర్తి కావలసిన పనులు ఐదేళ్లలో పూర్తికాకపోగా జరిగిన పనులు పూర్తిగా నాశరకంగా జరిగాయని, ప్రారంభోత్సవం జరగకముందే బీటలు తీసి వర్షం నీరు సైతం లీక్ అవుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ఆ పనులను సరి దిద్దుతూ త్వరలో ప్రారంభం జరుపుకునేలా పనులను వేగవంతం చేశామన్నారు. అందులో భాగంగా ఈసీఎల్ సంస్థను సి ఎస్ ఆర్ నిధులు మంజూరు కోరగా పనులు పరిశీల నిమిత్తం సంస్థ ప్రతినిధులు వచ్చారని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ యర్రా మాధురి,





నాయకులు మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రాష్ట్ర కార్యదర్శి పిచ్చెట్టి బాబు పట్టణ అధ్యక్షులు జీవీ మల్లంపల్లి పకీర్ బాబు బిరుదుకోట సామ శేఖర్ కర్నేన నాయుడు పొట్నూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## ఆరోగ్య వర్షిని ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల నిర్వహణ

మొగల్తూరు జూలై 4 (ప్రభాతవార్త) ముత్యాలపల్లి గ్రామంలో ఆరోగ్య వర్షిని ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, నరసాపురం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు పాల్గొని, అనంతరం ఆయన మాట్లాడుతూ, బ్రిటిష్ పాలకుల ఆకృత్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన విప్లవ యోధుడు, మన్యం వీరుడు అని, స్వతంత్ర పోరాటంలో అల్లూరి సీతారామరాజు పాత్ర ఎనలేనిదని, భవిష్యత్తు తరాలకు భరోసా అని , ఆయన ఎప్పుడు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని. స్వతంత్ర పోరాటంలో ప్రజల కోసం ఆయన ప్రాణాలర్పించారని ఆయన తెలియజేశారు, ఈ సందర్భంగా శ్రీ బండి ముత్యాలమ్మ జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ నందు వ్యాసరచన పోటీలు నిర్వహించారు, ఈ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు, ఈ కార్యక్రమంలో ఆరోగ్య వర్షిని ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు,



పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనుమత్స రామరాజు నాగిడి భగవాన్, తిరుమని భాస్కర్ రావు, కొప్పాడి వెంకట దుర్గా నాగరాజు, కొల్లాటి బాలకృష్ణ కొల్లాటి మూలస్వామి, దొంగ శ్రీను వాటాల శ్రీను అడ్డాల ఏడుకొండలు బంధన నాగేశ్వరరావు దొంగ రాంప్రసాద్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# గ్రామ పంచాయితీని ఆదర్శ గ్రామంగా చేద్దాం

కొయ్యలగూడెం ప్రభాతవార్త జూలై 4 : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత. మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచితే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని జడ్పీ సీఈవో శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కోయిలగూడెం మండలం బయ్యనగూడెం, సీతంపేట గ్రామాలను సందర్శించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రతిరోజు తమ ఇంటి వద్దకు చెత్త సేకరణకు పారిశుద్ధ్య కార్మికులు చెత్తను సేకరిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు . చెత్తను బహిరంగ ప్రదేశాలలో గాని రోడ్డు ప్రక్కన కానీ వేయకూడదని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర ,స్వచ్ఛత ఆంధ్ర, ఫ్రైడే డ్రైడే ,వంటి వినోతన కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నదని చెప్పారు. ప్రజలు తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని తద్వారా ప్రభుత్వం చెత్త నుండి సంపద సృష్టించే తయారీ కేంద్రాలకు తరలిస్తుందని తెలియపరిచారు. గ్రామంలో డ్రైనేజీ , వ్యవస్థ పై మురికి నీరు నిల్వం ఉంటే దోమల వ్యాప్తి ఉంటుందని తద్వారా గ్రామంలో మలేరియా టైఫాయిడ్ డెంగ్యూ వంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, వర్షాకాల ప్రభావం ద్వారా సంభవించే కలరా



వంటి వ్యాధులు ప్రబలకుండా మంచి నీటిని కాచుకొని త్రాగాలని అన్నారు. చుట్టూ ఉన్న ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని తద్వారా గ్రామం స్వర్ణాంధ్రప్రదేశ ఉంటుందని గ్రామస్తులకు తెలియజేశారు .. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కే. కిరణ్ కుమార్, బయ్యన్నగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ లింగి శెట్టి. అనంతలక్ష్మి, సీతంపేట గ్రామపంచాయతీ సర్పంచ్ తోటకూర. పద్మావతి, పి ఆర్ ఏ ఈ. సురేష్, డిప్యూటీ ఎంపీడీవో. సతీష్, పంచాయతీల కార్యదర్శులు జగదీష్, జ్యోతి, సీనియర్ అసిస్టెంట్ కే స్వామి, కూటమి పార్టీల నాయకులు పారేపల్లి. నరేష్, మద్దు. తేజ, లింగిశెట్టి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ధార్మికత గురించి చైతన్యం కలిగించాలి

జీలుగుమిల్లి-ప్రభాతవార్త : పల్లె పల్లెకు, గడపగడపకు, హిందూ ధార్మిక సంస్కృతి యొక్క విశిష్టత గురించి.. హిందువుల్లో చైతన్యం కోసం ప్రతి ఒక్కరూ ప్రచార కరపత్రాలు తీసుకెళ్లి, అవగాహన కల్పించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జిల్లా సమరసిత సేవ ఫౌండేషన్ కన్వీనర్ తిప్పాబొట్ల రామకృష్ణ తెలిపారని వేదుల జనార్ధనరావు తెలిపారు. శుక్రవారం జీలుగుమిల్లి శ్రీ అభయాంజ నేయ స్వామి ఆలయం నందు ఎస్ఎస్ ఎఫ్ కన్వీనర్.. కొత్తూరి మోహన్రావు అధ్యక్షతన సేవా ఫౌండేషన్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన టీవీ రామకృష్ణ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడు తూ నగర సంకీర్తన జరగాలని అన్నారు. హిందూ ధర్మానికి వ్యతిరేకంగా జరుగుతున్న దుష్ప్రచారాలని గ్రామాల్లో జరుగుతున్న మతం మార్పిడిలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని



అన్నారు. ఈ కార్యక్రమంలో బొంతు రామకృష్ణ, కక్కిరాల అప్పారావు, తెల్లం వెంకటేశ్వరరావు, ఊక సూర్యచంద్రరావు, గంధం గోతయ్య, రేపాక గోపాలం, చిట్లూరి చంద్రావు, కొడవటి సత్యనారాయణ, కోలా లక్ష్మణ్, తనికెళ్ల నాని, శ్రీనివాస్ గాంధీ, జంగారెడ్డిగూడెం డివిజన్ ఎస్ ఎస్ ఎఫ్ ధర్మ ప్రచారక్ మంగళగిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మన్యం వీరుడు అల్లూరి జయంతి

జీలుగుమిల్లి, జూన్-04, ప్రభాతవార్త: భారతమాత దాస్య శృంఖాలాను అహింసా, సత్యాగ్రహాల ద్వారా తెంచలేమని, విప్లవ పోరాటం ద్వారా తెంచగలమని బ్రిటిష్ వాళ్ళని గడగడలాడించిన మన్య వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ, దేశభక్తిని నేటి విద్యార్థులు, యువత స్ఫూర్తిగా తీసుకోవాలని మండలంలోని వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రం ఉపాధ్యాయుడు వేదుల జనార్దన రావు పిలుపు నిచ్చారు. శుక్రవారం వంకవారిగూ డెం విజ్ఞాన కేంద్రంలో పాఠశాల ప్రధానాచార్యులు ఎంవీఎస్ సుబ్రహ్మణ్య అధ్యక్షతన, మన్య వీరుడు అల్లూరి సీతారామరాజు 128 వ జయంతి విద్యార్థుల మధ్య ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలోని అల్లూరి



సీతారామరాజు విగ్రహానికి పాఠశాల ఉపాధ్యాయులు వెల్ల మనోహర్ రెడ్డి పుష్పమాలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే గౌరీ శ్రీ, వి కామేశ్వరి, వి మనోహర్రెడ్డి, పి అమల, వై భారతీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరవల్లి లో పర్యటించిన కుల వివక్షత పోరాట సమితి.

అత్తిలి జులై 4 (ప్రభాతవార్త ):అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో గత నెల 23వ తేదీన ఎస్సీ ఉపకులాల మధ్య జరిగిన పరస్పర దాడులపై శుక్రవారం కేవీపీఎస్ జిల్లా బృందం నిజనిర్ధారణ కమిటీగా పర్యటించారు. దళిత పేటలో శాంతియుత శిబిరంలో కూర్చున్న ఒకవర్గం ప్రజలతో బృందం కలిసి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. మరో వర్గం ప్రజలు అందుబాటులో లేకపోవడంతో కలవలేకపోయారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ ఆరవల్లి గ్రామంలో దళితుల మధ్య జరిగిన పరస్పర దాడులు బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలో పునరావృతం కాకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సామరస్య పూర్వకంగా శాంతియుతంగా ఈ గొడవలను ముగించాలన్నారు. ఒక కులాల మధ్య ఘర్షణలు జరిగితే శాంతి, సామరస్యం తెచ్చేలా అధికారులు ప్రయత్నించాలన్నారు. గ్రామంలో ఉన్న ప్రజా ప్రతినిధులు, ఇతర సామాజిక తరగతుల పెద్దలు, ఎస్సీ ఉపకులాల్లో ఉన్న ఇరు వర్గాల సభ్యులతో పాటుగా గ్రామ పెద్దలను కలిపి శాంతి కమిటీ వేస్తే గ్రామంలో శాంతి వస్తుందని అన్నారు. తీవ్రంగా



గాయపడి నేటికీ వైద్య చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం వైద్య సహాయాన్ని ఉచితంగా అందించేలా కృషి చేయాలన్నారు. ఎస్సీ నిధులు లేదా ఎన్టీఆర్ వైద్య భరోసా క్రింద వైద్యం చేయించాలని డిమాండ్ చేసారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.క్రాంతి బాబు మాట్లాడుతూ ఐక్యంగా ఉండి సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన దళితులు నేడు ఉప కులాల వారీగా పరస్పరదాడులు చేసుకోవడం బాధాకరమన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లో వెంటనే ఈ ఘటనపై స్పందించాలని గ్రామంలో శాంతి, సామరస్యం వెదజల్లేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను కెవిపిఎస్ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రాన్ని సమర్పిస్తామని క్రాంతి బాబు తెలిపారు.

# చరిత్ర సృష్టించిన 'హరి హర వీరమల్లు' ట్రైలర్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా వస్తుందంటే.. తెలుగు సినీ పరిశ్రమలో సరికొత్త రికార్డులు నమోదవ్వడం సహజం. తాజాగా హరి హర వీరమల్లు ట్రైలర్‌తో ఈ విషయం మరో సారి రుజువైంది. ట్రైలర్ విడుదలైన క్షణం నుండి అభిమానులు, ప్రేక్షకులు బ్రహ్మ రథం పడుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను మును పెన్నడూ చూడని చారిత్రక యోధుడు పాత్రలో కనిపించడం అందరినీ ఆకర్షించింది. ట్రైలర్‌లో ప్రతి ఫ్రేమ్ అద్భుతంగా ఉందంటూ సినీ ప్రముఖులు సైతం ప్రశంసిస్తున్నారు. పవన్ కళ్యాణ్ కట్టిపడేసే లుక్స్, స్క్రీన్ ప్రజెన్స్‌తో, ఇటీవల కాలంలో వచ్చిన అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా హరి హర వీరమల్లు ట్రైలర్ ప్రశంసలు అందుకుంటోంది. హరి హర వీరమల్లు చిత్రం ట్రైలర్ నుంచే ఇండస్ట్రీ రికార్డులను బద్దలు కొట్టడం ప్రారంభిస్తుందని దర్శకుడు జ్యోతి కృష్ణ చెప్పారు. ఆయన మాటే నిజమైంది. హరి హర వీరమల్లు ట్రైలర్ తెలుగులో కేవలం 24 గంటల్లోనే 48 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి, తెలుగు సినిమాల పరంగా సరికొత్త రికార్డును నెలకొల్పింది. అన్ని భాషల్లో కలిపి దాదాపు 62 మిలియన్ల వ్యూస్ సాధించింది. దర్శకుడు జ్యోతి కృష్ణ ట్రైలర్‌ను రూపొందించిన తీరు అందరినీ మంత్రం ముగ్దుల్ని చేసింది. ట్రైలర్ అందరి అంచనాలకు మించేలా ఉంది. వీరమల్లును ఆయన ఒక పాత్రగా కాకుండా, సినిమాటిక్ శక్తిగా మలిచారు. బలమైన భావోద్వేగాలు, అద్భుతమైన యుద్ధ సన్నివేశాల మేళవింపుతో ట్రైలర్‌ను మలిచిన తీరు మెప్పించింది. దీని ప్రభావం అన్ని వర్గాల ప్రేక్షకులలో ప్రతిధ్వనిస్తోంది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి తన నేపథ్య సంగీతంతో ట్రైలర్‌ను మరో స్థాయికి తీసుకెళ్ళారు. విజువల్స్‌కు ప్రాణం పోశారని చెప్పవచ్చు. తన సంగీతంతో అటు భావోద్వేగ సన్నివేశాలు, ఇటు యుద్ధ సన్నివేశాల గాఢతను పెంచారు. చారిత్రక కథకు తగ్గట్టుగా కీరవాణి అందించిన సంగీతం.. ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా చేస్తోంది. ఛాయాగ్రాహకులు జ్ఞాన శేఖర్ వి.ఎస్., మనోజ్ పరమహంస సన్నివేశాలను ఎంతో అందంగా చిత్రీకరించారు. ప్రతి ఫ్రేమ్ ఒక పెయింటింగ్ లా ఉంది. చారిత్రక కథకు తగ్గట్టు భారీతనాన్ని చూపిస్తుంటే.. కథలోని భావోద్వేగాన్ని, వీరమల్లులోని ఆవేశాన్ని చక్కగా కెమెరాలో బంధించారు. ఇక ప్రముఖ కళా దర్శకుడు తోట తరణి తన అద్భుతమైన సెట్‌లతో ప్రేక్షకులను మొఘల్‌యుగంలోకి తీసుకు వెళ్లారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.ఎం. రత్నం సమర్పణలో ఎ.దయాకర్ రావు నిర్మించిన ఈ చిత్ర నిర్మాణ విలువలు అద్భుతంగా ఉన్నాయి.

# యాక్షన్, అమేజింగ్ విజువల్స్ మూవీ 'తమ్ముడు'

సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ తమ్ముడు. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమ్ముడు సినిమా ఈ నెల 4న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్‌తో పాటు చిత్ర క్యారెక్టర్‌లో నటించిన తన ఎక్స్‌పీరియన్స్ తెలిపారు హీరోయిన్ వర్ష బొల్లమ్మ. నేను గతంలో ఎస్వీసీ సంస్థలో జాను అనే మూవీలో నటించాను. తమ్ముడు కోసం పిలవగానే వచ్చి ఆడిషన్ ఇచ్చాను. లుక్ టెస్ట్‌లో వెంటనే ఓకే అయ్యాను. దర్శకుడు వేణు ఈ మూవీ గురించి చెబుతూ అడవిలో షూటింగ్ చేయాల్సి ఉంటుంది. మీకు ఇబ్బంది ఉంటే ఇప్పుడే చెప్పండి అన్నారు. నేను ఛాలెంజింగ్‌గా తీసుకుని చేస్తాను అని చెప్పాను. అలా చిత్ర క్యారెక్టర్‌కు నేను సెలెక్ట్ అయ్యాను. హీరో నితిన్ క్యారెక్టర్ జై కు చిత్ర డ్రైవింగ్ ఫోర్స్‌లా ఉంటుంది. జై కు అన్ కండిషనల్‌గా సపోర్ట్ చేస్తుంది చిత్ర. వారి మధ్య ఉన్న రిలేషన్ చాలా బాగుంటుంది. ఈ సినిమా కోసం నేను మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నా. రియల్ లైఫ్‌లో కూడా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని ఉండేది. అది ఈ సినిమాతో కుదిరింది. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడాన్ని ఎంజాయ్ చేశాను. ఏదైనా చేయాలనుకుంటే వెంటనే అడుగువేసే క్యారెక్టర్ చిత్రది. నా రియల్ లైఫ్‌లో నేను అలా కాదు. తమ్ముడు మూవీ టైటిల్ ఈ కథకు యాప్ట్. పవన్ ఒక సూపర్ హిట్ మూవీ ఈ టైటిల్‌తో ఉండటం మేము హ్యాపీగా ఫీలయ్యే విషయం. నా క్యారెక్టర్‌కు తమ్ముడు కథలో మంచి ప్రాధాన్యత ఉంటుంది. బిగిల్ మూవీ తర్వాత ఫిజికల్‌గా శ్రమించిన చిత్రమిదే. ఈ చిత్రంలో లయ మరో కీ రోల్ చేస్తున్నారు. ఆమె జర్నీ మా అందరికీ ఇన్స్‌పిరేషన్. హీరోయిన్‌గా ఒక కెరీర్ చూసిన ఆమె పర్సనల్ లైఫ్ లోకి వెళ్లడం, మళ్లీ ఇప్పుడు రీ ఎంట్రీ ఇవ్వడం స్ఫూర్తిగా తీసుకోవచ్చు. ఆమె కెరీర్ లో జరిగిన విశేషాలు మాతో షేర్ చేసుకునే వారు. తమ్ముడు మూవీని ఏదైనా స్టూడియోలో ఉన్న చిన్న అడవిలో కూడా షూట్ చేయొచ్చు కానీ సహజంగా ఉండేలా మారేడుమిల్లి అడవిలో చిత్రీకరించాం. అది దట్టమైన అడవి. వర్షాకాలంలో పాములు, తేళ్లు కనిపించేవి. రాత్రిపూట షూటింగ్‌లో కేవలం కాగడాలు పట్టుకుని నటించాం. షూటింగ్ లో పెద్దవాళ్లు ఉన్నారు, పిల్లలు ఉన్నారు. వాళ్లు కూడా ఇబ్బందిపడ్డారు. లయగారు అమెరికా నుంచి వచ్చారు. అక్కడ సుకుమారంగా ఉండి ఈ అడవిలో చెప్పులు లేకుండా నటించారు. రోజూ ఏదో ఒక గాయం అయ్యేది. అయినా ఉత్సాహంగా షూటింగ్ లో పాల్గొనేవారు. నాకు నితిన్ క్యారెక్టర్స్‌కు షూస్ ఉంటాయి. ఎస్వీసీ సంస్థలో మరోసారి నటించడం హ్యాపీగా ఉంది. జాను మూవీ చేసినప్పుడు నేను కొత్త నటిని. అయినా నాకు మంచి రెస్పెక్ట్ ఇచ్చారు. ఇప్పుడు కూడా అలా గౌరవంగానే చూసుకున్నారు. నేను హీరోయిన్‌గా పలు చిత్రాలు చేశా. హీరోయిన్, క్యారెక్టర్ ఆర్టిస్టు... ఇలాంటి తేడాలు చూడాలని అనుకోవడం లేదు. వర్ష బాగా పర్ ఫార్మ్ చేసింది అనే పేరు తెచ్చుకుంటే చాలు. తమ్ముడు కథ విన్నప్పుడు ఇది కొత్తగా ఉంది ఛాలెంజింగ్‌గా ఉంది అనిపించింది. అందుకే నటించాను. నిత్యామీనన్‌ను ఎగ్జాంపుల్‌గా తీసుకుంటే తనకు పర్ ఫార్మర్‌గా పేరుంది. నేనూ అలాగే పేరు తెచ్చుకోవాలని ఆశిస్తున్నా. హీరో నితిన్ చాలా కామ్‌గా ఉంటారని ఒకఇంప్రెషన్ ఉంది. కానీ ఆయన చాలా ఫన్ పర్సన్. అడవిలో షూటింగ్ చేస్తున్నప్పుడు ఫోన్స్ అవీ ఏమీ లేవు. మేము సరదాగా మాట్లాడుకునేవాళ్లం. చిన్నా, పెద్దా ప్రతి ఆర్టిస్టుకు ఆయన గౌరవం ఇచ్చేవారు. నేను జోక్స్ చెప్పి ఆయనను విసిగించా. నాకు అనిపించింది సోషల్ మీడియా ద్వారా వ్యక్తం చేస్తుంటా. ఈ చిత్రంలో నా క్యారెక్టర్ పర్ ఫార్మ్ చేసేప్పుడు అప్పటికప్పుడు ఏదైనా అనిపిస్తే చెప్పాను. కానీ డైరెక్టర్ డైలాగ్‌లో ఉన్నది ఉన్నట్లు స్ట్రిక్ట్‌గా చెప్పమనేవారు. నేను మిడిల్ క్లాస్ మెలోడీస్ చేసినప్పుడు స్పాంటేనియస్‌గా చాలా ఇంప్రూవ్ చేసి డైలాగ్స్ చెప్పాం. ఆ మూవీకి అలా కుదిరింది.



హీరోయిన్ వర్ష బొల్లమ్మ

# 'మిస్టీరియస్'లో నాగభూషణం మనవడు

అలనాటి రక్త కన్నీరు నాగభూషణం మనవడు అబిద్ భూషణ్ హీరోగా బిగ్ బాస్ ఫేమ్ రోహిత్ సహాని జంటగా వస్తున్న చిత్రం మిస్టీరియస్. ఆష్లీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఉషా మరియు శివాని నిర్మించిన ఈ చిత్రానికి మహి కోమటిరెడ్డి దర్శకత్వం వహించారు. రియా కపూర్ మరియు మేఘనా రాజ్‌పుత్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రం నుండి ఇప్పటికే రిలీజ్ చేసిన రెండు పాటలతో సినిమా మీద అంచనాలు పెరిగాయి. ఇక తాజాగా ఈ చిత్ర టీజర్‌ను ఘనంగా లాంచ్ చేసింది మూవీ టీమ్ ఈ సందర్భంగా డైరెక్టర్ మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ, సస్పెన్స్ జానర్ లో వస్తున్న ఈ సినిమా ఆడియన్స్‌కి సరికొత్త ఎక్స్పీరియన్స్ ఇస్తుందని, తాజాగా టీజర్‌కి వచ్చిన రెస్పాన్స్‌తో సినిమా సక్సెస్‌పై మరింత కాన్ఫిడెన్స్ పెరిగిందని చెప్పుకొచ్చారు. ఇక నిర్మాతలు ఉషా మరియు శివాని మాట్లాడుతూ, సినిమాని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించామని, టీజర్ అందరికీ నచ్చడం సంతోషమని, ఫ్యూచర్లో మరిన్ని మంచి సినిమాలతో ఆడియన్స్‌ని ఎంటర్ టైన్ చేస్తామని తెలిపారు. ఇక సినిమాలో జంటగా నటించిన అబిద్ భూషణ్, రోహిత్ సహాని మాట్లాడుతూ, ఇంతమంచి అవకాశాన్ని ఇచ్చిన డైరెక్టర్ ,ప్రొడ్యూసర్స్‌కి చాలా థాంక్స్ అని ,ఇప్పటికే రిలీజ్ అయిన రెండు పాటలు మంచి టాక్ తెచ్చుకోవడంతో పాటు రిలీజ్ అయిన టీజర్ కి కూడా మంచి అప్లాజ్ రావడం ఆనందంగా ఉందన్ని తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఇక ఈ టీజర్ లాంచ్ ఈవెంట్లో సినిమా నటీనటులు, యూనిట్ అంతా పాల్గొని సందడి చేయడం విశేషం. నటీనటులు: ప్రధాన తారాగణం, రోహిత్ సహాని (బిగ్ బాస్ ఫేమ్),అబిద్ భూషణ్ (ప్రముఖ నటుడు రక్త కన్నీరు నాగభూషణ్ మనవడు), రియా కపూర్ (హీరోయిన్), మేఘనా రాజపుత్(హీరోయిన్), బలరాజ్ వాడి (కన్నడ నటుడు).



# 'రామాయణ: ది ఇంట్రడక్షన్' గ్రౌండ్ బ్రేకింగ్ ఈస్ట్-వెస్ట్ కొలాబరేషన్

5000 సంవత్సరాల క్రితం జరిగిన గొప్ప ఇతిహాసం ప్రపంచ వ్యాప్తంగా 2.5 బిలియన్ల మంది భక్తికి ప్రతీక నమిత్ మల్హోత్రా రామాయణ రెండు భాగాల లైవ్‌ఆక్షన్ సినిమాటిక్ యూనివర్స్‌గా, ఇప్పటివరకు రూపొందిన అతి పెద్ద టెంట్‌పోల్ సినిమాల స్థాయిని రీఇమాజిన్ చేయనుంది. ఈ చిత్రం హాలీవుడ్, భారతదేశానికి చెందిన ప్రతిభావంతులను ఒకే వేదికపైకి తీసుకొచ్చే, ఇప్పటివరకు ఎప్పుడూ చూడని గొప్ప సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్‌ని అందించబోతోంది. నితేశ్ తివారీ దర్శకత్వంలో, నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, 8 సార్లు ఆస్కార్ అందుకున్న విఎఫ్ఎక్స్ స్టూడియో డిఎన్ఇజి సంయుక్తంగా, యాష్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్‌తో కలిసి నిర్మిస్తున్న రామాయణ, ఐఎంఎక్స్ కోసం చిత్రీకరించబడుతోంది. ఈ చిత్రం పార్ట్ 1 – దీపావళి 2026లో, పార్ట్ 2 – దీపావళి 2027లో ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న సినీ ఈవెంట్‌కి నాంది పలికేలా మేకర్స్ రామాయణ: ది ఇంట్రడక్షన్ పేరిట ఈ ఎపిక్ మూవీని గ్లోబల్‌గా ఆవిష్కరించారు. ఇది పురాణాలలోని రెండు అత్యంత ప్రసిద్ధ శక్తులైన రాముడు వర్సెస్ రావణ మధ్య కాలాతీత యుద్ధానికి వేదికగా నిలిచింది. ఈ ప్రయోగం ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది ఈ లాంచ్ భారతదేశంలోని తొమ్మిది ప్రధాన నగరాలలో ఫ్యాన్ స్క్రీనింగ్స్ ద్వారా, అలాగే న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ లో భారీ బిల్బోర్డ్ టేకోవర్ ద్వారా వరల్డ్ వైడ్‌గా జరిగింది. విజనరీ దర్శక నిర్మాత నమిత్ మల్హోత్రా నేతృత్వంలో, యాష్ సహనిర్మాతగా రూపొందిస్తున్న ఈ రామాయణ.. ఆస్కార్ అవార్డు పొందిన సాంకేతిక నిపుణులు, హాలీవుడ్ నిపుణులు, భారతీయ నటీనటులు, కథా కళాకారులను ఒకే వేదికపైకి తీసుకొస్తోంది. ఇది మన నాగరికతలోని అత్యంత శక్తివంతమైన ఇతిహాసాన్ని ఆధునిక సాంకేతికతతో, భారతీయ సంస్కృతి మూలాలపై ఆధారపడిన ప్రపంచస్థాయి సినిమాటిక్‌యూనివర్స్‌గా రీడిఫైన్ చేయనుంది. కాలానికిఅతీతమైన యుగంలో, ఈబ్రహ్మాండం సమతుల్యంలో కొనసాగుతోంది. ఈ సమతుల్యాన్ని బ్రహ్మ (సృష్టికర్త),విష్ణు(రక్షకుడు), శివుడు(లయకారుడు) త్రిమూర్తులు కాపాడుతూ ఉంటారు. దేవతలు, ఋషులు, మనుషులు, రాక్షసుల మధ్య సమరసతను ఈ త్రిమూర్తులే నిలుపుతున్నారు. కానీ ఆ సమతుల్యం లోంచి, ఇప్పటివరకు ఎప్పుడూ లేనంతటి ఒక విపరీత శక్తి ఉద్భవిస్తుంది. ఒక రాక్షస శిశువు, సృష్టిలోనే అత్యంత భయంకరుడు, దుర్జేయుడుఅయిన రావణుడిగా మారతాడు. అతని గర్జన ఆకాశాలను కంపింపజేస్తుంది. అతని ఉద్దేశ్యం విష్ణువును నాశనం చేయడం. ఎందుకంటే అతను ఎప్పుడూ తన జాతికి విరోధంగా ఉన్నాడని అతడి నమ్మకం.



# బాలీవుడ్‌లోనూ శ్రీలీల పాగా

టాలీవుడ్ యంగ్ బ్యూటీ శ్రీలీల క్రేజ్ ప్రస్తుతం ఏ రేంజ్‌లో ఉందో అందరికీ తెలిసిందే. వరుసబెట్టి సినిమాలు చేస్తున్న ఈ బ్యూటీ చిన్నా, పెద్ద సినిమా తేడా లేకుండా సైన్ చేస్తోంది. ఇక కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా బాలీవుడ్‌లోనూ పాగా వేసేందుకు ఈ అమ్మడు రెడీ అయింది. హీరో కార్తీక్ ఆర్యన్ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తూ బాలీవుడ్ గ్రాండ్ ఎంట్రీకి రెడీ అయింది. అయితే, శ్రీలీల పుష్ప2 సినిమా 'కిస్సిక్' ఐటెం సాంగ్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ పాట ఎంతటి పాపులారిటీని సంపాదించిందో మనం చూశాం. ఇక ఆ పాట తర్వాత అమ్మడికి అలాంటి ఆఫర్స్ చాలానే వచ్చాయట. కానీ, శ్రీలీల తనకున్న సినిమాల కారణంగా వాటిని రిజెక్ట్ చేసింది. అయితే, ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్ కోసం శ్రీలీల మరోసారి స్పెషల్ సాంగ్‌లో చిందులేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అక్కినేని నాగచైతన్య, విరూపాక్ష ఫేమ్ దర్శకుడు కార్తీక్ దండు కాంబినేషన్‌లో ఓ మిస్టిక్ థ్రిల్లర్ చిత్రం తెరకెక్కుతోంది. అత్యంత భారీ బడ్జెట్తో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ ఉండనుందట. అయితే, ఈ సాంగ్‌లో చిందులేసేందుకు శ్రీలీలను చిత్ర యూనిట్ అప్రోచ్ అయినట్లు తెలుస్తోంది. మరి ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్‌కు శ్రీలీల ఓకే చెబుతుందా లేదా అనేది వేచి చూడాలి.



# 11న ఒటిటిలోకి 'నరివేట్ట'

రీసెంట్‌గా రిలీజ్ అయిన మలయాళ యాక్షన్‌డ్రామా నరివేట్టచిత్రానికి విమర్శకుల ప్రశంసలు దక్కాయి. అలాంటి బ్లాక్ బస్టర్ ఇప్పుడు ఓటీటీ లోకి రాబోతోంది. జూలై 11 నుంచి నరివేట్ట చిత్రం సోనీలివ్‌లోకి రాబోతోంది. ఇండియా సినిమా కంపెనీబ్యానర్‌పై టిప్పుషన్, షియాస్ హాసన్ నిర్మించిన ఈ చిత్రానికి అనురాజ్ మనోహార్ దర్శకత్వం వహించారు. ఈ నరివెట్ట చిత్రం లోటొవినో థామస్ ఇప్పటి వరకు పోషించిన ఓ పవర్ ఫుల్ పాత్రను పోషించారు. ఓ యంగ్ అండ్ హానెస్ట్ పోలీస్ కానిస్టేబుల్‌గా వర్గీస్ (టొవినో థామస్) నటించారు. వయనాడ్ ప్రాంతానికి వర్గీస్ ట్రాన్స్‌ఫర్ అవ్వడం, అక్కడి పరిస్థితులపై పోరాడటం అనే కాన్సెప్ట్‌ను అద్భుతంగా చూపించారు. ఆదివాసీ సంఘాలు తమకు భూమిని కేటాయించడంలో ప్రభుత్వం ఆలస్యం చేయడంపై తీవ్ర నిరసనలో వెల్లువెత్తుతాయి. ఈ పరిస్థితుల్ని ఆకానిస్టేబుల్ ఎలా చక్కబెట్టాడు అనేది కథ. ఈ చిత్రంలో టోవినో థామస్‌తో పాటు, సూరజ్ వెంజరమూడు, చేరన్, ఆర్య సలీం, ప్రియంవద కృష్ణన్, ప్రణవ్ టియోఫిన్ వంటి వారు నటించారు. ఎన్ ఎం బాదుషా ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా, జేక్స్ బెజోయ్ సంగీతం దర్శకుడిగా పని చేశారు. ఇది ఆలోచింప జేసే ఓ ఎంగేజింగ్ డ్రామా. అందరూ చూడవలసిన చిత్రం.



# 'కూలీ' నుంచి అమీర్‌ఖాన్ ఫస్ట్ లుక్

సూపర్ స్టార్ రజనీ కాంత్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ కూలీకి లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ (ఎల్‌సియు)తో తన విజయాలని కొనసాగిస్తున్నారు. ప్రతిష్టాత్మక సన్ పిక్చర్స్ బ్యానర్ నిర్మించిన కూలీలో రీసెంట్ కుబేరతో బ్లాక్ బస్టర్ అందుకున్న కింగ్ నాగార్జున పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ మరో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు.మేకర్స్ అమీర్‌ఖాన్‌ని దహాగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. గోల్డెన్ వాచ్, గోల్డ్ ఫ్రేం వున్న గ్లాసెస్ ధరించి సిగార్ తాగుతూ అమీర్‌ఖాన్ ఇంటెన్స్ లుక్‌లో కనిపించిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. డి.సురేష్ బాబు, దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏషియన్ మల్టీప్లెక్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కూలీ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. ఇది ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న మ్యాసీవ్ హైప్‌ను సూచిస్తోంది. రజనీ కాంత్, నాగార్జునలతో పాటు సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీ హాసన్, మహేంద్రన్ వంటి ప్రముఖులు కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ గ్రాండ్‌గా విడుదల చేయనుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్లు సినిమాపై భారీ క్రేజ్‌ను నెలకొల్పాయి. చికిటు సాంగ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. కలానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది.



# '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' డాలీ ధనుంజయ్ లుక్ సూపర్

సప్త సాగరాలు దాటి సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు హేమంత్ రావు, తాజాగా 666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్ అనే టైటిల్‌తో ఒక సినిమాను తెరకెక్కిస్తున్నారు, ఈ చిత్రంలో పుష్ప చిత్రంలో అలరించిన నటుడు డాలీ ధనుంజయ నటిస్తుండగా, కన్నడ చక్రవర్తి శివరాజ్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నారు. జె.ఫిల్మ్స్ పతాకంపై వైశాక్ గౌడ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది, శరవేగంగా షూటింగ్ జరుపుకుం టున్న ఈ సినిమా నుండి డాలీ ధనుంజయ్ న్యూ లుక్‌ను విడుదల చేసారు చిత్ర యూనిట్. డిఫరెంట్‌గా మ్యాన్ లీ లుక్‌లో ఉన్న ధనుంజయ్ లుక్‌కు మంచి రెస్పాన్స్ లభిస్తోంది. పుష్ప 1,2 చిత్రాలతో పాపులర్ అయిన డాలీ ధనుంజర్ 666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్ చిత్రంలో డిఫరెంట్ రోల్‌లో నటించారు.



## 'యువి క్రియేషన్స్ వాళ్లమని తప్పుడు ప్రచారం'

ఒక అనామక వ్యక్తి తాను యువి క్రియేషన్స్‌కు చెందినవాడినంటూ నటీమణులను, వారి ప్రతినిధులను తప్పుడు ఆఫర్లతో కలిసేందుకు ప్రయత్నిస్తున్నాడని మా దృష్టికి వచ్చింది. ఈ వ్యక్తితో మా సంస్థకు ఎలాంటి సంబంధం లేదు. యువి క్రియేషన్స్ తరఫున వచ్చే అన్ని అధికారిక సమాచారం, కాస్టింగ్ ప్రక్రియలు నమ్మదగిన, సరైన మార్గాల ద్వారా మాత్రమే జరుగుతాయి. ఈ విషయాన్ని పరిశ్రమలో ఉన్న ప్రతి ఒక్కరు జాగ్రత్తగా గమనించాలని, ఎవ్వరైనా ఈ తరహా అనామక ప్రతినిధులతో ముందుకు వెళ్లేముందు తప్పకుండా నిజం తెలుసుకోవాలని మనవి. మాకు ఏ అవసరాలు ఉన్నా లేదా కాస్టింగ్ కాల్స్ ఉన్నా, అవి అధికారికంగా, నమ్మదగిన వనరుల ద్వారా మాత్రమే తెలియజేస్తాం.

**- టీమ్ యువి క్రియేషన్స్**



పాయల్ రాజ్‌పుత్ న్యూ లుక్

# వయసుకు తగ్గ సమాధానం చెప్పాలి



**తల్లులకు చిన్న పిల్లలు అమ్మా నేనెక్కడి నుంచి వచ్చాను నీ పొట్టలో ఎందుకు ఉన్నానంటూ అడుగుతారు. ఊహించని ఈ ప్రశ్నలకు ఏం చెప్పాలో అర్థం కాదు. ఈ సందర్భం దాదాపు ప్రతి తల్లికీ ఎదురవుతుంది. ఇబ్బందిగా ఉన్నా వారి వయసుకు తగ్గ సమాధానం చెప్పాల్సిందే అంటున్నారు నిపుణులు.**

పిల్లలకు తమకెదురయ్యే ప్రతీదీ కొత్తగా, వింతగా కనిపిస్తుంది. సందేహాలెన్నో వస్తుంటాయి. వారడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం తెలిస్తేనే తృప్తి పడతారు. లేదంటే వారికి సమాధానం చెప్పాల్సిందే.. ఆ ప్రశ్నకు మరో ప్రశ్న వారి మెదడులో చేరి అయోమయానికి గురవుతారు. అందుకే ఎప్పటికప్పుడు వారి సందేహాలను తీర్చాల్సిందే. అవి వారి పాఠ్యాంశాలు, కథలు, వాటిలోని పాత్రలు, అంతరిక్షం, ఆహారం, ఆటలువంటివి మాత్రమే అయితే ఇబ్బంది లేదు. మరికొంత ముందుకువెళ్లి వారి పుట్టుక గురించి, గర్భధారణ వంటివి ప్రశ్నిస్తే మాత్రం ఇబ్బంది అవుతుంది. ఆ వయసులో వారికి అవసరంలేనివి అడుగుతున్నరని కోప్పడి వాళ్ల నోరు మూయించొచ్చు. అయితే ఆ సందేహం వారి మనసు నుంచి దూరం కాదు. అది పెరిగి పెద్దదవుతుంది.

**ఎలా చెప్పాలంటే...** ఏడెనిమిదేళ్లలోపు చిన్నారులకైతే ఏదైనా కథ రూపంలో సమాధానమివ్వాలి. మరొకసారి మరింత సమాచారం చెబుతానని అక్కడితో సంభాషణను పూర్తిచేయొచ్చు. ఎనిమిదేళ్లు దాటిని ఆడప్లిలకు సమాధానం తప్పనిసరి. కొన్ని విషయాలు అర్థం చేసుకోగలుగుతారు. విసుక్కోకుండా మృదువుగా వారికి కావాల్సినంత మేరకు సమాచారాన్నివ్వొచ్చు. అమ్మ గర్భంలో బిడ్డ ఎదుగుదల గురించి వివరించాలి. మరింత అవగాహన తెచ్చుకొనే వయసైతే ప్రసవం గురించీ వివరించొచ్చు.

**చనిపోవడమంటే చెప్పాలి..** అమ్మమ్మ, నాయినమ్మ, జేజమ్మ ఎందుకు చనిపోయారని, వారెక్కడికి వెళ్లారని కొందరు పిల్లలకు సందేహాలొస్తుంటాయి. పదేళ్లవారికైతే జీవితంలో చివరగా వచ్చేమృతువు గురించి మృదువుగా వివరించాలి. అంతకన్నా చిన్నపిల్లలను దేవుడి దగ్గరకెళ్లాలరని చెప్పి మరిపించొచ్చు. అలానే, అన్నయ్యకన్నా నేనెందుకు భిన్నంగా ఉన్నాననే సందేహం ఆడపిల్లలకొస్తుంది. ప్రతి ఒక్కరి శరీరానికి ప్రత్యేకత ఉందని చెప్పాలి. ఆడపిల్లల్లో ఆయా వయసుకు తగినట్లు శారీరకపరమైన మార్పులెలా వస్తాయో అవగాహన కలిగించాలి. పరిశుభ్రత ప్రాముఖ్యతనూ చెప్పి పాటించేలా చేయాలి. ఇవన్నీ పిల్లల్లో శారీరకంగా ఆరోగ్యాన్నే కాకుండా మానసిక పరిపక్వతనూ పెంచుతాయి. □

## తెలుసుకుందాం..



మగవారితో పోలిస్తే ఆడవాళ్ల బ్రెయిన్ హెల్త్ మీద తక్కువ పరిశోధనలు జరుగుతున్నాయట. దానివల్లే మహిళల్లో వచ్చే న్యూరలాజికల్, సైకలాజికల్ సమస్యలను గుర్తించడం ఆలస్యమవుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. □

# వైద్యంతో పాటు చదువు చెపుతూ..

**అదో ప్రాంగణం.. వరుసగా కుర్చీల్లో కూర్చొని శ్రద్ధగా పుస్తకాలు చదువుతున్నారంతా అలాగని అదేమీ విద్యాలయం కాదు, లైబ్రరీ అంతకన్నాకాదు. ఆసుపత్రి! పాఠకులంతా వైద్యం కోసం వచ్చినవాళ్లు! ఇదంతా ఏంటంటే డాక్టర్ సయ్యద్ రుబీనా గురించి తెలుసుకోవాల్సిందే !**



రుబీనా

అది హనుమకొండ జిల్లా, భీమదేవరపల్లి మండలం, వంగరలోని ప్రభుత్వాసుపత్రి మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు స్వగ్రామం అక్కడే సేవలందిస్తున్నారు. నాన్న అబ్దుల్ వహీద్‌ఖాన్, అమ్మ బదురున్నీసా బేగం... సాంఘిక సంక్షేమ శాఖలో వార్డెన్లుగా చేసి ఉద్యోగ విరమణ చేశారు. వాళ్ల ఉద్యోగరీత్యా కొన్నాళ్లు ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో ఉన్నాం. నా బాల్యం, ప్రాథమిక విద్యాభ్యాసం అక్కడే గడిచింది. వసతిగృహాల్లో విద్యార్థులను చేర్చుకోవడానికి అమ్మానాన్నలు ఆదివాసీ తండాలకు వెళ్లినప్పుడు నన్ను వెంట తీసుకెళ్లేవారు. అక్కడ ఆదివాసీల జీవన స్థితిగతులు చూస్తేబాధేస్తుంది. ఇలాంటి వారికి సేవ చేయడానికే డాక్టర్ అవ్వాలనుకున్నా'నంటారు. రుబీనా. ఖమ్మంలో ఎంబీబీఎస్ పూర్తిచేసి, వరంగల్‌లోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఒప్పంద వైద్యురాలుగా చేరారు. అక్కడ పరిచయమైన రెహమాన్‌ని పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నారు. 'పట్టణ ప్రజలకు వైద్యం సేవలందిస్తున్నా సంతృప్తి లేదు. పల్లెలకు వెళ్లాలన్న కల ఆరేళ్ల తరవాత తీరింది. రెగ్యులర్ వైద్యురాలుగా వంగర్ ఆసుపత్రిలోఅడుగుపెట్టా. కానీ పెద్దగా వచ్చేవారు కాదు. దీనితో వేరుగా వారి వద్దకే వెళ్లి వైద్య సేవలందించాలని నిర్ణయించు కున్నాను. నా భర్త, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో కలిసి పల్లెల్లో తిరిగేదాన్ని మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా సురక్షితంగా ఉంటుంది. అందుకే వారిపై దృష్టిసారించి క్యాన్సర్, టీబీ, హెచ్ఐవీ, బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహించ బడతాయి. ఆరోగ్య శిబిరాలూ ఏర్పాటుచేశాం. క్రమంగా ఆసుపత్రికి వచ్చే సంఖ్య పెరిగింది. దాతల సాయంతో బాలికలకు శానిటరీ నాప్కిన్లనీ అందించేవాళ్లం. ఇటుక బట్టి కార్మికులు, గ్రామ శివార్లలో ఉండే వారి వద్దకే వెళ్లి చికిత్స అందిస్తున్నాం. పిల్లలు కలగట్లేదని బాధపడుతున్న 10మంది దంపతులకు కౌన్సెలింగ్ చేసి, చికిత్స అందిస్తే, ఆరుగురు మాతృత్వం పొందడం మరచిపోలేని సంఘటనగా చెబుతారు రుబీనా. ఆమె ప్రయాణంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో.



**వైద్యాలయమే గ్రంథాలుయంగా...**

సరైన వైద్యం దొరుకుతుందన్న ఆశ కలిగాక రోగుల సంఖ్య పెరిగింది. అయితే వైద్యులను కలవడానికి వేచి ఉండే సమయాన్ని వృథా పోనివ్వడం ఎందుకని ఆలోచించారీమె. ఆ సమయంలో సామాజిక అవగాహన పెంచాలనుకున్నారు. ఆరోగ్య విద్య అందించాలనే లక్ష్యంతో పుస్తక నిధిని ఏర్పాటు చేశారు. రోగి, వాళ్లతో వచ్చిన సహాయకులకు ఈ పుస్తకాలను ఇచ్చి చదివిస్తున్నారు. 'ఆరోగ్యం యోగాపై అవగాహన కలిగించే పుస్తకాలు, కథల పుస్తకాలు అందుబాటులో ఉంచాం. పుస్తక ప్రదర్శనలు, హైదరాబాద్ లోని కోఠి, ఇతర ప్రాంతాల నుంచి ఈ పుస్తకాలు కొని తీసుకొస్తున్నాం. ప్రస్తుతం 80 ఉన్నాయి. వీటిని 200 వరకు పెంచాలన్నది నా ప్రయత్నం. కానీ వైద్య సంబంధిత పుస్తకాలు తెలుగులో దొరకడం లేదు. అదే పెద్ద ఇబ్బంది అనే ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్య సేవపై సందేశాత్మక లఘుచిత్రాలను తీసి, సామాజిక మాధ్యమాల్లో అందుబాటులో ఉంచారు: ఎయిడ్స్ గంజాయి, గుట్కా, టీబీ, బాలికల అక్రమ రవాణా వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం నాడు జిల్లా. అక్కడ జరిగిన వేడుకల్లో 'సుఖప్రసవం ప్రభుత్వ సేవలు'పై ఇచ్చిన ప్రదర్శనకు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి ని అందుకున్నారు. ఈమె సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి .. వైద్యారోగ్యశాఖ మంత్రి ఆమె సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రశంసించారు. 'వైద్యురాలిగా సేవలందిస్తూనే సామాజిక చైతన్యం కోసమూ కృషి చేస్తున్న రుబీనా ఎందరికో మార్గదర్శి' అంటూ అభినందించారు. ఆమె భర్త సిబ్బంది అండతోనే ఇదంతా సాధ్యమైందంటారు. స్త్రీ వైద్య నిపుణురాలిగా మరింత మందికి సేవచేయడం తన లక్ష్యమంటారు. □

# చినుకుల్లో ఫ్యాబ్రిక్ డ్రెస్



**ఎండల నుంచి ఉపశమనంగా లేత రంగులూ, కాటన్ దుస్తులూ వేసుకుంటాం. చలిని తట్టుకునేందుకు ముదురు వర్ణాలు, లేయర్‌న డ్రెస్‌లు, ఉన్ని కోట్లు వంటివాటికి ప్రాధాన్యం ఇస్తాం. వానాకాలం వచ్చే సరికి మాత్రం చినుకులకు భయపడి పక్కన పెట్టేస్తాం. ఫ్యాషన్లనీ రంగుల్నీ పట్టించుకోం. గొడుగో, రెయిన్‌కోటో వేసుకుని కాలేజీలకు, ఆఫీసులకు వెళ్లాల్సిందే. అలాంటివారికి స్టైల్‌తో పాటు సౌకర్యాన్నీ అందించే చిట్కాలివి.**

ఈ కాలంలో వర్షంలో తడిసినా త్వరగా ఆరిపోయే ఫ్యాబ్రిక్ డ్రెస్‌లను ఎంచుకోవాలి. ఖాదీ, క్రేప్ సిల్క్, షిఫాన్, సింథటిక్ వస్త్రంతో తయారుచేసిన దుస్తులను వాడటం మంచిది. అలానే, లేయర్డ్ ప్యాటర్న్‌వి కాకుండా కాస్త తేలిగ్గా ఉండేవాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. వర్షాకాలంలో సౌకర్యంగా ఉండటమే కాదు. సింపుల్‌గా, స్టైలిష్‌గా కనిపించేలా వాటిల్లో ట్రెంచ్ కోట్ ఒకటి. దీనినజీన్స్ మీదకు జత చేసుకుంటే మీ లుక్కే మారిపోతుంది. అలానే ఫుల్ లెంత్ జీన్స్, లాంగ్ గౌన్‌లు వంటివాటిని వేసుకోకపోవడమే మంచిది. బదులుగా కాఫ్‌లెంత్, నీలెంత్ స్కర్టులు, ప్యాంటులు ఎంచుకుంటే మేలు. ఎంత గొడుగు పట్టుకెళ్లినా చినుకులకు ఎంతో కొంత తడవాల్సి వస్తుంది. ఇలాంటప్పుడు ఒంటికి అతుక్కుపోయే దుస్తులను ధరిస్తే.. ఆ తేమ కారణంగా బ్యాక్టీరియల్, ఫంగల్ ఇన్ఫెక్షన్లు ఇబ్బంది పెట్టొచ్చు. అలానే, కాటన్ వస్త్రాలు తడిస్తే ఒపట్టాన ఆరవు. దుస్తులూ వాసన వస్తాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండాలి. ప్యాంటుల్లో చుడీ, పటియాలా వంటివి అసౌకర్యంగా ఉంటాయి. బదులుగా కాఫ్‌లెంత్ పలాజో, లెగ్గింగ్స్ వంటివి చక్కటి ఎంపిక. ట్రెంచ్ కోట్లు, వైడ్ లెడ్ ట్రౌజర్లు, మిడీస్, మ్యాక్సీ, కోఆర్డ్ సెట్స్ వంటివీ వేసుకోవచ్చు. అయితే, ఏవి ఎంచుకున్నా పారదర్శకంగా ఉండేవి మాత్రం వాడొద్దు.





**కంటి కింపుగా...**

వర్షాకాలంలో మబ్బులూ, చిరుజల్లులతో వాతావరణం కాస్త డల్‌గా ఉంటుంది. అందుకు తగ్గట్లే మనలోనూ కాస్త చురుకుదనం తగ్గుతుంది. ఆ ప్రభావం మనపై పడకుండా ఉండాలంటే వేసుకునే దుస్తులు కాస్త కలర్‌ఫుల్‌గా ఉండేలా చూసుకోండి. ఇవి మనసును ఉల్లాసంగా ఉంచుతాయి. వేసవిలో లేత రంగులు వాడేశాం కాబట్టి మరీ ముదురు ఛాయల జోలికి పోకుండా కాస్త కాంతివంతంగా ఉండే వాటికి ప్రాధాన్యం ఇవ్వండి. మోనోక్రోమ్ కలర్స్ వాడండి. పసుపు, ఆరెంజ్, ఎరుపు, గులాబీ, ఆకాశ నీలం, మట్టి, ఇసుక వర్ణాలు బాగుంటాయి. మోనోక్రోమ్ కలర్స్ వాడండి. పసుపు, ఆరెంజ్, ఎరుపు, గులాబీ, ఆకాశ నీలం, మట్టి, ఇసుక వర్ణాలు బాగుంటాయి. ఆకుపచ్చ విషయానికి వస్తే మింటీ పేస్టల్స్ నుంచి ముదురు ఆకుపచ్చ వరకూ అన్ని టోన్‌లూ ఈ కాలానికి చక్కటి ఎంపిక. □

# గుమ్మడికాయ పుడ్డింగ్



**కావలసినవి :** గుమ్మడికాయ ముక్కలు-4 కప్పులు, నెయ్యి-4 టేబుల్ స్పూన్లు, చిక్కటి పాలు, పంచదార-ముప్పావు కప్పు చొప్పున, యాలకుల పొడి-పావు చెంచా, కుంకుమ పువ్వు-కొద్దిగా, బాదం, పిస్తా, కిస్‌మిస్, జీడిపప్పులు- అన్నీ కలిపి అర కప్పు.

**తయారీ :** బాదం, పిస్తా కిస్‌మిస్, జీడిపప్పులను నేతిలో వేయించి పక్కన ఉంచాలి. అడుగు భాగం మందంగా ఉన్న గిన్నెలో రెండు టేబుల్ స్పూన్ల నెయ్యి వేసి, గుమ్మడికాయ ముక్కలను మూడు నిమిషాలు వేయించాలి. పచ్చి వాసన పోయాక.. పాలు పోసి ఉడికించాలి. ఆరేడు నిమిషాల తర్వాత ముక్కలను పప్పుగుత్తితో మెత్తగా మెదపాలి. అందులో పంచదార వేసి, రెండు నిమిషాల పాటు కలియ తిప్పుతూనే ఉండాలి. దగ్గరగా అయ్యాక మిగిలిన నెయ్యి, యాలకుల పొడి, డ్రైఫ్రూట్స్, కుంకుమ పువ్వు వేసి ఇంకో నిమిషం ఉంచి దించేయాలి. అంతే..రుచికరమైన గుమ్మడికాయ పుడ్డింగ్ రెడీ. దీన్ని గిల్ఫ్ ఫిర్‌దౌస్ అని కూడా అంటారు. అంటే స్వర్గంలో చిన్న తునక అని అర్థం. □

# ఆకుకూరల ప్రయోజనాలు

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

శరీరం సరిగ్గా పనిచేయడానికి సమతుల్య ఆహారంలో ముఖ్యమైన భాగంగా అవసరమైన అన్ని పోషకాలుండడం తో వీటిని కూరాకులు అని అంటారు. ప్రకృతి మనకు ఇచ్చిన వరం ఆకుకూరలు అని చెప్పవచ్చు. ఆకు కూరలు కొన్ని సీజన్స్‌లో ప్రత్యేకంగా పెరుగుతాయి. ఎక్కువగా వర్షాకాలంలో, తేమవాతావరణంలో, వేసవిలో పెరిగే ఆకుకూరల్ని కాలానుగుణంగా తీసుకోవాలిలి. చిన్నవి, పెద్దవి, లేత, ముదురు ఆకులు వివిధ సైజ్‌లో ఉండేవి తీసుకోవచ్చు. సాధారణంగా ఏడాది పొడవునా అందరికి అందుబాటులో ఉండే ఆకుకూరలు కొన్ని, స్థానికంగా దొరికే ఆకుకూరలు కొన్ని వారానికి 3 రోజులు తీసుకోవడం వల్ల చాలా వరకు వ్యాధులు తగ్గి ఆరోగ్యపరంగా అనేక అద్భుతాలు కల్గుతాయి. ఎందుకంటే ఇవి ఆరోగ్యానికి వరంలాంటివి. ప్రాంతం, సీజన్ ఆధారంగా 80 వివిధ రకాల ఆకుకూరలు వినియోగింపబడుతున్నాయని చెప్పవచ్చు.

100 గ్రాముల వివిధ ఆకుకూరల్లో ఉండే రమారమి పోషకాలు: తేమ:70-80, సోడియం : 79 మిగ్రా, ప్రోటీన్స్ : 2.9 గ్రా, కాల్షియం : 99మి.గ్రా. పీచు: 2.2 గ్రా. కేలరీలు : 23 కేలరీలు పొటాషియం : 558 మి.గ్రా.

కార్బొహైడ్రేట్స్ : 3.6 గ్రా. మెగ్నీషియం : 79 మిగ్రా ఐరన్: 2.7 మి.గ్రా ఉంటాయి.

ఇవి పోషకాల పవర్ హౌస్‌లాంటివి అని చెప్పవచ్చు. ఆకుకూరలు రోజువారీ ఆహారంలో పిల్లలు: 50 గ్రా రోజుకి 1/2 1 కప్పు ఆకుకూరలు మితంగా తీసుకుంటే మంచిది.

ఆకుకూరల్లోని పోషక ప్రయోజనాలు : ఆకుకూరల్లోని మినరల్స్ విటమిన్స్ పోషణకు జీవక్రియలకి శరీర అవయవాల ఎదుగుదలకి, పనితీరుకి అవసరం. దీని వల్ల పోషణ లోపం, విటమిన్ల లోపాలు ఏర్పడవు. కాబట్టి పిల్లలు, పెద్దలు రోజూ ఆకుకూరల్ని మితంగా తీనడం మంచిది. ఆకుకూరల్లోని ఎసెన్షియల్ మైక్రోన్యూట్రిమెంట్స్ అయిన బీటా కెరోటిన్, ట్యాటిన్, జియాంకినసతిన్, బయోటిన్ మొదలైన వాటివల్ల కణాల డ్యామేజిని ఆరికట్టి కన్ను, జుట్టు, చర్మం ఆరోగ్యాన్ని కాపాడుతుంది. కెరోటినాయిడ్స్ రక్షణ కవచాలుగా పని చేసి నీలికాంతి యు.వి. కిరణాల ద్వారా కలిగే నష్టాన్ని తగ్గిస్తాయి. దాంతో ఇవి నేచురల్ సన్‌స్క్రీన్స్‌గా పనిచేస్తాయి. ఆకుకూరల్లోని పీచుపదార్థం ఐరన్ ఎక్కువగా ఉండడం వల్ల ఆకలికి, ఆహారం అరుగుదలకి, జీర్ణక్రియ కార్యకలాపాలకి పోషణకి ఉపయోగపడతాయి. దీనివల్ల ఇవి జీర్ణకోశవ్యాధుల నివారణకి, మలబద్ధకం లేకుండా విరేచనం సాఫీగా జరిగేలా చేస్తాయి. ఇది హెల్త్‌కి మంచిది. ఇవి మంచి చెడు బ్యాక్టీరియాని బ్యాలెన్స్ చేస్తాయి. ఇవి ఎర్రరక్తకణాల తయారీకి, శరీరం అంతటా అవసరమైన పోషకాల్ని రవాణా చేయడంలో సహాయపడతాయి. ఆకుకూరల్లో తక్కువ కేలరీలుండి అవసరమైన అనేక విటమిన్స్ (పోలేట్, ఐరన్), మినరల్స్ వల్ల స్త్రీలలో రక్తహీనతని తగ్గించి, గర్భధారణ అవకాశాల్ని పెంచుతాయి. అండోత్పత్తిని పెంపొందిస్తాయి. ఇవి గర్భిణీల ఆరోగ్యానికి మంచివి. ఇవి శిశువుల్లో పుట్టుకతో వచ్చే లోపాల్ని నివారిస్తాయి. దీంతో ఇవి తల్లిబిడ్డల ఆరోగ్యానికి, బాలింతలకి పథ్యంగా, పాలుపడానిక సహాయపడతాయి. ఆకుకూరల్లోని కేలరీలు మనలో అలసట, నీరసం, తరచు అంటువ్యాధులు రావడం, సీక్‌కావడం ఉంటే ఎనర్జీ బూస్టర్స్‌గా పనిచేస్తూ మీ శక్తి స్థాయిల్ని పెంపొందించుతాయి. స్ట్రెస్‌ని తగ్గించి, ఏకాగ్రత, జ్ఞపకశక్తిని పెంచి మెదడు పనీతీరుని, నరాల పని తీరుని మెరుగుపరుస్తాయి. ఎందు కంటే వీటలో హ్యాపీ హార్మోన్స్‌ని పెంచే ఫోలేట్స్, మెగ్నీషియం, కాపర్, బికాంప్లెక్స్ విటమిన్లు, ఖనిజాలుంటాయి. ఆకుకూరల్లోని కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం, మాంగనీస్‌లు ఖనిజాలు దంతాలు గోర్లు, ఎముకల పెరుగుదలకి, ఆరోగ్యానికి ఉపయోగపడ తాయి. వీటిలో ఎముకల బలాన్ని పెంచి, ఎముకల సాంద్రతని మెరుగుపర్చడానికి అవ సరమైన ఆస్టియోకాల్సిన్ ఉత్పత్తికి అవసరమైన విటమిన్ కె, పొటాషి యం ఎక్కువగా ఉంటుంది. ఆకు కూరల్లో రోగనిరోధకశక్తిని పెంచే టి కణాల్ని పెంపొందించే విటమిన్ సి, ఆంటీ ఆక్సిడెంట్స్ ఉండడం వల్ల మనల్ని అంటువ్యాధుల బారిన పడకుండా, ఆటోఇమ్యూన్ వ్యాధుల్ని తగ్గించి వేసే శక్తి ఉంది. ఆకు కూరల్లోని ఆంటి ఆక్సిడెంట్స్, కెరో టినాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్ వల్ల ఇండోల్స్, సల్ఫోరాఫెన్ ఐసోథియో సైనేట్స్ వంటి కేన్సర్ పోరాట సమ్మేళనాలు ఆంటికేన్సర్ ఏజెంట్స్ గా కడుపు, ప్రేవులు, చర్మం, రొమ్ము కేన్సర్లతో పోరాడు తాయి. ఆకుకూర ల్లోని గ్లూకోథయినిన్ వంటి రసాయ నిక సమ్మేళనాల వల్ల డీటా క్సిఫైర్ గా రక్తంలోని టాక్సిన్స్‌ని, ఫ్రీరాడికల్స్‌ని తగ్గించి కాలేయం, రక్తశుద్ధికి ఉపయోగపడుతుంది.

# కొన్ని జ్ఞాపకాలు వదిలేయాలి.!

**ఉదయం లేచింది మొదలు...** మళ్లీ నిద్రపోయే వరకూ ఎన్ని విషయాలు తారస పడతాయో. అన్నింటితోనూ ఎమోషనల్‌గా కనెక్ట్ అయి ఉంటారు అమ్మాయిలు అవి వస్తువులైనా, మనుషులైనా మరి ఇష్టాన్ని పెంచుకోవడం మాత్రమే తెలుసుకుంటే ఎలా? అవసరం అయినప్పుడు వాటిని వదిలేయడమూ తెలియాలి... అప్పుడే మానసిక సమస్యలు దరిచేరవు. దీన్నే ఇప్పుడు పూప్ రూల్ గా చెబుతున్నారు.



✦ జ్ఞాపకాలను పదిలం చేసుకోవడంలో మనకు మనమే సాటి. ఊహ తెలిశాక జడకు వేసుకున్న రిబ్బన్ నుంచీ నిన్న మొన్న మనకు నచ్చిన రబ్బర్ బ్యాండ్ అంతా మనకు అపురూపమే... ఇవేనా... గ్రీటింగ్ కార్డులు, బొమ్మలు, నచ్చిన బట్టలు, బాక్సులు, పుస్తకాలు తరచి చూస్తే... ఒక్కో దానితో ఒక్కో అనుభవం... అవే జ్ఞాపకాలుగా దాచుకుంటాం. కానీ వీటన్నింటి వల్లా వార్డ్‌రోబ్ నిండిపోతుంది. రూమ్ సర్దిన ప్రతిసారి వాటిని పంపించి అనుకుంటాం అవి ఇచ్చిన అనుభూతులు గుర్తొచ్చి పడేయలేం. అవన్నీ బాగుంటే పర్లేదు. కానీ, వాటిల్లో కొన్ని చెదలు పడుతుంటాయి. అయినా వాటిని పడేయడానికి మనసు రాదు మనకు. మిగిలినవి పాడవకూడదు అంటే ఈ కొన్నింటిని తీసేయాల్సిందే.

✦ కొందరమ్మాయిలు తొందరగా ఎవ్వరినీ నమ్మలేరు. స్నేహమైనా, ప్రేమైనా ఒకసారి నమ్మిన జీవితాంతం కొనసాగించాలనుకుంటారు. అవతలి వ్యక్తి అదే ఉద్దేశంతో ఉంటే ఫర్వాలేదు. కానీ, అలా లేకుంటేనే సమస్యంతా. వాళ్ల నడవడిక, మాటతీరు అన్నింట్లోనూ తేడా వస్తుంది. అన్నీ తట్టుకుని నిలబడటం ఆషామాషీ కాదు. అయినా నెమ్మదిగా అలవాటు చేసుకుని అలాంటి వారిని దూరం పెట్టమంటోంది.

✦ రోజూ మనం వాడే షూ, చెప్పులు, ఇంట్లో వస్తువులు ఇలా అవసరమైనవి చాలానే ఉంటాయి. వాటివల్ల మిగిలినవి పాడవుతున్నాయి అనిపిస్తే వాటిని వదిలేయడమే మేలంటోంది 'పూప్ రూల్'. □

# వాల్మీకి మదిలో..

ఆధ్యాత్మికం



**వాల్మీకి మహర్షికి తన** ఆరాధ్య దైవమైన శ్రీరామచంద్రుడిపై ఎంత పూజ్యభావమో ఆ అవతారపురుషుడు ఆవిర్భవించిన అయోధ్య అంటే కూడా అంతే ఆరాధనా భావం. అందుకే తన రామాయణ బాలకాండలో ఆ నగరాన్ని అమోఘంగా కీర్తించాడు. ప్రజారంజకరమైన పాలనకే కాదు పారమార్థిక చింతనకు కూడా నెలవైన ఆ నగరం సనాతన భారతీయ సాంస్కృతిక సందపకు పెట్టని కోటలాంటిది. ఆ భావనతోనే వాల్మీకి మహర్షి 'యోద్ధుం అశక్యా ఇతి అయోధ్య.. జయించటానికి వీలు కానిది అయోధ్య' అని శ్లాఘించాడు. అంతేకాదు తన అంతరంగాన్నే అయోధ్యగా చేసుకుని ఆ ఆజాను బాహుణ్ణి అందులో ప్రాణప్రతిష్ఠ చేసుకున్నాడు. రామాయణ కాలం ప్రకారం అయోధ్య పొడవు 12, వెడల్పు 3 యోజనాలు. అప్పట్లో దాదాపు 7 వేల కిలోమీటర్లు. వాల్మీకి అయోధ్యను రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, ఇలా అన్ని రంగాల్లోనూ ఆదర్శప్రాయం అంటూ అభివర్ణించాడు. కేవలం శ్రీరాముణ్ణి, ఆయన అవతరించిన అయోధ్యను ఆరాధించటమే కాదు.. ఆ గుణగణాలను అనుసరించటం ప్రధానమని చెప్పకనే చెప్పాడు. భౌగోళికంగా కాదు భక్తిభావంతో అయోధ్యను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలి. అప్పుడే దర్శనభాగ్యం లభిస్తుందంటారు తాత్త్వికులు. □

# ఇంటి కాలుష్య నివారణ కోసం..

**కాలుష్యం ఇప్పుడు బయట కాదు. ఇంట్లోనే తిష్ట వేస్తుందంటున్నారు శాస్త్రవేత్తలు. గ్యాస్ స్టవ్, ఫర్నిచర్, కార్పెట్, ఎయిర్ కండిషనర్, ఫ్రిజ్, పెయింట్లు.. ఇవన్నీ కాలుష్యాన్ని వెద జల్లుతున్నాయని చెబుతున్నాయి.**

కొన్ని నగరాల్లోనైతే బయటికన్నా ఇంట్లో ఐదురెట్లు ఎక్కువగా కలుష్యం ఉంటోందట. జలుబూ దగ్గుల నుంచీ ఉబ్బసం దాకా పలు సమస్యలకి ఇది దారితీస్తోందట. వీటికి విరుగుడుగా కొందరు ఇళ్లలోనే ఎయిర్ ప్యూరిఫయర్‌లుకొంటున్నారుకానీ. ఓ చిన్న మొక్కనే అలా ఎయిర్ ప్యూరిఫయర్‌గా మారిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చింది. యూనివర్సిటీ ఆఫ్ ప్యారిస్‌కి చెందిన పరిశోధకులకి. ఇందుకోసం ఓ మనీప్లాంట్‌ని ఎంచుకుని దానికి జన్యుమార్పు చేశారు. మనకి మంచి చేసే బ్యాక్టీరియాకి ఆశ్రయమిచ్చేలా ఆ మొక్కని మార్చారు. ఆ బ్యాక్టీరియా గాలిని కాలుష్య కారకాల్ని తింటూనే బతుకు తాయట. అలా మామూలు మొక్కకన్నా వెయ్యిరెట్లు ఎక్కువగా కాలుష్యాన్ని పీల్చి గాలిని శుభ్రం చేస్తాయన్నమాట.



ప్యారిస్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ మొక్కని ఆవిష్కరించడంతోనే ఊరుకోలేదు. దానితో నియోప్లాంట్స్ అనే స్టార్టప్‌ని పెట్టి అలాంటి మొక్కల్ని విక్రయిస్తున్నారు కూడా ! □

# మళ్లీ టి20 ఛాంపియన్స్ లీగ్

## • టైటిల్ విన్నర్స్ జట్ల మధ్య బిగ్ ఫైట్ • రాయల్ ఛాలెంజర్స్‌కు మరో ఛాన్స్





**న్యూఢిల్లీ:** ఐపిఎల్ సక్సెస్ తరువాత దాదాపు ప్రతి దేశం ఈ లీగ్స్‌ని జరుపుతున్నాయి. ప్రస్తుతం ఇంటర్నేషనల్ లీగ్స్ ఏకంగా 25పైనే ఉన్నాయి. అయితే ఒకప్పుడు టి20 ఛాంపియన్స్ లీగ్ ఉండేది. అది కేవలం ఐపిఎల్, బిగ్‌బాష్ లీగ్, ఇంగ్లాండ్ కౌంటీల్లో టాప్ 2 టీమ్స్ అంటే విన్నర్, రన్నర్స్ మాత్రమే ఆడేవి. ఇలా టి20 లీగుల్లో టాప్ 2 టీమ్స్ ఆడేవి. మొదట 2009లో ప్రారంభమైన చాంపియన్స్ లీగ్, 2014 వరకు నడిచింది. అయితే 2015లో టెలివిజన్ రేటింగులు తక్కువగా ఉండటం, స్పాన్సర్‌షిప్ స్ట్రగుల్స్ కారణంగా ఈ లీగ్‌ను రద్దు చేశారు. ఇక ఈ లీగ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ రెండు టైటిళ్లతో అత్యంత విజయవంతమైన జట్లుగాకూడా నిలిచాయి. ఆ తర్వాత ఈలీగ్‌ను నిర్వహించటం ఆపేశారు. చివరగా ఈ లీగ్ 2014లో జరిగింది. అయితే ఇప్పుడు ఇదే లీగ్ మళ్లీ నిర్వహించటానికి ప్లాన్ చేస్తున్నారు. వరల్డ్ క్లబ్ టి20 ఛాంపియన్‌షిప్ పేరిట ఒకలీగ్‌ను 2026 నుంచి నిర్వహించబో తున్నారు. ఇందులో ఐపిఎల్, బిగ్ బాష్ లీగ్, పాకిస్థాన్ సూపర్ లీగ్, ది హండ్రెడ్, ఎస్ఎ టి20 లీగ్స్‌లో ఛాంపియన్స్‌గా నిలిచినజట్లు తలపడతాయి. ఇలా ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్ 20 లీగ్స్ నుంచి టైటిల్ విన్నర్ జట్లను తీసుకుంటారు. వారందరూ ఇక్కడ మరోసారి తలపడతారు. ఇంగ్లాండ్ ఇకపై హండ్రెడ్ లీగ్‌లో విన్నర్‌గా నిలిచిన జట్టునే పంపనుంది. అంతకు ముందు ఛాంపియన్స్‌లీగ్ ట్రైంలో టి20 బ్లాస్ట్ టైటిల్ విన్నర్ జట్టునే పంపేవారు. అయితే ఇప్పుడు ఆ జట్లను కాకుండా హండ్రెడ్ లీగ్ టైటిల్ విజేతను పంపనున్నట్లు తెలుస్తోంది. ఈ టోర్నీ ఖాయమైతే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు-పాకిస్థాన్ సూపర్ లీగ్ (పిఎస్ఎల్) విజేత లాహోర్ ఖలందర్స్ తలపడే ఛాన్స్ ఉంటుంది. ఐపిఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు జట్టు మొదటిసారిగా ఛాంపియన్స్‌గా అవతరించగా, పిఎస్ఎల్ 2025 విజేతగా లాహోర్ ఖలందర్స్ నిలిచింది. ఈ క్రమంలో ఈ మ్యాచ్ సైతం భారత్ పాకిస్థాన్ లెవెల్‌లో క్రేజ్ సాధించే ఛాన్స్ ఉంది. రాయల్‌ఛాలెంజర్స్ నుంచి విరాట్ కోహ్లీ, పెషావర్ నుంచి అజాం బాబర్ మధ్య తగ్గ పోటీ ఖాయం. ఈ మ్యాచ్‌తో టోర్నమెంట్ క్రేజ్, రెవెన్యూ, స్పాన్సర్లు కూడా అమాతం పెరుగుతారు. మొత్తం టోర్నీలోనే అత్యధిక రెవెన్యూ జనరేట్ చేసే మ్యాచ్ ఇదే అవుతుందనడంలో సందేహం లేదు.



## సూపర్ యునైటెడ్ రాపిడ్ బ్లిట్జ్‌లో..

# గుకేష్ సంచలన విజయం

### వరల్డ్ నెంబర్ 1 కార్ల్‌సెన్ ఓటమి

**న్యూఢిల్లీ:** సూపర్ యునైటెడ్ రాపిడ్ బ్లిట్జ్-2025 టోర్నమెంట్‌లో భారత్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ ప్రపంచ నెంబర్ 1ను ఓడించి సంచలన విజయం సాధించాడు. రెండు రోజుల రాపిడ్ తర్వాత గుకేష్ వరుసగా ఐదు విజయాలు నమోదు చేసి పోటీలో ముందంజ వేశాడు. ఈ చెస్ టోర్నమెంట్ ఆరో రౌండ్‌లో ప్రపంచ ఛాంపియన్ గుకేష్ తన ప్రత్యర్థి ప్రపంచ నంబర్ 1 మరియు ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్‌పై ఘన విజయం సాధించాడు. ఈ సంవత్సరం ప్రారంభంలో నార్వే చెస్‌లో క్లాసికల్ విజయం తర్వాత మాగ్నస్‌పై గుకేష్ సాధించిన రెండవ వరుస విజయం ఇది. ఈ విజయం ఆరు రాపిడ్ రౌండ్ల తర్వాత 10 పాయింట్లతో లీడర్‌బోర్డ్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. ఈ ఈవెంట్‌లో గుకేష్ వరుసగా ఐదు మ్యాచ్‌ల విజయాల పరంపరను కొనసాగిస్తున్నాడు. రెండవ రోజు త్రీ ఫర్ త్రీ తో సహా, ఇది మూడు చివరి రౌండ్లతో ర్యాపిడ్ సెగ్మెంట్‌ను గెలుచుకునేందుకు తన స్థానాన్ని బలపరుస్తుంది. గుకేష్ తదుపరి చివరి మూడు రాపిడ్ మ్యాచ్‌లలో నెదర్లాండ్స్‌కు చెందిన అనిష్ గిరి, క్రొయేషియాకు చెందిన ఇవాన్ సారిక్, ఆపై అమెరికాకుచెందిన వెస్లీ సోతో తలపడతాడు. లీడర్ బోర్డ్‌లో తన 2 పాయింట్ల ఆధిక్యాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో గుకేష్ వ్యూహాత్మకంగా ప్రత్యర్థులను ఇరుకున పెట్టాలని భావిస్తున్నాడు. మరోవైపు ఆర్ ప్రజ్ఞానంద డ్రా ల పరంపర కొనసాగుతోంది. ఆరు రౌండ్లలో ఐదు డ్రాలతో, ఐదవ రౌండ్‌లో మాగ్నస్ కార్ల్‌సెన్‌తో జరిగిన మ్యాచ్‌తో సహా, 5 పాయింట్లతో అతను ఏడవ స్థానంలోనిలిచాడు. అతను ఇంకా ఈటోర్నమెంట్‌లో తన తొలివిజయాన్ని నమోదు చేసుకోలేదు.

## ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో..

# మెక్సికో విజయం

### 1-0 తేడాతో హోండురాస్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో మెక్సికో సూపర్ విజయంసాధించింది. రౌల్ జిమెనెజ్ 50వ నిమిషంలో 16ఏళ్ల గిల్బర్టో మోరా సహాయంతో గోల్‌చేశాడు. దీంతో మెక్సికో శుక్రవారం హోండురాస్‌పై 1-0 తేడాతో విజయం సాధించి 12వ గోల్డ్ కప్ ఫైనల్‌కు చేరుకుంది. రెండవ అర్ధభాగం ప్రారంభంలో అలెక్సిస్‌వేగా బాక్స్ పైభాగంలో మోరాకు పాస్ ఇవ్వడంద్వారా ప్రారంభించిన ఆటతో మెక్సికో విజయం సాధించింది. అతను తన కెరీర్‌లో ఎడ్రిక్ మెంజివర్‌ను ఓడించి తన 42వ అంతర్జాతీయ గోల్‌ను నమోదు చేశాడు. కొన్ని నిమిషాల తర్వాత 17వ ర్యాంక్‌లో ఉన్నమెక్సికో ఆధిక్యాన్ని పెంచుకుంది, ఎడ్సన్ అల్వారెజ్ సెట్‌పీస్‌లో గోల్ కొట్టాడు, కానీ వీడియో రివ్యూలో అతను ఆఫ్‌సైడ్ అని తేలిన తర్వాత అది తిరస్కరించబడింది. గత రెండు ఆటల్లో గోల్ వైపు ఎటువంటి షాట్‌లను ఎదుర్కోకపోవడంతో, మెక్సికన్ గోలీ లూయిస్ మలగాన్ బాక్స్ వెలుపల నుండి డిక్సన్ రామిరెజ్ కొట్టినషాట్‌నుసులభంగా సేవ్‌చేశాడు. ఆట చివరిలో ఎల్ ట్రైస్‌కు రెండు మంచి ఛాన్స్ దక్కాయి.

## వెస్టిండీస్ రెండో టెస్టులో..

# ఆస్ట్రేలియా 286 రన్స్‌కు ఆలౌట్



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో ప్రారంభమైన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 286 పరుగులకు ఆలౌట్ అయింది. గ్రెనడాలోని నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండో టెస్ట్‌లో మొదటిరోజు ఆస్ట్రేలియన్ టాప్‌ఆర్డర్‌ను వెస్టిండీస్ పేసర్లు చిత్తు చేశారు, కానీ లోయర్ ఆర్డర్ సహకారం పాట్ కమ్మిన్స్ జట్టును 286 పరుగులకు ఆలౌట్ చేయడంలో సహాయపడింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియా, టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు సామ్ కాన్‌స్టాస్ మరియు ఉస్మాన్ ఖవాజా మొదటి 11 ఓవర్లలో 47 పరుగులు జోడించారు, కానీ వెస్టిండీస్ తిరిగి పుంజుకుని పర్యాటక జట్టును 50/3కి తగ్గించింది. ట్రావిస్ హెడ్ మరియు కామెరాన్ గ్రీన్ కలిసి జట్టును ఎదురుదాడి చేసి 61 బంతుల్లో 43 పరుగులు జోడించారు. అయితే, లంచ్ సమయానికి ట్రావిస్ హెడ్ 37బంతుల్లో 26 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. మొదటి సెషన్‌లో ఆస్ట్రేలియా నాలుగు కంటే ఎక్కువ పరుగుల రేటుతో స్కోరు చేసింది, కానీ నాలుగు వికెట్లు కూడా కోల్పోయింది. ఆస్ట్రేలియా జట్టులో 110 పరుగులకే కోల్పోయిన తర్వాత బ్యూ వెబ్‌స్టర్ మరియు అలెక్స్ కారీ 150 బంతుల్లో 112 పరుగుల కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ భాగస్వామ్యం కేవలం 150 బంతుల్లోనే 112 పరుగులు చేసింది. జస్టిన్ గ్రీవ్స్ కేవలం 81 బంతుల్లో 10 ఫోర్లు మరియు ఒకే ఒక సిక్సర్‌తో 63 పరుగులు చేశాడు. దీనితర్వాత, పాట్ కమ్మిన్స్ 20బంతుల్లో 17 పరుగులు చేసి వెస్టిండీస్ బౌలర్లను నిరాశపరిచాడు. విండీస్ ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌ను త్వరగా ముగించాలని చూస్తుండగా, మిచెల్ స్టార్క్ ఆరు పరుగులు చేసి నిష్క్రమించాడు. వెబ్‌స్టర్ 115 బంతుల్లో 60 పరుగులు చేసి ఘన విజయం సాధించి దురదృష్టవశాత్తు రనౌట్ అయ్యాడు. నాథన్ లియాన్ మరియు జోష్ హేజిల్‌వుడ్ మధ్య చివరి వికెట్ భాగస్వామ్యం 16 బంతుల్లో 19 పరుగులు జోడించింది, చివరికి ఆస్ట్రేలియా 66.5ఓవర్లలో 286 పరుగులకు ఆలౌట్ అయింది. వెస్టిండీస్ బౌలర్లలో అల్జారి జోసెఫ్ నాలుగు వికెట్లు పడగొట్టాడు.

# వింబుల్డన్ టోర్నీలో పావోలిని ఓటమి



**న్యూఢిల్లీ:** ఇప్పటికే రెండో సీడ్ కోకో గాఫ్, మూడో సెజ్సికా పెగూలా, ఐదో సీడ్ కిన్‌వెన్ జెంగ్, తొమ్మిదో సీడ్ పౌలా బదోసా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా, తాజాగా వీరి సరసన గత ఏడాది రన్నరప్, నాలుగో సీడ్ జాస్మిన్ పావోలిని చేరింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో రష్యాకు చెందిన ప్రపంచ 80వ ర్యాంకర్, అన్‌సీడెడ్ కామిలా రఖీమోవా అద్భుత ఆటతో పావోలిని ఆటకట్టించి మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. కామిలా రఖీమోవా 4-6, 6-4, 6-4 తేడాతో ప్రపంచ ఐదో ర్యాంకర్, నాలుగో సీడ్ పావోలినిపై సంచలన విజయం సాధించింది. తద్వారా తన కెరీర్‌లో మూడోసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మూడో రౌండ్‌కు చేరుకుంది. గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో స్వియాటెక్ చేతిలో వింబుల్డన్ టోర్నీ ఫైనల్లో క్రెజికోవా చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచిన పావోలిని ఈ ఏడాది మాత్రం ఆవించిన స్థాయిలో రాణించలేకపోయింది. రఖీమోవాతో జరిగిన పోరులో తొలి సెట్‌ను నెగ్గిన పావోలిని ఆ తర్వాత తడబడింది. 2 గంటల 19 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో పావోలిని 40 అనవసర తప్పిదాలు చేసి, 23 విన్నర్స్ కొట్టింది. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. రఖీమోవా 26 విన్నర్స్ కొట్టింది. నెట్ వద్దకు 12 సార్లు దూసుకొచ్చి ఎనిమిదిసార్లు పాయింట్లు గెలిచింది. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రెజికోవా మాజీ నంబర్ వన్, జపాన్‌కు చెందిన నయోమి ఒసాకా, ఏడో సీడ్, రష్యాకు చెందిన మిరా అంద్రీవా, ఎనిమిదో సీడ్, పోలెండ్‌కు చెందిన ఇగా స్వియాటెక్, మాజీ ఛాంపియన్, కజకిస్తాన్‌కు చెందిన రిబాకినా, పదో సీడ్, అమెరికాకు చెందిన ఎమ్మా నవారో మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

# యుఎస్ సంస్థ జేన్‌స్ట్రీట్‌పై సెబి మార్కెట్ బ్యాన్!


### రూ.4844 కోట్లకు లెక్కలు చెప్పాలని ఉత్తర్వులు

**ముంబై,జూలై 4:** అమెరికా ట్రేడింగ్ సంస్థ జేన్‌స్ట్రీట్‌ను మార్కెట్లలో పాల్గొనేందుకు సెబి నిషేధం విధించింది. అమెరికా ట్రేడింగ్ సంస్థ అయిన జేన్‌స్ట్రీట్ అత్యాధునిక విశ్లేషణలు తీసుకుని దేశీయ సెక్యూరిటీ మార్కెట్లను తన పరిధిలోకి తీసుకుని మార్కెట్లలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన సెబి తాత్కాలికంగా నిషేధించాలని ఆదేశాలు జారీచేసింది. చట్టవ్యతిరేకంగా 4844 కోట్ల మేర నిధులు దుర్వినియోగం చేసిందని సెబి ప్రకటించింది. అక్రమంగా సంపాదించినట్లుగా నిర్ధారణ అయిన ఈ సొమ్ముకు ఆధారాలు చూపించేంతవరకూ జేన్‌స్ట్రీట్‌పై నిషేధం కొనసాగుతుందని సెబి ప్రకటించింది. ఇకపై స్టాక్ మార్కెట్లు కూడా జెఎస్‌గ్రూప్ లావాదేవీలు కార్యకలాపాలను నిశితంగా గమనించాలని ఉత్తర్వులు జారీచేసింది. ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఎలాంటి మార్కెట్ లావాదేవీల్లో జెఎస్‌గ్రూప్ పాల్గొనేందుకు వీలులేదని సెబి తన 105 పేజీల ఉత్తర్వుల్లో వెల్లడించింది. సెబి పూర్తికాలపు సభ్యులు అనంత్‌నారాయణ్ ఈ ఉత్తర్వులు జారీచేసారు. జెఎస్‌గ్రూప్ ఆప్షన్స్ విభాగంలో భారీ పొజిషన్లు తీసుకుంటున్నది. తర్వాత స్టాక్ మార్కెట్లను ప్రభావితంచేసేవిధంగా ఈ పొజిషన్లు తీసుకుంటున్నట్లు తేలింది. వారం సూచీ ఆప్షన్, పరిమితి ముగుసునతన్న రోజులను చూసి నగదు, ఫ్యూచర్ మార్కెట్లలో చెప్పుకోదగిన సంఖ్యలో ప్రభావితంచేసేవిధంగా లావాదేవీలున్నట్లు సెబి గుర్తించింది. స్టాక్‌సూచీల స్థాయిలను తారుమారు చేయడం ద్వారా భారీ లాభాలను ఆర్జించినట్లు సెబి తన విచారణ నివేదికలో పేర్కొంది. 12 బ్యాంకు నిఫ్టీ స్టాక్స్‌కొనుగోలు ద్వారా ఈ లావాదేవీలునిర్వహించింది. భారీ కొనుగోళ్లుచేసి ఈ స్టాక్‌పై ప్రభావం చూపించింది. తద్వారా ఇతర ట్రేడర్లు కూడా భారీ కొనుగోళ్లు చేయడంద్వారా లాభాలను ఆర్జించినట్లు తెలుస్తోంది. జేన్‌స్ట్రీట్‌గ్రూప్ నిబంధనలకు విరుద్ధంగా అత్యధికసంఖ్యలో కొనుగోలు ఆర్డర్లు ఇచ్చింది. బ్యాంకు నిఫ్టీ సంబంధిత స్టాక్స్‌లోనగదు, ఫ్యూచర్ సెగ్మెంట్లలో కూడా ఇదేవిధంగా ఆర్డర్లు ఇచ్చినట్లు సెబి తన నివేదికలో వెల్లడించింది. దీనివల్ల స్టాక్‌ధరలు గణనీయంగా పెరిగిపోతాయన్నారు. పిఎఫ్‌యుటిపి నిబంధనలను ఉల్లంఘించి ట్రేడింగ్‌లో అవకతవకలకు పాల్పడిందని సెబి తన నివేదికలోప ఒందుపరిచింది. జనవరి 2023 నుంచి 2025 మార్చి మధ్యకాలంలోజేన్‌స్ట్రీట్ సుమారు 44,358 కోట్లు ఆర్జించింది. స్టాక్ ఫ్యూచర్స్‌లో 7208కోట్లు నష్టపోయింది. 191కోట్లుసూచీ ఫ్యూచర్స్‌లోను నగదు విభాగంలో 288 కోట్లు నష్టపోయి నట్లు తేలింది. మొత్తంగాచూస్తే 36,671 కోట్లు లాభపడిందని, ఇదంతా కూడా తన వద్ద ఉన్న అధునాతన టెక్నాలజీని ఉపయోగించి సూచీలను తన అధీనంలోకి తీసుకోవడం ద్వారా నియమవిరుద్ధంగా లావాదేవీలు సాగించి అనుచిత లబ్దిని పొందిందని సెబి ప్రస్తావించింది.




# నిధుల సమీకరణలో ఫిన్‌టెక్ స్టార్టప్‌లు టాప్!

**ముంబై, జూలై 4:** భారత్ ఆర్థికరంగంలో ఫిన్‌టెక్ స్టార్టప్ నిధులసమీకరణ ప్రపంచంలోనే మూడోస్థానంలో నిలిచింది. 2025 మొదటి ఆరునెలల్లో అమెరికా, బ్రిటన్‌ల తర్వాత భారత్ ఫిన్‌టెక్ స్టార్టప్‌లు భారీ నిధులు సమీకరించాయి. మొత్తం 889 మిలియన్ డాలర్ల నిధులు సమీకరించినట్లు ట్రాక్షన్ జియో సెమీ యాన్యువల్ ఇండియా ఫిన్‌టెక్ రిపోర్టు ప్రస్తావించింది. అయితే 2024 రెండో అర్థభాగంలో 1.2 బిలియన్ డాలర్లతో పోలిస్తే 26శాతం క్షీణించింది. గత ఏడాది ఆరునెలల కాలంతో చూసినా ఐదుశాతం తగ్గినట్లు సర్వేలో తేలింది. ఇతర దేశాల్లో కూడా అదే స్థాయిలో నిధుల సమీకరణ ఉండటంతో 2025 మొదటి అర్థభాగంలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. 2024 రెండో అర్థభాగంలో 10శాతంపెరిగి 361 మిలియన్ డాలర్లకు చేరింది. అలాగే గత ఏడాది మొదటి అర్థభాగంతో పోలిస్తే 9శాతం పెరుగుదల నమోదు చేసినట్లు ట్రాక్షన్ జియో సర్వేలో తేలింది. సీడ్‌స్టేజ్ పెట్టుబడులపరంగా చూస్తే మందగించాయి. 91.2 మిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నట్లు తేలింది. గత ఏడాది అర్థభాగంతోపోలిస్తే 27శాతం మందగించినట్లు తేలింది. ట్రాక్షన్ జియో సహవ్యవస్థాపకులు నేహా సింగ్ మాట్లాడుతూ ఇన్వెస్టర్ల సెంటిమెంట్ మాత్రం బలంగా ఉందని కొత్తకొత్త సృజనాత్మక ఆవిష్కరణలవైపు ఇన్వెస్టర్లు ఫోకస్ పెడుతున్నట్లు తేల్చారు. ఇక విలీనాలు, కొనుగోళ్ల (ఎంఅండ్ఎ) పరంగాచూస్తే మొదటి అర్థసంవత్సరంలో 16 డీల్స్ జరిగాయి. 2025 మొదటి ఆరునెలల్లో గత ఏడాదితోపోలిస్తే 45శాతం పెరిగాయి. కీలక లావాదేవీలు పరంగాచూస్తే గ్రోసంస్థ 150 మిలియన్ డాలర్ల ఫిన్‌డమ్, ఇన్‌క్రెడ్‌మనీ సంస్థలను 35 మిలియన్ డాలర్లతో స్టాకో డీల్ వంటివి ముఖ్యంగా చెప్పుకోవచ్చు. మొదటి అర్థభాగంలో కేవలం ఒకే ఒక్కయూనికార్న్ వచ్చింది. ఇక రెండో అర్థభాగంలో గత ఏడాది ఒక్క యూనికార్న్ కూడా నిధుల సమీకరణలో అంచనాలను అధిగమించలేకపోయింది.



# ఎన్ఎస్ఇ ఐపిఒ వస్తే దమానీకి రికార్డులే!

**ముంబై, జులై 4:** నేషనల్ స్టాక్ ఎక్స్చేంజీ (ఎన్ఎస్ఈ) పబ్లిక్ ఇష్యూకు వస్తే.. ప్రముఖ మదుపరి, డీమార్ట్ అధినేత రాధా కిషన్ దమానీకి లాభాలపంటే!. ఎందుకంటే ఎన్ఎస్ఈలో దమానీకి 1.58శాతం (3.91 కోట్ల షేర్లు) వాటా ఉంది. 2020 జనవరి మార్చిలో విదేశీ పెట్టుబడిదారు నార్వెస్ట్ వెంచర్ పార్ట్‌నర్స్ నుంచి ఈ వాటాను దమానీ కొనుగోలు చేశారు. ఎన్ఎస్ఈ షేర్ల విలువ ఎం? ఎన్ఎస్ఈ షేరు ఎక్స్చేంజీల్లో నమోదు కాలేదు. అయితే అన్‌లిస్టెడ్ షేరు ధర ఒక్కోటి రూ.2,389 పలుకుతోంది. ఫలితంగా దమానీ దగ్గర ఉన్న ఎన్ఎస్ఈ షేర్ల నికర విలువే రూ.9,341 కోట్లు అవుతుంది. కాగా.. ఎంతో కాలంగా ఐపీఓకు వచ్చేందుకు, సెబీ అనుమతుల కోసం ఎన్ఎస్ఈ వేచిచూస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ కల నెరవేరుతుందని భావిస్తున్నారు. దమానీ వాటా విక్రయిస్తారా? సాధారణంగా పెద్ద సంస్థలు ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేప్పుడు, ఆఫర్ ఫర్ సేల్ కింద ప్రమోటర్లు - ప్రస్తుత వాటాదార్లు కొంత వాటాలు విక్రయించి, ప్రయోజనం పొందుతారు. ఎన్ఎస్ఈ ఐపీఓలో దమానీ తన వాటా షేర్లను విక్రయిస్తారా? లేదంటే కొనసాగిస్తారా? అనే దానిపై స్పష్టత లేదు. విక్రయిస్తే మాత్రం, ఆయన తన పెట్టుబడిపై గణనీయ ప్రతిఫలాన్ని పొందుతారనేది మార్కెట్ వర్గాల విశ్లేషణ. పెద్ద కంపెనీలు ఐపీఓ సమయంలో ద్వారా ప్రమోటర్లు, వృద్ధి చెందిన వాటాదారులు షేర్లు విక్రయిస్తారు.




# వాణిజ్యం

# భారత్‌లో తొలి యుపిఐ బ్యాంకు

**ముంబై, జులై 4:** ఈ రోజుల్లో టెక్నాలజీ పెరిగిపోయింది. ఒకప్పుడు బ్యాంకులకు వెళ్లి పనులు చేసుకునే వారు నేడు ఇంట్లోనే ఉండి అన్ని పనులు చేసుకునే టెక్నాలజీ వచ్చేసింది. ఇక ప్రస్తుతం ఆన్‌లైన్ చెల్లింపుల పద్ధతుల్లో సులభమైన మార్గాలు వచ్చాయి. దేశంలో యూపీఐ వ్యవస్థ ఎంతగానో విస్తరించింది. ప్రతి రోజు కోట్లాది రూపాయలు యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయి. దేశంలో యూపీఐ సేవలు వచ్చిన తర్వాత మరింత సులభం అయిపోయింది. ఇక దేశంలోని ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్ సేవలను అందించాలనే ఉద్దేశంతో స్లైస్ బ్యాంక్ యుపిఐ ఆధారిత క్రెడిట్ కార్డును విడుదల చేసింది. దీని ద్వారా భారతదేశంలో బ్యాంకింగ్ విధానాన్ని మార్చాలని భావిస్తోంది. భారతదేశంలోనే మొట్టమొదటి యూపీఐతో పనిచేసే భౌతిక బ్యాంక్ శాఖను, ఎటిఎంను ప్రారంభించింది. వేగంగా బ్యాంకింగ్ సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుఉంది. స్లైస్ సూపర్ కార్డ్ పేరుతో విడుదల చేసిన ఈ యూపీఐ క్రెడిట్ కార్డు ద్వారా వినియోగదారులు సులభంగా క్రెడిట్ పొందవచ్చు. ఈ కంపెనీ ఇటీవలే ఎన్ఇఎస్ఎఫ్‌బితో విలీనం అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించడంతో పాటు టెక్నాలజీ వినియోగాన్ని పెంచాలని భావిస్తోంది. ఈ స్లైస్ బ్యాంక్ బెంగళూరులోని కోరమంగళలో సరికొత్త యూపీఐ ఆధారిత బ్యాంక్ శాఖను ప్రారంభించింది. ఇది బ్యాంకింగ్ అనుభవాన్ని మరింత సులభతరం చేస్తుంది. వినియోగదారులు ఇప్పుడు డిజిటల్ బ్యాంక్ శాఖకు వెళ్లి, వేగవంతమైన సేవలను పొందవచ్చని స్లైస్ బ్యాంక్ తెలిపింది. ద్వారా డబ్బులు తీసుకోవచ్చు. డిపాజిట్ కూడా చేయవచ్చు. అంతే కాదండోయ్ దీని ద్వారా బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయడం, ఇతర బ్యాంకింగ్ సేవలను కూడా ఈ యూపీఐ ఆధారిత బ్రాంచులో పొందే అవకాశం ఉందని బ్యాంకు తెలిపింది.




# ఈ బ్యాంకుల్లో మినిమమ్ బ్యాలెన్స్ ఛార్జీల్లేవ్!

**న్యూఢిల్లీ, జులై 4:** దేశంలోని కోట్లాది మంది బ్యాంకు ఖాతాదారులకు పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు భారీ ఊరట అందించాయి. పొదుపు ఖాతాల్లో కనీస సగటు నిల్వ (మినిమమ్ బ్యాలెన్స్) లేకపోతే విధించే అపరాధ రుసుమును (పెనాల్టీ) రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్‌తో పాటు తాజాగా ఇండియన్ బ్యాంక్ కూడా ఈ జాబితాలో చేరింది. తమ బ్యాంకు పరిధిలోని అన్ని సేవింగ్స్ ఖాతాలపై మినిమమ్ బ్యాలెన్స్ ఛార్జీలను ఎత్తివేస్తున్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రకటించింది. ఈ నిర్ణయం జులై 1 నుంచే అమల్లోకి వచ్చిందని, ముఖ్యంగా మహిళలు, రైతులు, అల్పాదాయ వర్గాలకు మద్దతుగా ఈ చర్య తీసుకున్నామని బ్యాంకు ఎండీ, సీఈఓ అశోక్ చంద్ర తెలిపారు. ఇదే బాటలో కెనరా బ్యాంక్ కూడా మే నెలలోనే నిర్ణయం తీసుకోగా, జులై 1 నుంచి ఆ నిబంధనను అమలు చేస్తోంది. మరోవైపు బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా తమ ఖాతాదారులకు ఊరట కల్పించింది. ఈ జాబితాలో తాజాగా ఇండియన్ బ్యాంక్ చేరింది. జులై 7వ తేదీ నుంచి అన్ని రకాల పొదుపు ఖాతాలపై ఈ ఛార్జీలను మినహాయిస్తున్నట్లు స్పష్టం చేసింది. దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఇప్పటికే ఈ సౌకర్యాన్ని తన ఖాతాదారులకు అందిస్తోంది. 2020లోనే ఎస్‌బీఐ తమ పొదుపు ఖాతాలపై మినిమమ్ బ్యాలెన్స్ ఛార్జీలను పూర్తిగా రద్దు చేసింది. ఇప్పుడు ఇతర ప్రభుత్వ బ్యాంకులు కూడా అదే మార్గాన్ని అనుసరించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.




# ట్రేడ్ డీల్‌పై ఇన్వెస్టర్ల ఫోకస్.. సూచీలకు స్వల్ప లాభాలే..

**ముంబై, జులై 4:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాంతాన్ని స్వల్ప లాభాలతో ముగించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ.. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ వార్తలపై దృష్టిపెట్టిన ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. దీంతో ట్రేడింగ్‌లో తీవ్ర ఊగిసలాటకు గురైన సూచీలు చివరకు స్వల్ప లాభాలను దక్కించుకున్నాయి. సెన్సెక్స్ దాదాపు 200 పాయింట్లు పెరగ్గా.. నిఫ్టీ 25,450 మార్క్ దాటింది. ఉదయం 83,306.81 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్.. కాసేపటికే ఒత్తిడికి గురైంది. ఒక దశలో 83,015.83 వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి పడిపోయిన సూచీ చివర్లో కాస్త కోలుకుంది. మార్కెట్ ముగిసే సమయానికి 193.42 పాయింట్లు లాభపడి 83,432.89 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 25,331.65 25,470.25 మధ్య కదలాడింది. చివరకు 55.70 పాయింట్లు పెరిగి 25,461 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 17 పైసలు బలపడి 85.38గా స్థిరపడింది. ఆటో మొబైల్, టెలికాం, లోహ రంగాలు మినహా మిగతా అన్ని రంగాల సూచీలు లాభపడ్డాయి. బ్యాంకింగ్, ఫార్మా, చమురు, ఐటీ, రియల్టీ, మీడియా రంగ సూచీలు 0.4 నుంచి 1 శాతం మేర పెరిగాయి. నిఫ్టీలో బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, రెడ్డీస్ ల్యాబ్స్, ఐసీఐసీఐ బ్యాంక్, హిందుస్థాన్ యునిలివర్ షేర్లు రాణించగా, ట్రెంట్, టాటా స్టీల్, ఐషర్ మోటార్స్, టెక్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు స్వల్పంగా పెరిగాయి.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.